ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 06.07.2026 | సంపుటి : 12 | సంచిక : 347 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## ముంబై మునిగింది

### భారీ వర్షాలతో దేశ ఆర్థిక రాజధాని అతలాకుతలం..

**ముకేశ్ అంబానీ కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం**

**ముంబై(జనంసాక్షి):** భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఇంకా వర్షం కురిసే అవకాశం ఉండటంతో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని బృహన్ మిగతా 2లో..



**వేధింపులు పోత్సహించేలా కంటెంట్..**

### వెంటనే తొలగించండి

మెటాకు కేంద్రం ఆదేశాలు 2

# మెట్రో నిర్ణయాలు అమలు చేయండి

**కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖలు**

- మెట్రో రైలుపై అధ్యయన బాధ్యతలు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలి
- మొదటి దశ టేకోవర్, రెండో దశ అనుమతుల్లో తీవ్ర జాప్యం
- గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలేది?
- షరతులు, విధివిధానాలు వెంటనే ఖరారు చేయాలి
- వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని సీఎం విజ్ఞప్తి



తెలంగాణలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలి. ఈమేరకు గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదు.మెట్రో రైలుపై అధ్యయన బాధ్యతలు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలి.షరతులు, విధివిధానాలు వెంటనే ఖరారు చేయాలి.మెట్రో మొదటి దశ టేకోవర్, రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయి. వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలి - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు రాశారు. గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్నారు. మెట్రో రైలుపై అధ్యయన బాధ్యతలు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని సీఎం కోరారు. షరతులు, విధివిధానాలు వెంటనే ఖరారు చేయాలన్నారు. మెట్రో మొదటి దశ టేకోవర్, రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయని, వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి లేఖల్లో కోరారు.మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే పలుమార్లు లేఖలు రాశారు. తెలంగాణలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని మిగతా 2లో..



## 'సర్' ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టండి

**అర్హత కలిగిన ఓటు మిస్ కాకుండా చూసుకోవాలి**

**ఆరు గ్యారంటీలు, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రచారం చేయండి**

**కాంగ్రెస్ శ్రేణులకు ఉప ముఖ్యమంత్రి భట్టి,మంత్రులు పొన్నం, అజారుద్దీన్ దిశానిర్దేశం**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకంగా క్షేత్రస్థాయిలో చేపట్టాలని, అదే సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.ప్రజాభవన్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన కీలక సమావేశానికి హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ తో కలిసి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ "రాబోయే ఎన్నికల దృష్ట్యా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ ను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి. ఓట రు మిగతా 2లో..

### అయోధ్య విరాళాల దోపిడీకి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లే

## బాధ్యత వహించాలి



**రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ మతాన్ని వాడుకుంటుంది:కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లే కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అధికారాన్ని నిలుపుకోవడానికి ఎస్ఐఆర్, డీలిమిటేషన్‌ను వాడుకుంటూ బీజేపీ సర్కార్ 'ఓట్ చోరీ' చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకోవడమే కాకుండా, ఎన్నికల అవకతవకల ద్వారా ప్రజాస్వామ్య సంస్థలను కూడా బలహీనపరుస్తోందని మండిపడ్డారు. మిగతా 2లో..

## కన్నెపల్లి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయండి

- స్పందించకపోతే 60 వేల మందితో కలిసి పంపులు ఆన్‌చేస్తాం
- బ్యారేజీ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది
- సాగునీటి కోసమే కాదు.. తాగునీటికీ ఇబ్బంది ఉంది: కేటీఆర్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంపు హౌజ్ ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలోకి కలుస్తున్నప్పటికీ రైతుల అవసరాలకు వినియోగించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మేడిగడ్డ బరాజ్‌తో సంబంధం లేకుండానే కన్నెపల్లి పంపు హౌజ్ మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగానే ఆ పని చేయడం లేదని మిగతా 2లో..






**మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో**

# నీరు నిల్వచేయలేం

**అలా చేస్తే మేడిగడ్డ కొట్టుకుపోవడంతోపాటు భద్రాచలం ముంపుకుగురయ్యే ప్రమాదముంది**

**ఈ విషయాన్ని స్వయంగా ఎన్‌డీఎస్‌ఏనే చెప్పింది**

- కేవలం కమీషన్ల కోసమే కేసీఆర్ తుమ్మిడిహట్టి నుంచి కాళేశ్వరానికి మార్చారు
- ప్రాజెక్టు డిజైన్ చేసింది.. కట్టింది.. కూలింది.. భారాస హయాంలోనే
- బీఆర్ఎస్ కక్కుర్తితో రాష్ట్రానికి తీవ్ర నష్టం :మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను రైతుల కోసం కాకుండా కమిషన్ల కోసమే నిర్మించిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లలో ప్రాజెక్టుల పేరిట రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. కాళేశ్వరం డిజైన్ చేసింది.. కట్టింది.. కూలింది.. ఆ పార్టీ హయాంలోనేనని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లు నాశనం చేసి ఇప్పుడు నాటకాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పిదాల వల్లే మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు పనికిరాకుండా పోయాయన్నారు. సచివాలయంలో జలవనరులశాఖ మిగతా 2లో..

## మీలాగా మేము ఇంజనీర్లం కాదు

- ప్రాజెక్టులను కాపాడుకునే బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది
- ఈ మేరకు అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తాం
- బదనాం చేసేందుకు బీఆర్ఎస్ కుట్ర: మంత్రి శ్రీధర్ బాబు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణాలపై ఇంజనీర్లుగా అవతారం ఎత్తి, అక్రమాలకు పాల్పడిన బీఆర్ఎస్ నేతలు సిగ్గు లేకుండా కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శనకు రావడం ఆశ్చర్యకరంగా ఉందని, మీలాగా మేము ఇంజనీర్లం కాదు అని, అధికారుల సూచనలు, సలహాలు పాటించి ముందుకు సాగుతామని, మిగతా 2లో..



**కాళేశ్వరం అంశంపై బీఆర్ఎస్**

## డ్రామాలాడుతోంది

- గోదావరి పరివాహక ప్రాంత ప్రజల భద్రతలో రాజీ పడబోం
- కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం

వార్త 2 లో

### ఖమేనీ అంతియయాత్రలో

## అశేష జనవాహిని

**కార్యక్రమంలో కనిపించని ఇరాన్ కొత్త చీఫ్ మొజ్తబా**

**టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ పార్థివ దేహాన్ని చూసేందుకు లక్షలాదిగా అభిమానులు తరలివస్తున్నారు. ఆయన భౌతిక కాయాన్ని టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా సముదాయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అయితే, ఈ కార్యక్రమంలో ఖమేనీ కుమారుల్లో ముగ్గురు పాల్గొన్నప్పటికీ.. మరో తనయుడు, ప్రస్తుత సుప్రీం లీడర్ మొజ్తబా మాత్రం హాజరుకాలేదని తెలుస్తోంది.ఇరాన్ అధికారిక మీడియా ప్రకారం.. ప్రార్థనల వేళ అలీ ఖమేనీ శవపేటిక మిగతా 2లో..





**ఒక్క దెబ్బతో ఇరాన్ నేతలందరినీ**

## చంపేసేవాళ్లం

**కానీ మాతో చర్చలు జరపడానికి అక్కడ ఎవరూ మిగలరనే కారణంతో వారిని వదిలేశాం**

- మిగిలిన నాయకత్వాన్ని నిర్మూలించగలను
- ట్రంప్ మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు
- ఇరాన్‌తో చర్చల కోసం తనతో సమావేశం కావాలని నెతన్యాహు అభ్యర్థించారని వెల్లడి

**వాషింగ్టన్(జనంసాక్షి):** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ అంత్యక్రియల అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. తాము అనుకుంటే ఖమేనీ అంత్యక్రియల సమయంలోనే అక్కడున్న నాయకులందరినీ ఒక్కదెబ్బతో చంపేవాళ్లమని.. కానీ తమతో చర్చలు జరపడానికి ఎవరూ ఉండరనే కారణంతో వారిని వదిలేశామని అన్నారు. ఆ దేశంలోని మిగిలిన నాయకత్వాన్ని నిర్మూలించగలనని.. కానీ అలా చేయాలని తాను అనుకోవట్లేదని పేర్కొన్నారు. ఖమేనీ అంత్యక్రియల్లో వేలాది మంది ఇరానియన్లు కన్నీరు పెట్టుకోవడంపై మిగతా 2లో..



**అభిమానుల ఆవేదనను**

## అమెరికా ఎన్నటికీ అర్థం చేసుకోలేదు

**ఎందుకంటే ఆ దేశానికి నాగరికత, చరిత్ర లేదు**

**ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్**

2 లో..



## హర్మ్యూజ్ వద్ద ఇరాన్ టోల్ వసూలు

**రుసుం నుంచి మిత్రదేశాలకు మినహాయింపు**

**టెహ్రాన్(జనంసాక్షి):** ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో కొత్త టోల్ విధానాన్ని అమలు చేయడానికి ఇరాన్ చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దుల్ రెజా రహ్మానీ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మ్యూజ్ తమ ప్రాదేశిక జలాల్లో భాగంగా ఉన్నందున.. జలసంధిలో సేవా రుసుం వసూలు చేస్తామని పేర్కొన్నారు. ఇవి టోల్ కిందకు రావన్నారు. ఈ విషయంపై ఒమన్‌తో చర్చలు జరుపుతున్నామన్నారు. కష్టసమయంలో తమకు సహకారం అందించిన మిత్ర దేశాలకు సేవా రుసుం విషయంలో ప్రత్యేక ప్రాధాన్యాన్ని కల్పించడానికి మిగతా 2లో..

## సోషల్ మీడియా ఆక్టివిస్ట్ రావణ్‌పై 'ఉపా'కేసు

**డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యల నేపథ్యలో అరెస్టు**

**అమరావతి(జనంసాక్షి):** యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌ను గన్నవరం పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గన్నవరం జనసేన నేత గరికపాటి శివ శంకర్ ఫిర్యాదు మేరకు రావణ్‌పై కేసు నమోదైంది. మరో కేసులో మిగతా 9లో..






## మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీరు నిల్వచేయలేం

అధికారులతో కలిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. "మూడు బ్యారేజీల్లో నీరు నిల్వ చేయొద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చెప్పింది. ఫౌండేషన్‌లో లోపాలు ఉన్నాయని నిపుణులు తెలిపారు. నీరు నిల్వ చేస్తే మేడిగడ్డ కొట్టుకుపోతుందని.. భద్రాచలంతో పాటు పలు గ్రామాలు మునిగిపోతాయని ఇంజినీర్లు చెప్పారు. బీఆర్ఎస్ నేతల కక్కుర్తితో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. కమిషన్ల కోసమే ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చారు. ఎక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ కమిషన్లు వస్తాయని భావించారు. ప్రాజెక్టు సరిగా నిర్మించి ఉంటే వినియోగించేందుకు మాకు అభ్యంతరం లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దింపే పరిస్థితి లేదు. గేట్లు దింపి నీరు నిల్వ చేయకుండా ఎత్తిపోయలేం. ప్రాణహిత- చేవెళ్లపై రూ.11వేల కోట్లు ఖర్చు చేశాక ప్రాజెక్టును మార్చారు. రీడిజైనింగ్ చేసిన కొత్త ప్రాజెక్టు పూర్తికి రూ.1.20లక్షల కోట్లు అవసరమని కాగ్ ఆనాడే చెప్పింది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

## కాళేశ్వరం అంశంపై బీఆర్ఎస్ డ్రామాలాడుతోంది

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం అంశంపై బీఆర్ఎస్ డ్రామాలాడుతోందని మంత్రి సీతక్క విమర్శించారు. ఈ విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు, భద్రతే తమ ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమన్నారు. "మేడిగడ్డ బ్యారేజ్ అంశంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదికనే ప్రభుత్వం అనుసరిస్తోంది. నిపుణులు అనుమతి ఇస్తేనే నీటిని ఎత్తిపోస్తాం. కాళేశ్వరం నిర్మాణంలో అనేక లోపాలు, అవినీతి కారణంగానే ఈ పరిస్థితి తలెత్తింది. మేడిగడ్డలో ప్రమాదం జరిగితే గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. రైతుల పేరుతో ప్రజలను బీఆర్ఎస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. గోదావరి పరివాహక ప్రాంత ప్రజల భద్రతలో ప్రభుత్వం ఎలాంటి రాజీపడబోదు. బీఆర్ఎస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే నిపుణుల కమిటీ ముందు వాదనలు వినిపించాలి" అని సీతక్క అన్నారు.

## మీలాగా మేము ఇంజనీర్లం కాదు

ప్రాజెక్టులను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని ఐటి, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో కలిసి మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతల తీరును ఎండగట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారుల మాట వినకుండా డిజైన్ మార్చి ఇంజనీర్లుగా అవతారం ఎత్తిన బీఆర్ఎస్ నాయకులు ఏ మొహం పెట్టుకుని వచ్చారని ప్రశ్నించారు. వారి ప్రభుత్వ హాయం లోనే పిల్లర్లు కుంగిపోయాయని, దాంతో వారి అవినీతి భాగోతం బట్టబయలైందని గుర్తు చేశారు. అప్పట్లో వారు చేసిన పనితనానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం జరిగిందన్నారు. వారు చేసిన తప్పులు, అప్పులకు తెలంగాణ రాష్ట్రం కోలుకోకుండా అయ్యిందన్నారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన తర్వాత వారి సూచనలు, సలహాల మేరకు ఇంజనీర్ల పర్యవేక్షణలో మరమ్మతు పనులు కొనసాగుతాయని చెప్పారు. వారి సూచనల మేరకే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని చెప్పారు. తొందరపాటు నిర్ణయాలతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు ఏర్పడతాయని అలాంటి తప్పులు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ నేతలు చేసిన తప్పులు మర్చిపోయి కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శించడం సిగ్గుచేటన్నారు. వారు చేసిన తప్పుకు ఈ ప్రాంత రైతులకు క్షమాపణలు చెప్పాలని, ఆ తర్వాతనే ఈ ప్రాంతంలో అడుగు పెట్టాలని మంత్రి శ్రీధర్ బాబు హితవు పలికారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రాజెక్టు పేరుతో అవినీతికి పాల్పడి లక్ష కోట్ల రూపాయలు దిగమింగిన బీఆర్ఎస్ నేతలు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆది నుంచి అబద్ధాలతో ప్రజలను మభ్యపెడుతూ వచ్చిన బీఆర్ఎస్ నేతలు వారి హయాంలో అన్ని రంగాల కాంట్రాక్టు పనుల్లో అవినీతికి పాల్పడడం జరిగిందన్నారు. అలాంటి వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన బుద్ధి రాలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతూ ఉందని, నిరుపేదల అభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లూరి మధు, పిప్పాల రాజేందర్, బేతేల్లి మధుకర్ రెడ్డి, సాంబమూర్తి, మట్టెవాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నెపల్లి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయండి

మండిపడ్డారు. రైతులకు వాస్తవ పరిస్థితిని చూపించేందుకే తాము కన్నెపల్లిని సందర్శించామని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా పర్యటనను పూర్తి చేశామని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ నుంచి భారీ కాన్వాయ్‌తో కన్నెపల్లికి బయల్దేరిన కేటీఆర్‌ను పెంబర్తి, జనగామ, ఘన్‌పూర్, పరకాల, భూపాలపల్లి, కాటారం, మహదేవ్‌పూర్‌లలో పోలీసులు అడ్డుకున్నారు. నాలుగు గంటల్లో చేరుకోవాల్సిన ప్రయాణాన్ని అడుగడుగునా అడ్డుకోవడంతో తీవ్ర జాప్యం జరిగింది. ఆయన కాన్వాయ్‌లో నలభైకి పైగా వాహనాలు ఉండగా మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని పోలీసులు తెలిపారు. కన్నెపల్లి పంపు హౌజ్ సందర్శనకు అనుమతి లేదని స్పష్టం చేయడంతో బిఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. బారికేడ్లను తొలగించి ముందుకు వెళ్లేందుకు పార్టీ శ్రేణులు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు బిఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఎట్టకేలకు కాళేశ్వరం లోని కన్నెపల్లి పంపు హౌజ్ సందర్శన జరిగింది. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, నీటిని రైతులకు అందిస్తే యూరియా సరఫరా, ధాన్యం కొనుగోలు, బోనస్ వంటి అంశాలపై ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. కన్నెపల్లి నుంచి నీటిని విడుదల చేస్తే లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చని తెలిపారు. వ్యవసాయానికి నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశమే ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యాన్ని ప్రజలకు తెలియకుండా ఉండేందుకే తమ పర్యటనను అడ్డుకుంటున్నారని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే పోలీసులు పైనుంచి ఆదేశాలు ఉన్నాయని చెబుతూ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎల్‌నినో, వర్షాభావంతో ప్రజలు బాధపడుతున్న సమయంలో కన్నెపల్లి వద్ద ఉన్న నీటి లభ్యతను ప్రజలకు చూపించేందుకు వెళ్తుంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని ప్రశ్నించారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా కన్నెపల్లి చేరుకుని రైతులకు వాస్తవాలను చూపిస్తామని స్పష్టం చేశారు.

# 'మెట్రో' నిర్ణయాలు అమలు చేయండి

కోరారు. కొద్దిరోజుల క్రితమే ఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై విస్తృతంగా చర్చించారు.తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మెట్రో రైలు విస్తరణను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనికి కేంద్రం సహాయం అవసరమని సీఎం వివరించినట్టు సమాచారం. మెట్రో విస్తరణకు నోచుకోకపోవడంతో హైదరాబాద్‌లో నగరంలో ఎదురవుతున్న ఇబ్బందులను కేంద్రమంత్రి దృష్టికి రేవంత్ తీసుకెళ్లారు. విస్తరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పిన సీఎం, దీనికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన రుణాన్ని త్వరగా విడుదలయ్యేలా చొరవ చూపాలని కోరారు.భేటీ సందర్భంగా ఈ ప్రాజెక్టు చుట్టూ ఏర్పడిన రాజకీయ అంశాలు సైతం చర్చకు వచ్చినట్లు తెలిసింది. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మెట్రో రెండో దశ అనుమతులపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించిన పలు అంశాలపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. అయితే మెట్రో అంశం రైల్వే శాఖ పరిధిలోనిది కానందున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో తాను మాట్లాడతానని హామీ ఇవ్వడంతో పాటు వెంటనే ఆ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

## ఒక్కదెబ్బతో ఇరాన్ నేతలందరినీ చంపేసేవాళ్లం

ట్రంప్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ దేశ ప్రజలు ఖమేనీని ద్వేషిస్తున్నారని ఇంతకాలం తాను అనుకున్నట్లు తెలిపారు. తాను అనుకున్నదే నిజమై ఉండొచ్చని.. అంత్యక్రియల సమయంలో ప్రజలు మొసలి కన్నీరు కార్చి ఉంటారని అన్నారు.ఇరాన్ విషయంలో చర్చలు జరపడానికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తనతో సమావేశం కావాలని అభ్యర్థించారని ట్రంప్ తెలిపారు. తాను నాటో సదస్సు నుంచి వచ్చిన తర్వాత.. వచ్చే వారంలో చర్చలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. తామిద్దరం చాలా బాగా కలిసిపోతామన్నారు. కానీ తమలో బాస్ ఎవరో నెతన్యాహుకు తెలుసని తనను తాను ఉద్దేశించి ట్రంప్ పేర్కొన్నారు. శుక్రవారం ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారని.. అమెరికాలో త్వరలో భేటీ కావాలని నిర్ణయించుకున్నారని నెతన్యాహు కార్యాలయం తెలిపింది.

**రెండోసారి కాదు.. మూడోసారి అధ్యక్షుడిని: ట్రంప్**

వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ తరచూ వార్తల్లో నిలిచే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని శనివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. అధ్యక్ష భాధ్యతలు నిర్వర్తిస్తుండటం ఇది మూడోసారి అని చెప్పుకొన్నారు. నిజానికి ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం రెండోసారి. అయినప్పటికీ.. 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ తన విజయాన్ని దోచుకున్నారని ఆయన పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. దానిని కూడా తన ఖాతాలో వేసుకోని మూడోసారి అధ్యక్షుడిని అని అన్నారు. అంతలోనే నవ్వుకుంటూ వివాదాస్పద అంశాల జోలికి పోవాలనుకోవట్లేదంటూ తన ప్రసంగాన్ని కొనసాగించారు.ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా అమెరికా ఎదిగిందంటే.. అది అనుకోకుండా జరిగిందేమీ కాదని ట్రంప్ అన్నారు. మొదటిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు దేశ సైన్యాన్ని పునర్నిర్మించినట్లు చెప్పారు. దేశ సైనిక సామర్థ్యాలను పెంపొందించడానికి తాను చేసిన కృషిని ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. ఈ క్రమంలోనే.. 2020 అధ్యక్ష ఎన్నికలను తీవ్రంగా వ్యతిరేకించిన ట్రంప్.. 'నిజానికి ఇప్పుడు నేను మూడోసారి అధ్యక్షుడిగా ఉన్నట్లు లెక్క. కానీ, వివాదాల జోలికి వెళ్లకూడదనుకుంటున్నాను కాబట్టి.. నేను అలా అనను' అంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు.2020 ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అయితే, తన ఓటమిని అంగీకరించని ట్రంప్.. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఫలితాలను మార్చాలనే ఉద్దేశంతో పలు కీలక రాష్ట్రాల్లో వ్యాజ్యాలు కూడా దాఖలు చేశారు. అయితే, తన ఆరోపణలను నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారు. మరోవైపు జో బైడెన్ ఎన్నికను కాంగ్రెస్ ధ్రువీకరించకుండా అడ్డుకునేందుకు 2021 జనవరిలో ట్రంప్ మద్దతుదారులు అమెరికా క్యాపిటల్ భవనంపై దాడి చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది. ట్రంపే వారిని రెచ్చగొట్టారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

## అభిమానుల ఆవేదనను అమెరికా ఎన్నటికీ అర్థం చేసుకోలేదు

టెహ్రాన్(జనంసాక్షి):తాము అనుకుంటే ఖమేనీ అంత్యక్రియల సమయంలోనే అక్కడున్న నాయకులందరినీ ఒక్కదెబ్బతో చంపేవాళ్లమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ మండిపడింది. ఖమేనీ మరణంతో ఆయన అభిమానులు పడుతున్న వేదనను అమెరికా ఎన్నటికీ అర్థం చేసుకోలేదని పేర్కొంది. వారికి నాగరికత, చరిత్ర లేదని విమర్శించింది. ఈ మేరకు ఆర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం సోషల్ మీడియాలో స్పందించింది.

## ఖమేనీ అంతియయాత్రలో అశేశ జనవాహిని

వద్ద ముగ్గురు కుమారులు మొస్తఫా, మెయిసమ్, మసౌద్ ఖమేనీలు నిలబడి కనిపించారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబఫ్, విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ, ఐఆర్‌జీసీ చీఫ్ కమాండర్ అహ్మద్ వాహిదీలు కూడా పాల్గొన్నారు. అయితే, సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొజ్తబా ఖమేనీ బహిరంగంగా కనిపించకపోవడం, తాజాగా తండ్రి అంత్యక్రియలకు దూరంగా ఉండటంపై చర్చ జరుగుతోంది.వారం క్రితం ఆయన సతీమణి అంత్యక్రియల్లోనూ మొజ్తబా కనిపించలేదు. అయితే, భద్రతా కారణాల వల్ల ఆయన హాజరుకావడం లేదని ఇరాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు తెలిసింది. అలీ ఖమేనీకి ఇద్దరు కుమార్తెలు ఉండగా వీరిలో ఒకరు ఫిబ్రవరి 28 నాటి దాడుల్లోనే ప్రాణాలు కోల్పోయారు.

## హార్మూజ్ వద్ద ఇరాన్ టోల్ వసూలు

చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హార్మూజ్‌లో ప్రయాణ భద్రతకు హామీ ఇవ్వడం, నౌకల రాకపోకలను పర్యవేక్షించడం, భారీ సంఖ్యలో నౌకల వల్ల కలిగే పర్యావరణ పరిణామాలను ఎదుర్కోవడం వంటివాటిని ఒమన్ సహకారంతో ఇకపై తాము పర్యవేక్షిస్తామని అబ్దుల్ రెజా వెల్లడించారు. కాగా హార్మూజ్‌లో విధించే సేవా రుసుంపై మిత్రదేశాలకు ప్రత్యేక రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలని టెహ్రాన్ యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.


**హార్మూజ్ రంగస్థలం కాదు..**

హార్మూజ్ భద్రతను ఇకపై ఒమన్‌తో కలసి తాము చూసుకుంటామని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ గరీబాబాది పేర్కొన్నారు. ఇతర దేశాలు సైనిక విన్యాసాలు చేపట్టడానికి ఈ జలసంధి రంగస్థలం కాదని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ నిర్దేశించిన మార్గంలో కాకుండా.. ఒమన్ తీరం వెంబడి ప్రయాణించడానికి ప్రయత్నించిన ఎనిమిది నౌకలను అక్కడి అధికారులు వెనక్కి పంపినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి.

## వేధింపులను పోత్సహించేలా కంటెంట్.. వెంటనే తొలగించండి

**- మెటాకు కేంద్రం ఆదేశాలు..!**

న్యూఢిల్లీ(జనంసాక్షి):చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రేరేపించేలా ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల విషయంలో కేంద్ర ప్రభుత్వం మెటాకు నోటీసులు జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వేధింపులను పోత్సహించేలా ఇన్‌స్టాలో ఉన్న ప్రకటనలు కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఈ విషయంపై 7రోజుల్లోగా వివరణ ఇవ్వాలని పేర్కొంది. వివరణ ఇవ్వడంలో విఫలమైతే.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇలాంటి ప్రకటనలకు ఎలా ఆమోదం ఇచ్చారని కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ఎటువంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని మెటాను ఆదేశించింది. థర్డ్ పార్టీ కంటెంట్ అయినప్పటికీ ప్రకటనల ద్వారా మెటాకే ఆదాయం వస్తుంది కాబట్టి.. ఈ ఆరోపణలు నిజమని తేలితే ఆ సంస్థనే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇదీ చదవండి: సమస్య ఇ20 పెట్రోల్‌తో కాదు.. కలుషిత ఇంధనంతోనే: టీకేఎం




## ముంబై మునిగింది

ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అక్కడి ప్రజలను కోరింది. గడిచిన 24 గంటల్లో పలు చోట్ల 20 సెం.మీ వర్షపాతం నమోదు కాగా.. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో 30 సెం.మీ వర్షపాతం నమోదైంది.మరోవైపు ముంబయిలోని కొన్ని ప్రాంతాల్లో మెట్రో, ప్రజా రవాణా సేవలు యథాతథంగా కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే, మెట్రో సేవల్లో అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. వర్షం కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్ 1916కి ఫోన్ చేసి చెప్పాలని బీఎంసీ అధికారులు సూచించారు. సముద్ర తీరప్రాంతంలో నివసించే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రపు అలలు 4.19 మీటర్ల ఎత్తున ఎగసిపడే అవకాశం ఉందని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. థానె, పాల్ఘర్, నవీ ముంబయి, పుణె ప్రాంతాల్లో పరిస్థితులు అధ్వాన్నంగా తయారయ్యాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. మరికొన్ని చోట్ల రహదారులు నీట మునిగిపోయాయి. జలదిగ్బంధంలో చిక్కుకున్న వారిని అధికారులు, సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. విక్రోలిలో అత్యధికంగా 31.06 వర్షపాతం నమోదైంది.ప్రముఖ వ్యాపార వేత్త ముకేశ్ అంబానీ భద్రతా కాన్వాయ్‌కి పెను ప్రమాదం తప్పింది. పశ్చిమ శివారులోని బంద్రా ప్రాంతంలో ఓ భారీ వృక్షం కాన్వాయ్ ఎదుట కూలిపోయింది. దీంతో కాసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అప్రమత్తమైన అధికారులు చెట్టును తొలగించి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## పాక్ రక్షణ మంత్రికి మతి భ్రమించింది

### భారత్ స్ట్రాంగ్ కౌంటర్

న్యూఢిల్లీ(జనంసాక్షి): పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఆయనకు మతి స్థిమితం లేదని, అందుకే ఏవేవో మాట్లాడుతున్నాడని వ్యాఖ్యానించింది. ఇటీవల ద్వీపదేశం సీషెల్స్‌లో పర్యటించిన ప్రధాని మోదీ ఆ దేశ అత్యున్నత ' గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఖవాజా ఆసిఫ్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అది రూపొందించుకున్న గౌరవం (కావాలని ఇప్పించుకున్న అవార్డు) అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఆయనకు పనేం లేదని, అవగాహనలేని అంశాలపై అర్థరహితమైన వ్యాఖ్యలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడని వ్యాఖ్యానించింది. మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విదేశాంగ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కౌంటర్ ఇచ్చారు. ఇతరులపై అసూయ ఎప్పటికీ మంచి చేయదని, చెడును ప్రేరేపిస్తుందని అన్నారు. ముఖ్యంగా విద్వేషపూరిత ప్రసంగాలకు అలవాటు పడినవారిలో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని చెప్పారు.సీషెల్స్ అత్యున్నత పురస్కారం అందుకున్న తొలి వ్యక్తిగా ప్రధాని మోదీ నిలిచారు. మోదీ పర్యటనకు కొద్ది వారాల ముందే అంటే జూన్ 24న గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్ పురస్కారానికి అక్కడి మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

# 'సర్' ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టండి

జాబితాలో అన్-మ్యాపింగ్ పేర్లు, సాంకే తిక లోపాలు, ఇంటి పేర్ల మార్పులు, స్పెల్లిం గ్ తప్పులు వంటివి లేకుండా బి.ఎల్.ఏ లతో కలిసి డివిజన్ స్థాయి నాయకులు నిరంతరం పర్యవేక్షించాలి. ఓటరు నమోదులో ఏ ఒక్కరూ మినహాయింపు కాకుండా పకడ్బందీగా వ్యవహరించాలి" అని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఉన్న సానుకూలతను ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.? రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను, సంక్షేమ కార్యక్రమాలను, 40 వేల కోట్లతో ప్రజా ప్రభుత్వం చేపట్టిన నగర అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తీసుకువెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, తలసరి 6 కేజీల నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు వైద్య సాయం వంటి పథకాల ద్వార ప్రజలకు ఆర్థికంగా పెద్ద ఎత్తున ఉపయోగపడుతున్న వివరాలను వివరించాలని తెలిపారు. హైదరాబాద్ నగరంలో రూ. 40,000 కోట్లతో చేపడుతున్న రోడ్లు, ఫ్లై ఓవర్ల నిర్మాణాల గురించి ప్రజలకు చెప్పాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుతో పాటు, నేరుగా విద్యార్థుల ఖాతాల్లోనే నగదు జమ చేసే నిర్ణయం ప్రభుత్వం తీసుకున్నది అన్నారు. అదేవిధంగా కోటి 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ పథకాలు ప్రజలకు ఒక ధైర్యం భరోసాను కల్పిస్తున్నాయని వివరించారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత పదేళ్ల భయానక వాతావరణాన్ని తొలగించి, తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛా వాతావరణాన్ని, హుందాతనంతో కూడిన పాలనను అందిస్తున్నామని పునరుద్ఘాటించారు. "ఫోన్ ట్యాపింగ్ భయం లేని, అందరూ స్వేచ్ఛగా మాట్లాడుకునే ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ స్వేచ్ఛను, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది" అని పేర్కొన్నారు."పార్టీ గెలుపు బూత్ స్థాయి నుంచే మొదలవ్వాలి. ప్రతి బూత్ ఇన్‌చార్జి తన పరిధిలోని ప్రజలతో మమేకమై ఉండాలి. చిన్న చిన్న సమస్యలైనా సరే, రేషన్ కార్డుల వంటి విషయాల్లో వెంటనే స్పందించి పరిష్కరిస్తే, అది ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని రెట్టింపు చేస్తుంది" అని భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు.ఓటరు జాబితాలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ అజారుద్దీన్ లు మాట్లాడుతూ, "అన్-మ్యాపింగ్ లో ఉన్న పేర్లు 50 శాతానికి పైగా ఉండటం ఆందోళనకరమని, వీటిని బి.ఎల్.ఏ లతో కలిసి వెంటనే సరిచూసుకోవాలి. అలాగే, లాజికల్ డిస్క్రిపెన్సీ పేరుతో పేర్లు తొలగిపోయే ప్రమాదం ఉందని, స్పెల్లింగ్ తప్పులు, ఇంటి పేరు మార్పుల వంటి లోపాలను గుర్తించి, బి.ఎల్.ఓ లకు సకాలంలో ధృవీకరణ పత్రాలు అందించాలి" అని సూచించారు. బి.ఎల్.ఓలు ఇంటింటికి వచ్చే సమయంలో ఓటర్లు అందుబాటులో ఉండేలా సమన్వయం చేయాలని కోరారు. దాదాపు 40,000 కోట్ల రూపాయల వ్యయంతో హైదరాబాద్ నగరంలో రోడ్లు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లు వంటి అనేక అభివృద్ధి పనులు వడి, వడిగా సాగుతున్నాయని ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు వెళుతుందని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారులు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, శాసనసభ్యులు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మాజీ ఎంపీ అజన్ కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఖురేషి, డిసిపి అధ్యక్షులు రోహిత్, దీపక్ జాను, నాయకులు కోట నీలిమ, రాజేందర్, ఫిరోజ్ ఖాన్, అడెం సంతోష్, జగదీష్, అరవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రామమందిర విరాళాల దోపిడీకి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లే బాధ్యత వహించాలి

కర్ణాటకలోని చిక్కబళ్లాపురలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మల్లికార్జున ఖర్గే ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ సర్కార్‌పై తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించారు."అయోధ్యలో దేవుడి పేరుతో ఎంత దోపిడీ జరుగుతోందో మీరు చూశారు. అయోధ్యలో ఏం జరిగింది? పేదవాళ్లు విరాళాలను దుర్వినియోగం చేశారా? దళితులు చేశారా? రైతులు చేశారా? ఎవరూ కాదు. ఆర్ఎస్ఎస్, బీజేపీలతో సంబంధం ఉన్నవారే ఈ దోపిడీ చేశారు. అయోధ్య రామ మందిరంలో సుమారు రూ. 20,000 కోట్ల విలువైన ఆస్తులను దోచుకున్నారు. రామ మందిరానికి విరాళంగా ఇచ్చిన బంగారం, వెండి, చివరికి ఇటుకలను కూడా దోచుకున్నారు. ప్రతిరోజూ దేవుడి నామం జపిస్తారు. కానీ దేవుడి పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. "

**పాలనపై కాకుండా ఎన్నికలపైనే బీజేపీ దృష్టి : ఖర్గే**

బంగాల్, మహారాష్ట్ర, హరియాణా, అసోం వంటి రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ద్వారా బీజేపీ 'ఓట్ చోరీ'కి పాల్పడిందని ఖర్గే ఆరోపించారు. అధికారంలో కొనసాగడానికి కమలం పార్టీ రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు. బీజేపీ/ఆర్ఎస్ఎస్ ఓట్లను చోరీ చేస్తున్నాయని దుయ్యబట్టారు. దేవుడి సంపదను దోచుకుంటున్నాయని విమర్శించారు. ఇటువంటి దుర్వినియోగాన్ని నివారించడానికి బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ఒకే దేశం- ఒకే ఎన్నిక బిల్లు వంటి వాటిని సభ ముందుకు తీసుకురావాలని బీజేపీ చూస్తోందన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆహార భద్రతా చట్టం వంటి సంక్షేమ చర్యలను ఎన్‌డీఏ సర్కార్ బలహీనపరుస్తోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం పరిపాలనపై కాకుండా కేవలం ఎన్నికలపైనే దృష్టి సారిస్తోందని ఎద్దేవా చేశారు.

**విరాళాల చోరీపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారు : మాణికం ఠాగూర్**

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు మాణికం ఠాగూర్? ప్రశ్నించారు. రామమందిర విరాళాలకు సంబంధించి ఆర్థిక కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఈ అంశంపై ప్రధాని మోదీ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆలయాలను ఉపయోగించి నిధులు సేకరిస్తున్నాయని విమర్శించారు.

**వీహెచ్‌పీది రాజకీయ ప్రేరేపిత లేఖ : ఆప్**

రామ మందిరంలో విరాళాల చోరీ గురించి ప్రతిపక్షాలు చేసే ఆరోపణలను కూడా పరిశీలించాలని విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అయోధ్య పోలీసులకు లేఖ రాయడంపై ఆప్ స్పందించింది. ఈ లేఖను రాజకీయ ప్రేరేపితమైనదిగా అభివర్ణించింది. శ్రీరాముడికి సంబంధించిన విషయాల్లో కూడా వివక్ష ఎందుకు? అని ప్రశ్నించింది. ఈ మేరకు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు.

**విరాళాల చోరీ..**

## అయోధ్య క్షేత్ర ట్రస్ట్ కీలక భేటీ

లక్నో(జనంసాక్షి):అయెధ్య రామాలయ విరాళాల చోరీపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక ప్రకటన చేసింది. సోమవారం ఆలయ ప్రధాన అధికారులు, అర్చకులు భేటీ అవ్వనున్నట్లు తెలిపింది. ఈ సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్.. ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలపై చర్చించనున్నట్లు సమాచారం. కాగా తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ట్రస్ట్ అధ్యక్షుడు నృత్య గోపాల్ దాస్, ఆరోగ్య సమస్యల కారణంగా ప్రయాణించలేని స్థితిలో ఉన్న సీనియర్ ట్రస్టీ పరాశరన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాజీనామాను ఆమోదిస్తే ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించడం, రామమందిర నిర్వహణకు సంబంధించి భవిష్యత్తులో తీసుకునే చర్యలు, నూతన పరిపాలన వ్యవస్థ ఏర్పాటు వంటి వాటి గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. అయోధ్య రామమందిరం విరాళాల చోరీ కేసులో పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ప్రధాన నిందితుల్లో ఒకరైన అవినాష్ శుక్లా తన ఖాతా నుంచి రూ.15 లక్షలకు పైగా నగదు లావాదేవీలు జరిపినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది.ఈ డబ్బు ఆలయ విరాళాలకు సంబంధించిందేనా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అవినాష్ శుక్లా పలువురికి డిజిటల్ చెల్లింపులతో పాటు కొంత మొత్తం నగదుగా ఇచ్చినట్లు గుర్తించారు. తన స్నేహితురాలికి సుమారు రూ.2 లక్షల నగదు, ఖరీదైన మొబైల్ ఫోన్ బహుమతిగా ఇచ్చిన విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# అంగన్‌వాడీ టీచర్ల నియామకాలకు కసరత్తు

- నేటి నుండి ఈ నెల 17వరకు దరఖాస్తుల స్వీకరణ
- 7 కేంద్రాల్లో కొత్త టీచర్ల చేరికలతో తీరునున్న తిప్పలు
- నేడు వెబ్ సైట్ లో రిజర్వేషన్లను ఖరారు



**న్యాల్ కల్, జూలై 05, (జనం సాక్షి)** : పలువురు అంగన్వాడి టీచర్లు పదవి విరమణ పొందడం, మృతి చెందడం, స్వచ్ఛందంగా వదులు కోవడం వంటి కారణాలతో.. గత 2022 నుండి దాదాపు 4/5 సంవత్సరాలుగా అంగన్వాడి కేంద్రాల్లో.. అంగన్వాడి టీచర్లు లేని కారణంగా.. ఇన్చార్జి అంగన్వాడీ టీచర్లతో కొనసాగుతున్నాయి. ఇన్చార్జి టీచర్లతో రెగ్యులర్, ఇన్చార్జి కేంద్రాలను కొనసాగించేందుకు నిర్వాహకులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎట్టకేలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ప్రభుత్వ యంత్రాంగం చొరవతో.. అంగన్వాడి కేంద్రాల్లో టీచర్ల నియామకాల కోసం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం జిల్లా సంక్షేమాధికారి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సంగారెడ్డి వారి ఆదేశం మేరకు తాజాగా జహీరాబాద్ డివిజన్ సీడీపీఓ సుశీల ప్రకటన విడుదల చేసింది.

### న్యాల్ కల్ మండలంలోని 7 కేంద్రాల్లో భర్తీకానున్న కేంద్రాలు

మండలంలోని చాల్కి, చీకూర్తి, ఇబ్రహీంపూర్, రేజింతల్, కల్ బేమల్, న్యామతాబాద్, ముంగి గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో తాజాగా టీచర్లను నియమించేందుకు ఏర్పాట్లను సిద్ధం చేసింది. ఈ మేరకు ఈ నెల 6 సోమవారం ఈ నెల17వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. వెబ్ సైట్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వులను జారీ చేసింది. 7 అంగన్వాడి కేంద్రాల్లో ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు పదవి విరమణ పొందారు. మరో అంగన్వాడి కార్యకర్త స్వచ్ఛందంగా వదులుకుంది. జహీరాబాద్ డివిజన్ పరిధిలో 15 అంగన్వాడి టీచర్ల నియామకాల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా.. అందులో 7గురు న్యాల్ కల్ మండలంలో ఖాళీగా ఉన్నాయి.

### కనీస విద్యార్హత ఇంటర్ ఉత్తీర్ణత

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత కలిగి ఉండాలి. 100 శాతం మార్కుల్లో 70 శాతం ఇంటర్ మార్కులు కలిగి ఉండాలి. 10శాతం అనాధలకు, మరో ఐదు శాతం మేర వికలాంగులు, వితంతువులకు మార్కులను వేయనున్నారు. మరో 10 శాతం మేర మార్కులను జిల్లా ఉన్నతాధికారుల సెలక్షన్ కమిటీ బృందం కల్పించి ఎంపిక చేయనుంది. శతశాతం మార్కుల్లో.. ఇంటర్ మార్కులు, వితంతువులు, వికలాంగులు, అనాధల దరఖాస్తుల పరిశీలన అనంతరం జిల్లా సెలక్షన్ కమిటీ బృందం పరిశీలించి ఎంపిక చేయనుంది.

### నేడు వెబ్ సైట్ లో రిజర్వేషన్లు ఖరారు

మండలంలోని ఏడు అంగన్వాడి కేంద్రాల్లో సోమవారం వెబ్ సైట్ లో రిజర్వేషన్ల వారీగా ఖరారు చేసి ప్రకటించనున్నారు. జనరల్ 3, బీసీ (ఏ), బీసీ (బి), బీసీ (డీ), బీసీ (ఈ)ల ఒకటి చొప్పున రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు సమాచారం.

# ఇవేం తిప్పలు 'సర్'

- ఫాం నింపేందుకు సతమతమవుతున్న ఓటర్లు
- సందేహాలు తీర్చలేక సమాధానం దాటవేస్తున్న బీఎల్ఓలు



**కోహిర్, జూలై 5 (జనం సాక్షి):** బీఎల్ ఓలు ఓటర్లకు అందజేస్తున్న ఎస్ఐ ఆర్ ఫారాలను నింపడానికి ఇబ్బందులు పడుతు తున్నారు. పలువురి అభిప్రాయాలను సేకరించింది. ఫాంలలో విషయాలు అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఫారాలను చేతబ ట్టుకుని చదువుకున్న వారి దగ్గరకు, రాజకీయ నేతలు, బీఎల్ ఓల వద్దకు పరుగుతీస్తున్నారు. 2002 జాబితాలో ఉన్న ఓటర్లు, 2002 జాబితాలోని ఓటర్లకు వేర్వేరు భాగాలను కేటాయించారు. ఈ ఫారాలలో 2002 ఓటరు జాబితాలో ఉన్న వివరాలను నమోదు చేయాలనే నిబంధనతో ఓటర్లు తికమకపడుతున్నారు. 2002 తర్వాత ఓటర్లుగా నమోదు కాని వారు తమ ఓటు అంతకు ముందున్న గ్రామంలో వెతుక్కోవాల్సి వస్తుందని వాపోయారు. ఆ ఓటరు జాబితా తమ వద్ద లేనప్పుడు వివరాలు ఎలా లభ్యమౌతాయని ప్రశ్నించారు. బీఎల్ లను ఫాంలు నింపే విధానం, సందేహాలను అడిగితే తెలుసుకుని చెబుతామంటూ దాటవే స్తున్నారు. తమకు పూర్తి వివరాలు తెలవదంటు చేతులెత్తేస్తున్నారు. గ్రామాల్లోకి కోడళ్లుగా వచ్చిన వారు, 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారు తమ తాత, నానమ్మ, తండ్రి, తల్లి బంధుత్వ వివరాలను నమోదు చేయాలనే నిబంధన ఓటర్లను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని వారు వాపోయారు. తాము పుట్టింటికి వెళ్లి వెతుక్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారి పరిస్థితి సైతం ఇలాగే ఉందంటూ రాజకీయ నాయకులు పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు గ్రామాలకు వచ్చి ఓటరు నమోదు ఫాం నింపలేకపోతున్నారు. ఫారాలను ఇచ్చాం, నింపి వారం రోజుల్లో ఇవ్వాల నీ బీఎల్ఓలు చెప్పి వెళ్లడం, అవగా హన లేని ఓటర్లు ఎలా నింపాలనే సందేహాలతో సతమతమౌ తున్నారు. సర్ పై ప్రజలకు అవగాహన కల్పిం చకండా నెల రోజుల్లో ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలనే ఎన్నికల కమిషన్ నిబంధనలను బీఆర్ఎస్, కాంగ్రెస్లు తప్పుపట్టాయి. ఫాంలలో తప్పుగా రాసిన వారి ఓట్లు తొలగిస్తే కొత్త ఓటు నమోదుకు అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, దీంతో మరో కొత్త సమస్యకు దారితీ స్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఎల్ ఓలే ఆ పాంలు నింపి స్వీకరిస్తే పొరపాట్లు జరిగే వీలుం డదని రాజకీయ పార్టీలు, ఓటర్లు పేర్కొన్నారు. సర్ ప్రక్రియ మాత్రం పల్లెలు, గిరిజన తండాల్లో అల జడి రేపుతుందనే చర్చ కొసాగుతోంది.

# సిద్ధాంత అవగాహనతోనే ప్రజా ఉద్యమాలు బలోపేతం

- కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**తొర్రూరు. జూలై 5( జనం సాక్షి):** సిద్ధాంత అవగాహనతోనే ప్రజా ఉద్యమాలు బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ భవన్‌లో సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభ సందేశం అందించారు. శిక్షణ తరగతులకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి సిద్ధాంతపరమైన అవగాహన, క్రమశిక్షణతో కూడిన రాజకీయ చైతన్యం అవసరమని అన్నారు. పార్టీ నాయకులు సమాజంలోని మారుతున్న పరిస్థితులను అధ్యయనం చేస్తూ ప్రజల పక్షాన ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి నరేంద్ర మోడీ సర్కార్ అయోధ్య రామాలయాన్ని ఎన్నికల కోసం వాడుకొని ఆలయం నిర్మించిన తర్వాత భక్తులు ఇచ్చినటువంటి విలువైనటువంటి కానుకలు డబ్బులు వెండి ఇటికలతో సహా అక్రమంగా ట్రస్ట్ పేరుతోటి కాల్ చేస్తున్న కూడా పట్టించుకోకపోవడం ఇదేనా హిందుత్వం అని ప్రశ్నించారు చివరకు ఆర్టిఏ ఆక్ట్ కింద సమాచారం అడిగినా కూడా ఇవ్వకుండా ప్రభుత్వ పరిధిలో లేదని అది ట్రస్ట్ అని దాంట్లో యూపీ ప్రభుత్వం గానీ కేంద్రం గాని తలదోష బోధని మాట్లాడడం దొంగలకు కొమ్ము కాయడమేనని అన్నారు ప్రజలు గమనించి భక్తులే ఇప్పుడు తిరగబడతా ఉన్నారని తక్షణమే అయోధ్య రామ మందిరంతో సహా కేదార్నాథ్లో కూడా అవినీతి జరిగినట్టు వస్తున్నటువంటి నేపథ్యంలో వీటిపైన విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాం తెలుసా గాని కేంద్ర ప్రభుత్వం గానీ యూపీ ప్రభుత్వం గానీ అవినీతి జరిగిన ట్రస్ట్ చైర్మన్ తో సహా సభ్యుల పైన కఠిన చర్యలు తీసుకొని అవినీతి తమను కక్కించకపోతే సిపిఐ దేశవ్యాప్త ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు సిపిఐ పార్టీ పూనుకో పోతా ఉన్నది. అనంతరం వివిధ అంశాలపై రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. 'మార్క్సిజం – సమకాలీన సమాజంలో దాని ప్రాధాన్యత' అంశంపై కామ్రేడ్ మధుకర్, 'తీవ్ర ఆర్థిక సంక్షోభంలో భారతదేశం – పర్యవసానాలు' అంశంపై కామ్రేడ్ బీఎస్ఆర్ మోహన్ రెడ్డి, 'మతం, మతోన్మాదం – లౌకికవాదం – కేంద్రంలో అమలవుతున్న హిందుత్వ ఎజెండా' అంశంపై కామ్రేడ్ ఉమా మహేష్ బోధనలు నిర్వహించి నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయ్ సారధి, జిల్లా సహాయ కార్యదర్శిలు బి. అజయ్ సారధి, నల్లు సుధాకర్, రాష్ట్ర సమితి సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యులు తమ్మెరా విశ్వేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మామిడ్ల సాంబా లక్ష్మి, పెరుగు కుమార్, వరిపెల్లి వెంకన్న, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, పాండురంగా చారి, నెల్లూరి నాగేశ్వరావు, తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శిలు గణపురం లక్ష్మణ్, పెరబోయిన కిరణ్, జిల్లాలోని వివిధ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సింగూరు నుంచి దిగువకు నీటి విడుదల

**పుల్కల్, జూలై 5 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువ ప్రాంతాల తాగునీటి అవసరాల దృష్ట్యా మంజీరా బ్యారేజీకి నీటిని విడుదల చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటలకు ప్రాజెక్టు గేట్లు ద్వారా 0.1 టీఎంసీ(347 క్యూసెక్కులు) నీటిని దిగువకు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ డీ ఈ నాగరాజు వెల్లడించారు. మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు, మత్స్యకారులు, పశు వుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# అసంతృప్తిలో సీనియర్ కాంగ్రెస్ నేతలు

- పార్టీ కోసం కష్టపడ్డ తమను విస్మరిస్తున్నారని ఆవేదన
- ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారంటూ సమాలోచన
- ఎమ్మెల్యే కుంభం పై అసమ్మతి రాగాలు



**బీబీనగర్ (జనంసాక్షి):** బీబీనగర్ మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల్లో అసంతృప్తి జ్వాలా రగులుతోంది. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తూ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గెలుపుకు ఎంతో కృషి చేశామని కానీ తమను విస్మరిస్తున్నారని బీబీనగర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అసమ్మతి గళం ఎత్తుకున్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీ కోసం ఎల్లవేళలా కష్టపడ్డామని అయినప్పటికీ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారంటూ నాయకులు ఆవేదనకు గురైతున్నారు. పార్టీలో సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ బీబీనగర్ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు శనివారం స్థానిక విశ్రాంతి భవనంలో సమాలోచన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గెలుపు కోసం పనిచేసిన తమను విస్మరిస్తూ కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో సీనియర్లమైన తమను పట్టించుకోకపోతే ఇక కార్యకర్తల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పార్టీ కోసం కష్టపడ్డ వారిని గుర్తించకపోతే పార్టీకి నాయకులు కార్యకర్తలు దూరమయ్యే అవకాశాలు ఉంటాయని దీంతో పార్టీకి నష్టం జరిగే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి సంధిగారి బసవయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు చెరుకు అచ్చయ్య గౌడ్, మండల నాయకులు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, బద్రి, జానీ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో అరుదైన దవడ ఎముక ఇంప్లాంట్ శస్త్ర చికిత్స విజయవంతం





**నల్లగొండ,జులై 5,(జనం సాక్షి):** నల్గొండ పట్టణంలోని డీవీకే రోడ్డులో ఉన్న శ్రీ సత్య డెంటల్ అండ్ అనుశ్రీ మెడికల్ హాస్పిటల్‌లో అరుదైన దవడ ఎముక (చెంప ఎముక ఆధారిత) ఇంప్లాంట్ శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను డాక్టర్ అరవింద్ నేతృత్వంలోని వైద్య బృందం పూర్తి చేసింది. దవడ ఎముక పూర్తిగా దెబ్బతినడంతో పలువురు వైద్యులను సంప్రదించినప్పటికీ శస్త్రచికిత్స సాధ్యం కాదని రోగికి సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం శ్రీ సత్య డెంటల్ అండ్ అనుశ్రీ మెడికల్ హాస్పిటల్‌ను ఆశ్రయించగా, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన నిపుణుల బృందం చెంప ఎముక ఆధారంగా ప్రత్యేక ఇంప్లాంట్లను అమర్చి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల అనుభవం, ఖచ్చితమైన ప్రణాళికతో ఇలాంటి క్లిష్టమైన కేసులను కూడా విజయవంతంగా చికిత్స చేయడం సాధ్యమవుతోందన్నారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, త్వరలోనే సాధారణ జీవన విధానానికి తిరిగి వచ్చే అవకాశముందని వైద్య బృందం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ గానూతుల అరవింద్ రెడ్డి, డాక్టర్ సుమన్ కృష్ణ, డాక్టర్ నందిని తదితర వైద్యులు పాల్గొన్నారు.

# ఇదేనా ప్రజాస్వామ్యం! పశ్నించే గొంతులను అణచివేస్తారా?

## సీఎంకు పీస్ డైలాగ్ కమిటీ లేఖ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణచివేస్తారా? అంటూ సీఎంకు పీస్ డైలాగ్ కమిటీ లేఖ రాసింది. తెలంగాణలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ – చర్చా వేదికలపై పోలీసు ఆంక్షలను నిరసిస్తూ పలు అంశాలను లేఖలో ప్రస్తావించారు. తెలంగాణలో పదేళ్ల నిరంకుశత్వానికి ముగింపు పలికామని, 'ప్రజాస్వామ్య పునరుద్ధరణే' ధ్యేయంగా మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తాము నిరంతరం ప్రకటిస్తున్న తీరును తెలంగాణ సమాజం ఎంతో ఆశతో గమనించింది. ప్రగతి భవన్ గేట్లు బద్దలు కొట్టడం, ధర్నా చౌక్‌కు స్వేచ్ఛనివ్వడం ద్వారా ఒక నూతన ప్రజాస్వామ్య స్ఫూర్తికి మీ ప్రభుత్వం తెరలేపిందని పేర్కొన్నారు. విప్లవ రచయితల సంఘం (విరసం) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 5న సుందరయ్య విజ్ఞాన కేంద్రం లాంటి ఒక ఇండోర్ హాల్‌లో 'ఫాసిజం' అనే అంశంపై జరగాల్సిన సదస్సును పోలీసులు చివరి నిమిషంలో అడ్డుకోవడం, హాల్ నిర్వాహకులను హెచ్చరించడం తీవ్ర ఆందోళనకరమని, ఈ పరిణామం మీ ప్రభుత్వం నిత్యం పలికే 'ప్రజాస్వామ్య గ్యారెంటీ' నినాదాలకే విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. 'ఇండోర్ హాల్' చర్చలకూ అనుమతి నిరాకరించడం పోలీస్ రాజ్యమా? సాధారణ చట్టాల ప్రకారం ఇండోర్ హాల్స్‌లో జరిగే సమావేశాలకు పోలీసుల ముందస్తు అనుమతి అవసరం లేదనేది సుస్పష్టం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 పౌరులకు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుత సమావేశ హక్కును కాలరాయడమేనని, చర్చలను, భిన్నాభిప్రాయాలను భౌతికంగా అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ఇప్పటి పాలనకు తేడా ఏముంది? అని ప్రశ్నించింది. గత పాలకుల హయాంలో ప్రజాస్వామిక గొంతులను, మేధావుల సభలను అడ్డుకున్నప్పుడు ఇదే కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నిరసించింది. మరి నేడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా అదే తరహా 'పోలీస్ ఓవర్‌రీచ్' (పోలీసుల అతి ఉత్సాహం) కొనసాగడం దేనికి సంకేతం? రేవంత్ రెడ్డి గారి పాలనలో కూడా ఇంటెలిజెన్స్ నివేదికల పేరిట పౌర హక్కులను కాలరాస్తామంటే, గత ప్రభుత్వానికీ మీకూ ఉన్న తేడా ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. రాహుల్ గాంధీ గారి 'రాజ్యాంగ పరిరక్షణ' నినాదానికి ఇది వ్యతిరేకం కాదా? అని ప్రశ్నించింది. పీస్ డైలాగ్ కమిటీ ఎల్లప్పుడూ సమాజంలో శాంతిని, సామరస్యాన్ని ఆకాంక్షిస్తుంది. శాంతి అనేది గొంతు నొక్కడం ద్వారానో, నిర్బంధాల ద్వారానో రాదు; భిన్న సిద్ధాంతాల మధ్య జరిగే ఆరోగ్యకరమైన చర్చల ద్వారానే సాధ్యమవుతుంది. ఒక భావజాలాన్ని ఎదుర్కోవాల్సింది పవర్‌ఫుల్ ఉపన్యాసాలు మరియు కౌంటర్ ఆర్గుమెంట్స్‌తోనే తప్ప, లాఠీలతోనూ, పోలీసు బెదిరింపులతోనూ కాదని పేర్కొంది. ముఖ్యమంత్రి గారు, పోలీసు యంత్రాంగం పాత పద్ధతులనే అవలంబిస్తూ మీ ప్రభుత్వ ప్రజాస్వామ్య ముఖచిత్రాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తోంది. తక్షణమే ఈ 'నిర్బంధ సంస్కృతి'కి ముగింపు పలకాలి. తెలంగాణను పోలీస్ రాజ్యంగా మార్చకుండా, పౌర హక్కులకు, మేధో చర్చలకు పూర్తి స్వేచ్ఛనిచ్చేలా పోలీస్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ సాయుధ పోరాట నాయకులు కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, అజయ్ బాల్నే, సోమ రామమూర్తి, వెంకన్న (హైకోర్టు అడ్వకేట్, రహమాన్ (సీనియర్ ఎడిటర్), జైసింగ్ రాథోడ్, బండి దుర్గా ప్రసాద్ తదితరులు లేఖలో పేర్కొన్నారు.

# కేటీఆర్‌ను అడ్డుకోవడం దివాళాకోరుతనం

- బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర




**హైదరాబాద్ (జనంసాక్షి) :** కన్నేపల్లి పంప్ హౌస్ ను సందర్శించడానికి బయలుదేరిన టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు అడుగడుగునా అడ్డుకోవడం వారి దివాలా కోరు తనానికి నిదర్శనమని మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర అన్నారు. నాడు నీళ్లు నిధులు నియామకాల కోసం కేసీఆర్ ఉద్యమాన్ని నడిపి తెలంగాణను సాధించిన తర్వాత నీళ్ల కోసం మూడున్నర సంవత్సరాల లోపే ముఖ్యమంత్రిగా బాధ్యతతో ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించి లక్షలాది ఎకరాలకు నీళ్లను ఇచ్చి తెలంగాణ రైతులను ఆదుకొని భారత దేశంలోనే పంటలు పండించే స్థాయిలో నెంబర్ వన్ తీసుకొచ్చిన ఘనత కేసీఆర్ అయితే నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ కక్షతో కేసీఆర్ గారిని బధనం చేయాలని కాళేశ్వరం కూలేశ్వరం అయిందని కుంభకోణాలని తప్పుడు ప్రచారాలు చేస్తూ రాజకీయాల కోసం తెలంగాణ రైతాంగాన్ని ఆగం చేస్తున్న ఈ కాంగ్రెస్ పార్టీ చర్యలను ప్రజలకు తెలియజేయడం కొరకు కేటీఆర్ గారు కన్నేపల్లి పంపు హౌజ్ ఆఅ సందర్శించి గోదావరి నుంచి వృధాగా సముద్రంలో కలిసిపోతున్న నీటిని కన్నెపల్లి పంప్ హౌస్ లో మోటర్లు ఆన్ చేసి ప్రజలకు రైతులకు నీళ్లు ఇవ్వాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతతో ప్రభుత్వానికి తెలియజేయాలని అక్కడికి వెళుతుంటే ఈ ప్రభుత్వం పోలీసులు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. అడుగడుగునా ఆటం కాలు కల్పించి ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రతిపక్ష పార్టీ నాయకులను అడ్డుకు న్నంత మాత్రాన వాస్తవాలు బయటికి రాకుండా ఆగవని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మేడిగడ్డను రిపేరు చేసి అవకాశం ఉన్నంతవరకు నీళ్లను ఎత్తిపోసి రైతాంగాన్ని ఆదుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన అన్నారు.

# దుఃఖం వెనుక దాగిన ప్రతిఘటన

సంపాదకీయం

ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ వీధుల్లో నెలకొన్న దృశ్యం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీతో పాటు ఆయన కుటుంబసభ్యులు నలుగురు కూడా మరణించారు. నెల తరబడి వాయిదా పడిన అంత్యక్రియలు ఇప్పుడు టెహ్రాన్‌లో ప్రారంభమయ్యాయి. కోట్లాది మంది ఇరానీలు తమ నాయకుడి పార్థివదేహాన్ని చూసేందుకు వీధుల్లోకి వచ్చారు. మహిళలు తలలు బాదుకుంటూ, పురుషులు గుండెలు కొట్టుకుంటూ దుఃఖాన్ని ప్రకటిస్తున్నారు. "అమెరికాకు మరణం", "ఇజ్రాయెల్‌కు మరణం" అనే నినాదాలు వీధుల్లో మార్మోగుతున్నాయి. ఈ దృశ్యాలు కేవలం ఒక మతనాయకుడి మరణానికి సంతాపం మాత్రమే కాదు, సామ్రాజ్యవాద శక్తుల దూకుడుపై ఒక జాతి యావత్తు వ్యక్తం చేస్తున్న ఆగ్రహ ప్రకటన.

ఒక దేశాధినేతను, అతని కుటుంబాన్ని క్షిపణి దాడితో కూల్చివేయడం, ఇది కేవలం సైనిక వ్యూహం కాదు, అగ్రరాజ్యపు అహంకార ప్రదర్శన. ప్రాణాలు తీయడానికే పనికొచ్చిన శక్తులు, ప్రాణాలు కాపాడటానికి ఎన్నడూ ముందుకు రాలేదన్న ప్రశ్న ఇప్పుడు కోట్లాది మంది ఇరానీల నోళ్లలో నానుతోంది. చమురు నిల్వలున్న ప్రతి బలహీన దేశంపైనా కయ్యానికి కాలుదువ్వడం, యుద్ధాల పేరుతో ఆ దేశాల వనరులను కొల్లగొట్టడం, ఇది దశాబ్దాలుగా సాగుతున్న సామ్రాజ్యవాద పంథా. ట్రంప్ ప్రకటన వెలువడిన క్షణం నుంచి ఇరాన్ ప్రజల్లో రగిలిన ఆవేదన, ఆగ్రహం ఈ అంత్యక్రియల్లో జనసంద్రంగా మారి కనిపిస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాధినేతలు, మత పెద్దలు ఈ అంత్యక్రియలకు హాజరవడం ఇరాన్ ఒంటరిది కాదని ఒక సంకేతం. ఆరు రోజుల పాటు టెహ్రాన్, ఖోమ్, నజఫ్, కర్బలా, మషద్ నగరాల మీదుగా సాగే ఈ అంత్యయాత్ర, కేవలం మతపరమైన సంప్రదాయం మాత్రమే కాదు.. రాజ్యాధికారానికి, ప్రతిఘటనకు చిహ్నంగా మలచిన ఒక రాజకీయ ప్రదర్శన. అధికారం మార్పిడి తర్వాత కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ప్రజల ముందుకు రాకపోవడం అనేక సందేహాలకు తావిస్తున్నా, ప్రజల్లో నెలకొన్న ప్రతీకార కాంక్ష మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

బలమైన దేశాలు బలహీన దేశాలపై అమానుషంగా బాంబులు కురిపిస్తూ, ప్రజాస్వామ్యం పేరుతో వనరుల దోపిడీకి తెరతీయడం ఇది కొత్త కథ కాదు. కానీ ప్రతిసారీ చరిత్ర ఒక విషయాన్ని రుజువు చేస్తోంది. బలవంతంగా అణచివేసిన ప్రతి గొంతు, మరణం తర్వాత మరింత బలంగా ప్రతిధ్వనిస్తుంది. ఖమేనీ అంత్యక్రియల్లో పోటెత్తిన జనసందోహం అందుకు నిదర్శనం.

# భక్తి కంటే పారదర్శకత ముఖ్యం

*అయోధ్య రామమందిరం కేవలం ఒక ఆలయం కాదు. కోట్లాది మంది హిందువుల విశ్వాసానికి ప్రతీక. దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తుల విరాళాలు, బంగారం, వెండి, ఆభరణాలు, నగదు, విలువైన కానుకలు అన్నీ భక్తుల ఆరాధనకు ప్రతిరూపాలు. అలాంటి పవిత్రమైన స్థలంలో విరాళాల దుర్వినియోగం, నగదు మరియు విలువైన వస్తువుల మాయంపై వెలుగులోకి వచ్చిన ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీశాయి. ఈ వ్యవహారంలో అసలు ప్రశ్న కేవలం దొంగతనం జరిగిందా లేదా అన్నది కాదు. నిజంగా ఎవరి బాధ్యత? విచారణ ఎవరిని చేరుతోంది? ఎవరిని వదిలేస్తోంది? అనే అంశాలే ప్రజల అనుమానాలకు కేంద్రబిందువుగా మారాయి.*



ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కొన్ని ఆలయ సిబ్బందిని అరెస్టు చేసింది. వారి వద్ద కొంత నగదు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో విచారణ పరిధిని గత ఐదేళ్ల ఆర్థిక లావాదేవీల వరకు విస్తరించి ట్రస్ట్ ఖాతాలపై మళ్లీ ఆడిట్ నిర్వహించాలని కూడా సిట్ నిర్ణయించింది. ఆలయంలో నగదు లెక్కింపు, విలువైన వస్తువుల నిర్వహణ, సీసీటీవీ పర్యవేక్షణ, అంతర్గత నియంత్రణ వ్యవస్థల్లో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ప్రాథమిక పరిశీలనలో వెల్లడైనట్లు పలు జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి.

అయితే ప్రజల్లో ఎక్కువగా వినిపిస్తున్న ప్రశ్న ఏమిటంటే, కింది స్థాయి సిబ్బంది మాత్రమే ఈ వ్యవహారానికి బాధ్యులా? లేక పరిపాలనా స్థాయిలో కూడా బాధ్యత వహించాల్సిన వారు ఉన్నారా? ఒక పెద్ద సంస్థలో కోట్ల రూపాయల విరాళాల నిర్వహణ సంవత్సరాల పాటు జరుగుతుంటే, పరిపాలనా బాధ్యతలు నిర్వహించే ఉన్నతాధికారులకు ఏమాత్రం సమాచారం లేకపోవడం సహజమా? పరిపాలనా నిర్లక్ష్యం ఉన్నా అది కూడా విచారణలో భాగం కావాల్సిందే అనే వాదన వినిపిస్తోంది.

ఈ నేపథ్యంలో ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి సంపత్ (చంపత్) రాయ్‌ను సిట్ ప్రశ్నించినప్పటికీ, విచారణ వివరాలు వెల్లడించలేదు. ఆయన నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకున్నట్లు వార్తలు వచ్చినా, ఆయన పాత్రపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగిందా అనే సందేహాలు కొనసాగుతున్నాయి.ఇంత వరకు ఆయన పై ,ఇతర ముఖ్య ఆలయ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ ఎందుకు బుక్ చేసి విచారణకు ఎందుకు పిలవలేదు? ఇంత పెద్ద ఆర్థిక నేరం అంతర్గతగా చాలా ఏళ్ళ క్రితమే వెలుగులోకి వచ్చినా...ఆ నిజాలను ఎవరు ఉద్దేశ పూర్వకంగా తొక్కిపెట్టారు? ఇందులో కీలక పాత్రధారులు ఎవరు? ఈ ప్రశ్నలు హిందూ భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ కేసులో మరో ముఖ్యమైన అంశం బాధ్యత వహించే వ్యవస్థల పాత్ర. ఒకవైపు గతంలో ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలు సక్రమంగానే ఉన్నాయని ఎవరు ? ఏ హోదాలో బుకాయించారు?. ఇప్పుడు అదే ఖాతాలను మళ్లీ ఐదేళ్ల కాలానికి రీ-ఆడిట్ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఒకవేళ మొదటి ఆడిట్ పూర్తిగా సరిగానే జరిగి ఉంటే రెండోసారి సమగ్ర పునఃపరిశీలన అవసరం వచ్చేదా? లేక మొదటి ఆడిట్‌లో గుర్తించని అంశాలు ఇప్పుడు బయటపడుతు న్నాయా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉంది.

భక్తులు ఆలయానికి విరాళం ఇవ్వడం అనేది కేవలం దానం కాదు. అది విశ్వాసం. ఆ విశ్వాసాన్ని పరిరక్షించడం ట్రస్ట్ యొక్క అత్యున్నత బాధ్యత. అందుకే ఇలాంటి సంస్థల్లో సాధారణ ప్రభుత్వ కార్యాలయాల కంటే మరింత కఠినమైన ఆర్థిక నియంత్రణ వ్యవస్థ ఉండాలి. ప్రతి రూపాయి, ప్రతి గ్రాము బంగారం, ప్రతి వెండి వస్తువు డిజిటల్ రికార్డుతో పాటు స్వతంత్ర ఆడిట్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షించబడాలి. అలాంటి వ్యవస్థ బలహీనంగా ఉంటే దానికి కేవలం కింది స్థాయి ఉద్యోగులను మాత్రమే బాధ్యులుగా చేయడం పరిపాలనా బాధ్యతను తప్పించుకోవడంగా భావించే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం రాజకీయ విమర్శలు కూడా తీవ్రంగా కొనసాగుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు, కొందరు న్యాయవాదుల సంఘాలు, సాధువులు, భక్తులలో ఒక వర్గం ఈ కేసులో ట్రస్ట్ కీలక బాధ్యుల పైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాయి. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ కూడా కొందరు కీలక ట్రస్ట్ సభ్యులపై కేసు నమోదు చేయాలని కోరింది.ఇక్కడ మరో కోణం కూడా గుర్తుంచుకోవాలి. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన ఆరోపణలు అన్నీ ఇంకా దర్యాప్తు దశలోనే ఉన్నాయి. న్యాయపరంగా ఎవరి మీదా తుది నేర నిర్ధారణ కాలేదు. అందువల్ల విచారణ పూర్తికాకముందే ఎవరినైనా నేరస్థులుగా ప్రకటించడం సమంజసం కాదు. అదే సమయంలో విచారణ ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని స్థాయిల బాధ్యులను సమానంగా పరిశీలించాలి అనే ప్రజాస్వామ్య సూత్రం కూడా అంతే ముఖ్యమైనది.

ఈ కేసు రాజకీయంగా కూడా అత్యంత సున్నితమైనది. ఎందుకంటే రామమందిరం నిర్మాణాన్ని దేశ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టంగా ప్రస్తావించిన నాయకత్వం ఇప్పుడు ఈ వివాదంపై ఏ మేర స్పందించాలి అనే చర్చ కొనసాగుతోంది. ప్రధానమంత్రి లేదా కేంద్ర మంత్రివర్గం ఇప్పటివరకు ప్రత్యేకంగా స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అయితే ట్రస్ట్ స్వతంత్ర సంస్థగా పనిచేస్తుందని, కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలకు అది ప్రత్యక్ష పరిపాలనా ఆధీనంలో లేదని కేంద్ర హోంశాఖ గతంలో కేంద్ర సమాచార కమిషన్‌కు తెలియజేసిన విషయం కూడా ఉంది.

అయితే చట్టపరమైన స్వతంత్రత ఉన్నప్పటికీ, కోట్లాది ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశం కావడంతో పూర్తి పారదర్శకత అవసరమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఆలయ ట్రస్ట్ ప్రభుత్వ నియంత్రణలో లేకపోయినా, ప్రజా విశ్వాసం ఆధారంగా నడిచే సంస్థగా తన ప్రతి చర్యకు సమాధానం చెప్పాల్సిన నైతిక బాధ్యత మాత్రం తప్పదు.

ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో లేదా స్వతంత్ర కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని కొందరు భక్తులు, సామాజిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాంటి డిమాండ్‌ను అంగీకరించాలా వద్దా అనేది సంబంధిత ప్రభుత్వాలు, న్యాయస్థానాలు నిర్ణయించాల్సిన అంశం. కానీ ఇలాంటి డిమాండ్లు ఎందుకు వస్తున్నాయో అర్థం చేసుకోవడం అవసరం. ప్రజల్లో విశ్వాసం తగ్గినప్పుడు మాత్రమే మరింత స్వతంత్ర దర్యాప్తు కోసం డిమాండ్ పెరుగుతుంది.

ఈ సంఘటన ఒక ఆలయానికి మాత్రమే పరిమితం కాదు. దేశంలోని అన్ని పెద్ద మత సంస్థలకు ఇది ఒక హెచ్చరిక. కోట్లాది రూపాయల విరాళాలు వచ్చే ప్రతి సంస్థలో అంతర్గత ఆడిట్‌తో పాటు స్వతంత్ర బాహ్య ఆడిట్, ఆధునిక డిజిటల్ ఇన్వెంటరీ, నిరంతర సీసీటీవీ పర్యవేక్షణ, ప్రతి విరాళానికి ఆన్‌లైన్ ట్రాకింగ్ వంటి వ్యవస్థలు తప్పనిసరిగా ఉండాలి. పారదర్శకత పెరిగినప్పుడే భక్తుల విశ్వాసం బలపడుతుంది.

చివరికి ఈ వివాదంలో అత్యంత విలువైనది బంగారం కాదు, వెండి కాదు, నగదు కాదు. కోట్లాది మంది భక్తుల విశ్వాసం. ఈ కేసులో " దొంగలే దర్యాప్తు చేస్తే ఎలా? ఈ సిట్ లో దర్యాప్తు అధికారులు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటారు.అలాంటప్పుడు దర్యాప్తు నిష్పాక్షికంగా ఏలా జరుగుతుంది? అనే అనుమానాలను హిందూ భక్తులు తమ సందేహాలను సోషల్ మీడియాలో విపరీతంగా వ్యక్తం చేస్తున్నారు. అయోధ్య ట్రస్టు కేంద్ర ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. తమకు అనుకూలమైన దొంగలను అందులో నియమించింది. ఇప్పుడు దొంగతనానికి పాల్పడినవారే, దొంగతనంపై దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో న్యాయం జరుగుతుందని ఎలా ఆశించగలం అని స్వామి అవిముక్తేశ్వరానంద్ సరస్వతి (జ్యోతిర్మఠ్ శంకరాచార్య) కూడా అన్నారు.

ఆ విశ్వాసాన్ని కాపాడటానికి నిజాలు ఎంత అసౌకర్యంగా ఉన్నా అవి వెలుగులోకి రావాలి. విచారణ ఎలాంటి రాజకీయ, పరిపాలనా లేదా సంస్థాగత ఒత్తిళ్లకు లోనుకాకుండా అన్ని స్థాయిల బాధ్యులను సమానంగా పరిశీలించాలి. నిర్దోషులను రక్షించడం ఎంత ముఖ్యమో, తప్పు చేసిన వారిని హోదా, ప్రభావం, పదవి అనే తేడా లేకుండా చట్టం ముందు నిజాయితీగా, రాగద్వేషాలకు అతీతంగా నిలబెట్టడం కూడా అంతే ముఖ్యం. రాముడి పేరు మీద నిర్మించిన ఆలయంలో రామరాజ్య విలువలు నిలవాలంటే భక్తి మాత్రమే కాదు, భక్తులు సమర్పించిన కానుకలు, వాటికి భద్రత , వాటి ద్వారా బ్యాంకుల నుండి లభించిన వడ్డీ మొదలైన విషయాలన్నింటిపై పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయపాలన కూడా సమానంగా నిలవాలి. అదే ఈ వివాదం దేశానికి నేర్పుతున్న అత్యంత ముఖ్యమైన పాఠం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ప్రైవేటు విద్యా దోపిడి... ప్రజా విద్య నిర్లక్ష్యం

విద్య అనేది వ్యక్తి జీవితాన్ని, సమాజ భవిష్యత్తును, దేశ అభివృద్ధిని నిర్ణయించే అత్యంత కీలకమైన ప్రజా పెట్టుబడి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు విద్యకు ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. నేటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు క్రమంగా తగ్గుతుండగా, ప్రైవేట్ పాఠశాలల వైపు తల్లిదండ్రుల ఆకర్షణ పెరుగుతోంది. దీనికి కేవలం ఇంగ్లిష్ మీడియం లేదా ఫలితాలే కారణం కాదు. ఆధునిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, సమర్థవంతమైన నిర్వహణ, పాఠశాల వాతావరణం ప్రైవేట్ పాఠశాలల ఆకర్షణకు ప్రధాన కారణాలుగా మారాయి. ప్రస్తుతం కుటుంబాలు ఇద్దరు పిల్లలకే పరిమితమవుతున్నాయి. తమ బిడ్డలకు అత్యుత్తమ విద్యను అందించాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను పోల్చి చూసి, అవసరమైతే ఎంత ఖర్చైనా భరించి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విద్య ఒక సామాజిక ప్రతిష్ఠకు ప్రతీకగా కూడా మారింది.



**ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం.**

స్వాతంత్ర్యం తర్వాత చాలాకాలం విద్యను ప్రభుత్వం సంక్షేమ బాధ్యతగా చూసింది. ప్రభుత్వమే విద్యను అందించాలనే భావన బలంగా ఉండేది. అనంతరం భారత రాజ్యాంగంలోని 42వ రాజ్యాంగ సవరణ (1976) ద్వారా విద్య రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి వచ్చింది. దీని వల్ల కేంద్రం, రాష్ట్రాలు రెండూ విద్యా విధాన రూపకల్పనలో భాగస్వాములయ్యాయి. ప్రస్తుతం విద్యపై పెట్టుబజాతీయ సగటు (రాష్ట్రాల సగటు)14.5 శాతంగా ఉంది. కానీ తెలంగాణ కేటాయింపు(9.8 శాతం) జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. విద్యను మానవ వనరుల అభివృద్ధికి పెట్టుబడిగా భావిస్తున్న బీహార్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు తమ బడ్జెట్‌లో 14--22 శాతం వరకు విద్యకు కేటాయిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందనే కారణంతో పాఠశాలల విలీనం, హేతుబద్ధీకరణ వంటి చర్యలకు ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి 23 పాఠశాలలు 4వేల పాఠశాలకు కుదిరిస్తామని పేర్కొన్నారు. పాఠశాలలు మూతపడితే, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలను ఆశ్రయించే మెజారిటీ బీసీ, ఎస్సీ, ఎస్టీలపై, బాలికల విద్యపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. మరోవైపు ప్రచారం ఎక్కువ... ప్రభుత్వ పాఠశాలల బలోపేతం తక్కువ అనే విమర్శ తెలంగాణ ప్రభుత్వంపై వినిపిస్తోంది. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకం హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలోనే అమలవుతుంది. విద్యార్థులకు బూట్లు, సాక్సులు, బెల్టు, పెన్నులు వంటి 21 వస్తువులతో కూడిన కిట్ అందజేస్తామని ప్రకటించినా ఇప్పటికి పాఠశాలలకు చేరలేదు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో విద్యా వ్యవస్థను రక్షించడంలో ప్రజా చైతన్యం కీలకంగా మారబోతుంది.

**అగ్రవర్ణ కార్పొరేట్ విద్య సంస్థల దోపిడి**

1991 ఆర్థిక సంస్కరణల అనంతరం విద్యారంగంలో ప్రైవేట్ పెట్టుబడులు వేగంగా పెరిగాయి. కార్పొరేట్, ఇంటర్నేషనల్, గ్లోబల్ పాఠశాలలు వెలిశాయి. ఇవి ఆధునిక సౌకర్యాలు, సాంకేతికత, ఇంగ్లిష్ మాధ్యమం వంటి అంశాలతో కొత్త అవకాశాలను కల్పించినప్పటికీ, విద్యను వ్యాపారంగా మార్చే ధోరణికి కూడా దారితీశాయి. అదేవిధంగా ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాల్లో విద్యే చాలా గొప్పగా ఉందని ప్రచారం జరిగింది. విద్యాసంస్థల స్థాపన, నిర్వహణలో ఆధిపత్య కులాల ప్రాబల్యం ఉండటం, వాటికి ప్రభుత్వాల మద్దతు లభించడమే ఇందుకు కారణం. అలాగే సామాజికంగా ఎదిగి అధికారంలో ఉన్న అగ్రవర్ణ నాయకులే విద్యాసంస్థల యాజమాన్యాల్లో భాగస్వాములు కావడం ప్రైవేట్ విద్యా వ్యవస్థకు మరింత బలం చేకూరింది. విద్య వ్యాపారీకరణకు మరింత ఊతం లభించింది. ఫలితంగా ప్రైవేట్ విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ బలహీనపడగా, ప్రభుత్వ విద్యాభివృద్ధి పట్ల నిర్లక్ష్యం పెరిగింది. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, అదనపు వసూళ్లు, వాణిజ్య ధోరణులు పెరిగాయి. అనివార్యంగా మధ్యతరగతి కుటుంబాల ఆదాయంలో మెజార్టీ భాగం పిల్లల విద్యకే ఖర్చవుతుంది. విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు, ఆర్‌టీఈ కోటా అమలులో నిర్లక్ష్యం, కనీస మౌలిక సదుపాయాల లేమితో అనేక ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తమిళనాడు ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ విషయంలో దేశంలోనే ఒక ఆదర్శ నమూనాగా గుర్తింపు పొందింది. ఇటీవల ప్రైవేట్ పాఠశాలలు తమ ఫీజు వివరాలను నోటీసు బోర్డుపై, వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించింది.

**గౌరవప్రదమైన, నాణ్యమైన విద్యకే ప్రాధాన్యం.**

గౌరవప్రదమైన పాఠశాల, నాణ్యమైన విద్య కావాలని తల్లి దండ్రులు కోరుకుంటున్నారు. కావున ప్రభుత్వం విద్యను సంక్షేమంగా, పేదరిక నిర్మూల కార్యక్రమంగా చూడరాదు. ప్రతి చిన్నారికి రాజ్యాంగ బద్ధంగా సమాన విద్యావకాశాలుగా అందాలి. ఇదీ ధనికులకు మాత్రమే లభించే ప్రత్యేక హక్కు కాకూడదు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు. అందరికీ సమానమైన, నాణ్యమైన విద్య అందాలంటే బలోపేతమైన ప్రభుత్వ పాఠశాల వ్యవస్థే పునాది. ఇది ప్రభుత్వాల చిత్తశుద్ధితో పాటు ప్రజల భాగస్వామ్యం, నిరంతర ప్రజా ఒత్తిడిపైన ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ప్రజా ఉద్యమంగా మారకపోతే, భవిష్యత్తులో విద్యలో అసమానతలు మరింత పెరిగి సమాజం భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. సామాజిక, ఆర్థిక అంతరాలకు దారి తీస్తుంది. ప్రభుత్వ పాఠశాలలను ప్రజల తొలి ఎంపికగా తీర్చిదిద్దేలా మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయ నియామకాలు, బోధన నాణ్యత, జవాబుదారీతనం, పారదర్శకతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే సమయంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులు, నాణ్యత, నిర్వహణపై సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థను అమలు చేయాలి. అదే నిజమైన విద్యా సంస్కరణలకు పునాది. భావితరాలకు బంగారు భవిష్యత్తు.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428



# ఒకే చిరునామా..
# అలికిడి లేని హృదయాలు..!

నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతికత మానవ జీవితాన్ని ఎంతగానో సులభతరం చేసింది. మనిషి ప్రపంచవ్యాప్తంగా కనెక్ట్ అవుతూ ఏ మూలన ఉన్న సమాచారాన్నైనా క్షణాల్లో చేతుల్లోకి తెచ్చుకుంటున్నాడు. కానీ, దురదృష్టవశాత్తూ అదే స్థాయిలో స్థానికంగా, తన సొంత ఇంట్లోనే ఒంటరివాడైపోతున్నాడు. చేతిలోని స్మార్ట్‌ఫోన్ ప్రపంచాన్ని చుట్టేస్తోంది కానీ, పక్కనే కూర్చున్న మనిషి గుండె చప్పుడిని వినలివ్వడం లేదు. ఆధునిక కుటుంబాలు నేడు ఒకే చిరునామాతో ఉన్న వేర్వేరు సైబర్ దీవులుగా మారిపోతున్నాయి. ఒకప్పుడు ఇళ్లల్లో గోడలు మాత్రమే మనుషులను విభజించేవి, నేడు ఐదు అంగుళాల తెరలు మనసులను వేరుచేస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్ వ్యసనం అనేది కేవలం ఒక అలవాటు కాదు, అది మన హృదయాలను, మన బంధాలను, మన పిల్లల భవిష్యత్తును నిశ్శబ్దంగా తినేస్తోన్న ఒక సామాజిక మహమ్మారి.


మనము ఫోన్ తెరను కిందికి మీదికి జరుపుతున్న ప్రతిసారీ.. మన బంధాల ఆయుష్షును కత్తిరిస్తున్నామనే పచ్చి నిజాన్ని అంగీకరించాలి. సామాజిక మాధ్యమాలలో ఎవరో తెలియని వ్యక్తి పెట్టే పోస్టులకు లైకులు కొట్టే చేతులు, పక్కనే కూర్చుని ఆకలి గురించో, అలసట గురించో చెప్పే భాగస్వామి భుజం తట్టడానికి రావడం లేదు. ఇళ్లల్లో సంభాషణలు పూర్తిగా చచ్చిపోయాయి. కేవలం 'కూరలో ఉప్పు లేదు', 'కరెంట్ బిల్లు కట్టాలి' లాంటి అవసరాల మాటలు తప్ప, మనసును తాకే ఆత్మీయ సంభాషణలు కరువవుతున్నాయి. దీనినే 'భావోద్వేగ గైర్హాజరు' అనవచ్చు. అంటే భౌతికంగా ఒకే గదిలో రూపమున్నా, మానసికంగా ఎవరి డిజిటల్ లోకాల్లో వారు విహరిస్తూ ఉంటారు. ఇది భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు - పిల్లల మధ్య ఒక అదృశ్య ఇనుప గోడను నిర్మిస్తోందనే చెప్పొచ్చు.

ఇప్పుడు పక్షపాతం అనేది కేవలం కులం, మతం, డబ్బు రూపంలోనే లేదు. అది 'శ్రద్ధ' రూపంలో కొత్త రూపు దాల్చింది. ఇళ్లల్లో నేడు 'డిజిటల్ వ్యత్యాసం' స్పష్టంగా కనిపిస్తోంది. ఒక చిన్నారి తన పాఠశాల చిత్రలేఖనాన్ని చూపించడానికి వస్తే, ఫోన్ వైపు చూస్తూ 'బాగుంది వెళ్లు' అనే ఒకే ఒక్క మాటతో ఆ బిడ్డ ఉత్సాహంపై తల్లిదండ్రులు చన్నీళ్లు చల్లుతున్న పరిస్థితి ఉందంటే కాదనగలమా..?. పిల్లల కంటే ఫోన్లకే ఎక్కువ ప్రాధాన్యత దక్కుతుండటంతో, పిల్లలు తమ ఇళ్లలోనే 'రెండో తరగతి పౌరులుగా' మారిపోతున్నారు. అటు పాఠశాలలు కూడా పిల్లలను కేవలం ర్యాంకులు, గ్రేడులు, సాంకేతిక నైపుణ్యాల ఆధారంగానే అంచనా వేస్తూ కేవలం అంకెల కోణంలో నడుస్తున్నాయి. ఒక విద్యార్థి లోపల ఎంత ఒంటరితనంతో బాధపడుతున్నాడు, ఆ బాలుడు / బాలిక ఎందుకు నిశ్శబ్దంగా మారిపోతున్నాడు అనే మానసిక కోణాన్ని చదివే ఓపిక నేటి యాంత్రిక విద్యావ్యవస్థకు లేదు.

తల్లిదండ్రుల కళ్లల్లోని ప్రేమను చూస్తూ, వారి స్పర్శను పొందుతూ పెరగాల్సిన పిల్లలు నేడు మొబైల్ తెరల వెలుతురులో పెరుగుతున్నారు. దీనివల్ల వారి మెదడు తీరు మారిపోతోంది. ప్రకృతిని చూసి, మనుషులతో మాట్లాడి నేర్చుకోవాల్సిన వయసులో, అల్గారిథమ్స్ ఇచ్చే కృత్రిమ ఉద్దీపనలకు బానిసలవుతున్నారు. ఫలితంగా వారిలో ఓర్పు నశిస్తోంది, చిన్న విషయాలకే హింసాత్మకంగా మారుతున్నారు. సమాజంలో ఇతరులతో ఎలా మెలగాలో, భావోద్వేగాలను ఎలా సమతుల్యం చేసుకోవాలో తెలియని 'సామాజిక వికలాంగులుగా' మారే ప్రమాదం ముందుకొచ్చింది.

ఈ డిజిటల్ చెరసాల నుండి బయటపడటానికి విప్లవాత్మకమైన అడుగులు అవసరం. అందుకోసం ప్రతి ఇంట్లోనూ 'వైఫై రహిత సమయాన్ని' అమలు చేయాలి. ముఖ్యంగా రాత్రి పూట భోజన సమయంలో ఇళ్లల్లో ఇంటర్నెట్, మొబైల్ డేటాను పూర్తిగా ఆపేయాలి. ఆ సమయం కేవలం మనుషుల మాటలకే పరిమితం కావాలి. అవతలి వ్యక్తి మాట్లాడుతున్నప్పుడు ఫోన్ వైపు చూడటం ఆపి, వారి కళ్లల్లోకి చూసి మాట్లాడే అలవాటును ఒక సామాజిక బాధ్యతగా మార్చుకోవాలి. అలాగే పాఠశాలల్లో వారానికి కనీసం ఒక్క రోజైనా పుస్తకాలు, కంప్యూటర్లు పక్కన పెట్టి విద్యార్థులు తమ మనసులోని భయాలను, ఆనందాలను పంచుకునేలా 'భావోద్వేగ తరగతులు' నిర్వహించాలి.

సాంకేతికత మనల్ని మనుషులుగా మార్చాలి కానీ, యాంత్రిక రోబోలుగా కాదు. మనం లైక్ చేసే 'రీల్స్' మన నిజ జీవిత బంధాలను నిజంగానే బలితీసుకుంటున్నాయి. రేపు మన చేతిలో కోట్లాది మంది ఫాలోవర్స్ ఉన్నా, మనసు బాగోలేనప్పుడు ఓదార్చే మనిషి పక్కన లేకపోతే ఆ జీవితం శూన్యం. స్మార్ట్‌ఫోన్ లాకులను తెరవడం కాదు.. ముందు మన మనసుల లాకులను తెరుద్దాం. మనసు విప్పి మాట్లాడుకుందాం.. మనుషులను బ్రతికించుకుందాం..!



కస్తూరిదారా
jannukastoori@gmail.com

# అమెరికా స్వాతంత్ర్యం.. 250 సంవత్సరాల విజయ గాథ

జూలై 4, 1776న స్వాతంత్ర్య ప్రకటనను ఆమోదించిన అమెరికా, ఈ ఏడాది 250వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటోంది. ఒకప్పుడు బ్రిటిష్ వలస ప్రాంతాలుగా ఉన్న 13 కాలనీలు, "ప్రతినిధులు లేకుండా పన్నులు వద్దు" అనే నినాదంతో ప్రారంభమైన స్వేచ్ఛా పోరాటం నేడు ప్రపంచ అగ్రరాజ్యంగా ఎదిగిన అద్భుత ప్రయాణం ప్రపంచ చరిత్రలో అపూర్వమైనది. ఈ 250 సంవత్సరాలలో అమెరికా సాధించిన విజయాలు కేవలం ఒక దేశం యొక్క వృద్ధి కాదు - స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, ఆవిష్కరణలు, మానవ హక్కులు అనే విలువల సమ్మేళనం ఎలా ఒక దేశాన్ని గ్లోబల్ లీడర్‌గా మార్చగలదో చూపించే జీవన సాక్ష్యం.




అమెరికా రాజ్యాంగం - ప్రపంచంలోనే అత్యంత పురాతన లిఖిత రాజ్యాంగాల్లో ఒకటి - అధికార విభజన, చెక్స్ అండ్ బ్యాలెన్సెస్, పౌర హక్కుల రక్షణ ద్వారా స్థిరమైన ప్రజాస్వామ్యానికి మార్గం చూపింది. అబ్రహం లింకన్ "ప్రజల ప్రభుత్వం, ప్రజల చేత, ప్రజల కొరకు" అని నిర్వచించిన ఆ భావన నేటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రేరణగా నిలుస్తోంది. బానిసత్వ నిర్మూలన, మహిళల ఓటు హక్కు, పౌర హక్కుల ఉద్యమాలు - ఇవన్నీ అమెరికా ప్రజాస్వామ్యం ఒక్క రోజులో పరిపూర్ణం కాలేదని, నిరంతర సంస్కరణల ద్వారా బలపడుతుందని బోధపెడతాయి.

ఆర్థికంగా, సైనికంగా, శాస్త్ర సాంకేతికంగా అమెరికా సాధించిన ఆధిపత్యం అద్భుతం. ప్రపంచ GDPలో సుమారు 25% వాటా, సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, చంద్రుని మీద మానవ పాదాలు, అత్యున్నత విశ్వవిద్యాలయాలు, అతిపెద్ద వ్యవసాయ ఎగుమతులు - ఇవన్నీ స్వేచ్ఛా మార్కెట్, పరిశోధనలకు భారీ పెట్టుబడులు, మేధో సంపత్తి రక్షణ, ప్రపంచం నలుమూలల నుంచి ప్రతిభను ఆకర్షించే వలస విధానాల ఫలితాలు. ఒక్క మాటలో చెప్పాలంటే - అమెరికా తన సహజ వనరుల కంటే మానవ వనరులు, చట్టపరమైన వ్యవస్థలు, ఆవిష్కరణలకు ఇచ్చిన స్వేచ్ఛను ఆధారం చేసుకుని ఎదిగింది.

అయితే ఈ విజయ గాథలో సవాళ్లను కూడా మరచిపోకూడదు. ఆదాయ అసమానతలు, జాతి వివక్ష, తుపాకీ హింస, రాజకీయ ధ్రువీకరణ వంటి సమస్యలు ఇప్పటికీ అమెరికా సమాజాన్ని సవాలు చేస్తున్నాయి. ఈ సవాళ్లను బహిరంగంగా చర్చించి, న్యాయవ్యవస్థ ద్వారా, చట్ట సవరణల ద్వారా పరిష్కరించే సామర్థ్యమే అమెరికా ప్రజాస్వామ్య బలానికి నిదర్శనం.

భారత్‌కు పాఠాలు భారత్-అమెరికా సంబంధాలు నేడు వ్యూహాత్మక భాగస్వామ్యంగా ఎదిగాయి. ప్రజాస్వామ్య విలువలు, సాంకేతిక సహకారం, రక్షణం, అంతరిక్షం, విద్య, వైద్యం రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారం మరింత విస్తరించాలి. అమెరికా నుంచి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది: రాజ్యాంగం పట్ల గౌరవం, పరిశోధనలకు ప్రాధాన్యం, ప్రతిభను ప్రోత్సహించే వ్యవస్థ, చట్టపరమైన పరిపాలన. అమెరికా 250 సంవత్సరాల చరిత్ర మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది - దేశం గొప్పదవడానికి సంపద కంటే సంకల్పం, చట్టం కంటే రాజ్యాంగం, వ్యక్తుల కంటే వ్యవస్థలు ముఖ్యం. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, ఆవిష్కరణలు, మానవ వనరుల అభివృద్ధి కలిసినప్పుడు ఏ దేశమైనా ప్రపంచ చరిత్రను మార్చగలదు. ఈ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా అమెరికా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. వారి ప్రయాణం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుంది.

- డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ఉప్పల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

**ఉప్పల్, జూలై 5 (జనం సాక్షి) :** మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని ఉప్పల్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఉప్పల్ నియోజకవర్గ మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఈ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారులు నేర్థం భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ అఖిలపక్ష పార్టీల తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా, గజ్జెల సత్యరాజ్ గౌడ్ సభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు హాజరై ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో వేలాది మంది ఉద్యమకారులు త్యాగాలు చేశారని, అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన



ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు పలు కీలక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలవారీ పెన్షన్, ప్రత్యేక గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ హామీలను విశ్వసించి తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తమ వంతు కృషి చేశారని, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విజయానికి ఉద్యమకారులు ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన సమయం వచ్చిందని, ఇకపై ఆలస్యం చేయకుండా మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను దశలవారీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక విధానాన్ని ప్రకటించాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే ఉద్యమకారుల ప్రతినిధులతో ప్రభుత్వం త్వరలో సమావేశమై వారి సమస్యలను తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోపు సదానంద్, అంబటి జగదీష్ ముదిరాజ్, చీమ శ్రీనివాస్, తెలంగాణ సంపత్, కురావత్ కృష్ణ నాయక్, సకినాల ప్రసాద్, తొలితర ఉద్యమకారులు మాటేటి కైలాసం, లక్ష్మీనారాయణ పటేల్, ఆడెపు శివకుమార్ నేత, బొల్లెపల్లి స్వామి, మహిళా నాయకులు కళావతి, నస్రీన్, లక్ష్మి, ధనుంజయ గౌడ్, మేకల శ్రీనివాస్, గణేష్ నేత, గన్నోజు సదానంద్ చారి, గిరెడ్డి జనార్దన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సందెల శ్రీనివాస్, మురళి చారి, హమీద్, సురేష్ దండు, కీర్తి శ్రీనివాస్, ధనుంజయ చారి, దయానంద్, భూపాల్, జగన్ యాదవ్, బాల నరసింహ, రవి, ఉమేష్ సింగ్, సత్యనారాయణ, వస్త్రాల వెంకటేష్, చిందం నరసింహ, విజయ్ తదితర తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల కోసం చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి




సదాశివపేట, జూలై 5 (జనం సాక్షి) : సదాశివపేట, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇంద్రపార్క్ వద్ద నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని ప్రజలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం సదాశివపేటలో జరిగిన పార్టీ ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇండ్ల పట్టాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదాశివపేటలో ఏళ్లుగా పేదలు ఇళ్ల స్థలాల కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. గతంలో ఇచ్చిన పట్టాలను కూడా వెనక్కి తీసుకోవడం అన్యాయమన్నారు. సంగారెడ్డి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీపీఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి ఎం. ప్రవీణ్‌కుమార్‌తో పాటు రమేష్ గౌడ్, అనిల్, అశోక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులందరూ లేబర్ కార్డులు పొందాలి



**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 5 (జనం సాక్షి) :** అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు పొందాలని, తద్వారా ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ పిలుపునిచ్చారు. ఆదివారం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్-3 భూ పోరాట కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (బీఓసీ) రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బీఓసీ జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్ అధ్యక్షత వహించగా, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి కూడా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారీ మాట్లాడుతూ, బీఓసీ ఆధ్వర్యంలో 150 మంది కార్మికులకు లేబర్ కార్డులు ఇప్పించి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. లేబర్ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలపై చాలా మంది కార్మికులకు అవగాహన లేకపోవడంతో వాటిని పొందడంలో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. లేబర్ కార్డు కలిగిన కార్మికులకు ప్రమాదాల సమయంలో వైద్య సహాయం, ప్రమాద బీమా, మరణానంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం, గర్భిణీ మహిళలకు గర్భధారణ, ప్రసవ సమయంలో ఆర్థిక సహాయం, కార్మికుల పిల్లల విద్యకు ఆర్థిక ప్రోత్సాహం వంటి అనేక సంక్షేమ ప్రయోజనాలు లభిస్తాయని వివరించారు. దళారులను నమ్మి డబ్బులు వృథా చేసుకోకుండా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుల సహకారంతో ఉచితంగా లేబర్ కార్డులు పొందాలని కార్మికులకు సూచించారు. అసంఘటిత రంగంలోని ప్రతి కార్మికుడు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుడిగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, బీఓసీ మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు సైదులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మాధవ్ నగర్ కాలనీలో ఎస్ఐఆర్ ఓటరు నమోదు

- **ఫారాల పంపిణీ చేసిన గోపాల్ ముదిరాజ్**

**హయత్ నగర్, జూలై 5 (జనం సాక్షి) :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా మాధవ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాలనీవాసులకు ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేశారు. మాధవ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీవాసులకు ఫారాలను అందజేసి, వాటిని ఎలా నింపాలో అవగాహన కల్పించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి కాలనీ సభ్యులు మోహన్ రెడ్డి, విజయ్ సేనా రెడ్డి, మణిపాల్ రెడ్డి ప్రత్యక్షంగా సహాయం అందించి దరఖాస్తులను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో ముఖ్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, తమ వివరాలను సరిచేసుకోవడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు



చేసుకోవాలని కోరారు. ఫారాల నింపడంపై ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు తగిన సూచనలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షులు గోగిరెడ్డి అంజిరెడ్డి, గోగు శేఖర్ రెడ్డి, ఎం.డి. భాషా, మేక వెంకట్ రెడ్డి, విజయ్ సేనా రెడ్డి, మోహన్ రెడ్డి, మణిపాల్ రెడ్డి తదితరులు పాల్గొని కాలనీవాసులకు ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేశారు.

## మారుతీ నగర్, మధురనగర్ కాలనీలలో పర్యటించిన ఎమ్మెల్యే

- **సమస్యల పరిష్కారానికి హామీ**




**అమీన్పూర్, జూలై 5 (జనం సాక్షి) :** అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తూ.. నిధులు కేటాయిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్, మధురా నగర్ కాలనీలో పర్యటించి.. ప్రజలతో నేరుగా సమావేశమయ్యారు. కాలనీలలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కాలనీలు రోజురోజుకి అభివృద్ధి చెందిన మూలంగా పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు పునర్నిర్మాణం చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పన కోసం నిధులు కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు. పై రెండు కాలనీలలో ప్రధాన సమస్యలైన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, వర్షపు నీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్ ను ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. అతి త్వరలో వీటి నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. బీరంగూడ శివాలయం కమాన్ వద్ద డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిఈ వెంకటరమణకు సూచించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే ప్రజల సమస్యలు అవగతమవుతాయని అధికారులకు తెలిపారు. ప్రతి కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజల సైతం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు జగదీష్, రమేష్ గౌడ్, సునీత, లక్ష్మీకాంత్ రెడ్డి, దాసు, మల్లేష్, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేద, మధ్యతరగతి ప్రజలకు వరం



**ఉప్పల్, జూలై 5 (జనం సాక్షి) :** సీఎంఆర్ఎఫ్ పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ కింద వైద్య సహాయాన్ని సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉప్పల్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన సుక్క జీవన్‌కు మంజూరైన రూ.4.47 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును పరమేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు, ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, పరమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బీరప్పగడ్డ డివిజన్ అధ్యక్షుడు ఆకిటి ఆగం రెడ్డి, చిలకనగర్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, బజార్ జగన్నాథ్ గౌడ్, రాజేష్, నవీన్ యాదవ్, కుషాంగుల సతీష్ ముదిరాజ్, తూర్పాటి జంగయ్య, శ్రీరాములు, కాజా మూలన, సత్యనారాయణ, జగదీష్ ముదిరాజ్, శ్రీను, మంగళ నాగరాజ్, షఫీమ్, వహీద్, గీతతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి




**యాచారం, జూలై 5 (జనం సాక్షి) :** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని తాడిపర్తి గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షులు నీలం రాము పేర్కొన్నారు. గ్రామానికి చెందిన బండారి శ్రీను, మౌనిక దంపతులు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో 18,500 రూపాయలు మంజూరు అవ్వడం జరిగింది. ఈ మేరకు మంజూరైన చెక్కును తాడిపర్తి గ్రామంలో బాధితుడి కుటుంబ సభ్యులకు నాయకులు స్వయంగా కలిసి అందజేశారు. కష్టకాలంలో తమకు ఆర్థిక చేయూతను అందించి ఆదుకున్న ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డికి, గ్రామ కాంగ్రెస్ నాయకులకు బాధితుడి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ డైరెక్టర్ మండలి జంగయ్య, ఉప సర్పంచ్ రమేష్, వార్డ్ మెంబర్ యూసఫ్ పటాన్, పార్టీ ముఖ్య నాయకులు నీలం పాండు, మండలి యాదగిరి, బైకని వెంకటేష్, మోతకాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బోయినపల్లిలో రామ్‌రాజ్ కాటన్ 351వ షోరూమ్ ప్రారంభం

**సికింద్రాబాద్, జూలై 5 (జనంసాక్షి) :** సాంప్రదాయ కాటన్ దుస్తుల బ్రాండ్ రామ్‌రాజ్ కాటన్ తన రిటైల్ విస్తరణలో భాగంగా బోయిన్ పల్లిలో 351వ షోరూమ్‌ను ఆదివారం ప్రారంభించింది. బాపూజీనగర్‌లోని చిన్న తోకట్ట విలేజ్ సమీపంలో, స్టార్ బజార్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను భవన యజమానులు ఎల్. నారాయణ రెడ్డి, ఎల్. నీలాతో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు కె.పాండు యాదవ్, ది కాస్మోస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ మేనేజర్ ఆర్. మధు దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తొలి కొనుగోలును భవన యజమానులు నిర్వహించారు. నూతన



షోరూమ్‌లో బార్డర్, ముడతలుపడని, సువాసన,ఎంబ్రాయిడరీ, పంచకచ్చం,పట్టుధోతీలతో పాటు కాటన్, లినెన్, డిజైనర్, పట్టు షర్టు, ధోతీ - షర్ట్ కాంబోలు, మహిళలకు కాటన్, పట్టుచీరలు, లెగ్గింగ్స్, అలాగే పురుషులు,మహిళలు, పిల్లల కోసం ఇన్నర్‌వేర్, దుస్తులు,తువ్వాళ్లు, రుమాళ్లు, సాక్స్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన దుస్తులు సరసమైన ధరలకు అందించాలని సూచించారు. రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కె.ఆర్. నాగరాజన్ మాట్లాడుతూ...హైదరాబాద్ తమకు కీలకమైన మార్కెట్ అని, బోయిన్ పల్లి షోరూమ్ ద్వారా నగరంలోని వినియోగదారులకు నాణ్యమైన సాంప్రదాయ దుస్తులను మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. భారతీయ వస్త్ర సంప్రదాయాన్ని పరిరక్షిస్తూ ఆధునిక వినియోగ దారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే సంస్థ లక్ష్యమన్నారు.

# అర్హులైన పేదలకు ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలి

- **అఖిలభారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవి యాదవ్**
- **హిమాయత్ నగర్‌లో ఇండ్ల స్థలాల కోసం లబ్ధిదారుల రిలే నిరాహార దీక్ష**

**మొయినాబాద్, జూలై 5 (జనం సాక్షి) :** అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అప్పట్లో ఇచ్చిన ఇండ్ల స్థలాలలో ఇండ్లు కట్టుకునేందుకు కృషి చేయాలని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవి యాదవ్ హిమయత్ నగర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు మాలయాదయ్య లు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ రెవెన్యూ సర్వే నంబర్ 151 లో అప్పట్లో 290 మందికి ఇండ్ల పట్టాలు అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పిరియడ్లో కాంగ్రెస్ ప్రభుత్వం అందజేసింది ఇల్లు కట్టుకునేందుకు అనుమతించాలంటే పది రోజుల నుంచి



లబ్ధిదారులు గ్రామంలోని నాలుగు యువజన సంఘాల అధ్యక్షులు అర్హులైన వారితోపాటు గ్రామస్తులతో కలిసిరిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు ఈ దీక్షకు తెలంగాణ రాష్ట్ర అఖిలభారత యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవి యాదవ్ మాజీ వార్డు సభ్యుడు మాల యాదయ్యపాల్గొని సంఘీభావం తెలిపారు ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్లు ఉన్న లబ్ధిదారులందరూ పాల్గొనాలని కోరారు. గత పది పన్నెండు సంవత్సరాల నుంచి పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ప్రభుత్వము కొన్ని కారణాలవల్ల కేసు ఉండడంతో ఇండ్లు కట్టుకోలేకపోయారని కేసు పరిశీలన పూర్తయిందని ఇప్పుడు సర్టిఫికెట్లు ఉన్న లబ్ధిదారులతో పాటు అర్హులైన లబ్ధిదారులందరినీ గుర్తించి ఇండ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం అనుమతించాలని పేర్కొన్నారు హిమాయత్ నగర్ గ్రామంలో అనేకమంది పేదలు ఇండ్లు ఇండ్ల స్థలాలు లేక ఇబ్బందులు కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్నారని అర్హులైన వారందరినీ ఇప్పటికైనా ప్రభుత్వము ఆలోచించి ఇల్లు నిర్మించుకునేందుకు కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలోమాజీ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మాల యాదయ్య దోమ మల్లేష్ మాజీ శాంతి యువజన సంఘం అధ్యక్షుడు మల్లేష్ మహేందర్ యాదవ్ యువజన సంఘాల అధ్యక్షులు సభ్యులు గ్రామస్తులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట్ ట్రాఫిక్ పోలీసులకు ఆరోగ్య పరీక్షలు




**సికింద్రాబాద్, జూలై 5 (జనంసాక్షి) :** ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఆరోగ్యం, శారీరక దృఢత్వం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్ రాజు మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసు సిబ్బంది నిరంతరం ప్రజాసేవలో ఉండే నేపథ్యంలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడం అవసరమని సూచించారు. రెటినోవా ఫౌండేషన్, శ్రీకర హాస్పిటల్, ప్లానెట్ ఆప్టిక్స్, పద్మసాయి డెంటల్ క్లినిక్, స్కైఫిట్ ఫిజియోథెరపీ సంస్థల సహకారంతో నిర్వహించిన శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి,దంత పరీక్షలు, ఫిజియోథెరపీ సేవలు,ఆరోగ్య సలహాలు అందించారు. పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ బి.సుమతి ఆదేశాల మేరకు ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి చొరవతో ఈ కార్యక్రమం నిర్వహించామని ఆయన చెప్పారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
06 జూలై 2026

# కల్వకుర్తి మండలంలో సర్ ఫారాల ఫీవర్..!

- ఫారాలు ఎలా నింపాలో తెలియక ఓటర్ల అయోమయం
- గ్రామాల్లో అవగాహన లోపం.. నిరక్షరాస్యులు, వృద్ధుల ఆందోళన
- గిరిజన ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్న ప్రజలు

**కల్వకుర్తి, జూలై 5 (జనంసాక్షి) :** కల్వకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం సర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ఫారాల ప్రక్రియ ఓటర్లకు తలనొప్పిగా మారుతోంది. ఇంటింటికీ వెళ్లి బూత్ స్థాయి అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్నప్పటికీ, వాటిని ఎలా నింపాలి,ఏ వివరాలు నమోదు చేయాలి, ఎక్కడ సమర్పించాలి అనే అంశాలపై స్పష్టమైన అవగాహన లేకపోవడంతో సామాన్యులు, నిరక్షరాస్యులు తీవ్ర అయోమయంలో పడుతున్నారు. గ్రామాల్లో ఫారాలు అందుకున్న పలువురు ఓటర్లు వాటిలోని కాలమ్‌లను అర్థం చేసుకోలేక స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, మీ సేవా కేంద్రాల చుట్టూ


Enumeration Form
Date of Birth (DD/MM/YYYY)
Aadhaar No. (Optional)
Mobile No.
Father's/Guardian's Name
Mother's Name

తిరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, చదువు లేని వారు ఫారాలను చూసి ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు ధృవీకరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ ఫారాలు పంపిణీ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఓటర్ల వివరాల ధృవీకరణ ఈ ప్రక్రియ ద్వారా జరుగుతోంది. అయితే మండలంలోని కొన్ని గ్రామాల్లో ఫారాలు అందజేసిన తర్వాత వాటిని ఎలా నింపాలనే విషయంపై పూర్తి వివరణ ఇవ్వడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఫలితంగా ఒకరి వద్ద నుంచి మరొకరు సమాచారం తెలుసుకునే పరిస్థితి నెలకొంది.కొన్ని చోట్ల బీఎల్ఓలను సంప్రదించినా పూర్తి స్థాయి సమాచారం అందడం లేదని ఓటర్లు పేర్కొంటున్నారు. దీంతో ఫారంలో ఏ వివరాలు నమోదు చేయాలి, పాత ఓటరు వివరాలు ఎలా గుర్తించాలి,కుటుంబ సభ్యుల సమాచారం ఎలా నమోదు చేయాలనే అంశాలపై సందిగ్ధత కొనసాగుతోంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాలు ఓటరు వివరాల ధృవీకరణ కోసం పంపిణీ చేయబడుతున్నాయి. ఫారాలను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా సమర్పించే అవకాశం కూడా కల్పించబడింది.ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు గ్రామ స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఫారాలు నింపే విధానంపై స్పష్టమైన సూచనలు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి
- ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ ప్రారంభం



**చేర్యాల, జూలై 5 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీతోనే సొంత ఇల్లు నిర్మాణ సాకారం జరుగుతుందని జనగామ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ,మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆదివారం చేర్యాల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో నర్ర రమేష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వ హయాంలో సొంత ఇల్లు నిర్మాణ సహకారం జరగలేదని అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న నర్ర రజిత-రమేష్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క ఓటు నష్టపోకుండా చూడాలి

- ఎస్ఐఆర్ కాంగ్రెస్ కన్వీనర్ కేదార్నాథ్ పాటిల్



**రాయికోడు, జులై 5 (జనం సాక్షి) :** అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత బి ఎల్ ఏ ల పై ఉందని ఎస్ ఐ ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్ సూచించారు. మండల పరిధిలోని పిప్పడుపల్లి, మందాపూర్, కర్చల్, ఇందూరు, హస్నాబాద్, కోడూరు, గ్రామాలలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నరసింహులు తో కలిసి సమగ్ర ఓటర్ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేదార్నాథ్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు నింపే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని సూచించారు.అర్హత గల వాళ్లందరి ఓట్లు నష్టపోకుండా చూడాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజ్ పాటిల్, పార్టీ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్, సర్పంచులు అశ్విని సంగమేశ్వర పాటిల్, ఊర్మిళ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంకాళి, బక్కప్ప, బస్సులింగ్, సుభాష్, ఆర్ రాజు కురుమ, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం తొలగింపును అడ్డుకుంటాం

- చౌరస్తా సర్కిల్ మధ్యలో అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టించాలి
- బీఎస్పీ నేత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్

**ఫరూక్‌నగర్, జూలై 5 (జనంసాక్షి) :** షాద్‌నగర్ అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కుట్రపూరితంగా విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాలను అడ్డుకుంటామని దీనిని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ (అడ్వకేట్) హెచ్చరించారు. ఆదివారం షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.అంబేద్కర్ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చే మహనీయుడని, అభివృద్ధికి దిక్సూచని ఆయన విగ్రహాన్ని చౌరస్తా నుంచి తొలగించే ఎలాంటి చర్యలనైనా సహించబోమని స్పష్టం చేశారు. గతంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ మరియు అంబేద్కర్ యువజన సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని చౌరస్తాను విస్తరించి అదే ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్న విషయాన్ని



గుర్తు చేశారు.రోడ్డు విస్తరణకు బీఎస్పీ పార్టీ ఎప్పుడూ అడ్డు చెప్పమని అందుకు అభ్యంతరం లేదని, అయితే విగ్రహాన్ని పూర్తిగా తొలగించే ప్రయత్నాలు జరిగితే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జిలు గుండేటి నర్సింలు, జి. బాలయ్య, తుప్పరి కుమార్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ నీరటి రాజు, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు శివగల్ల ఆంజనేయులు, చౌదర్‌గూడ మండల అధ్యక్షుడు చెన్నయ్య, షాద్‌నగర్ మున్సిపాలిటీ 15వ వార్డు ఇన్‌చార్జి అయ్యప్ప, సి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సకారమే ప్రభుత్వ లక్ష్యం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



**పెద్దశంకరంపేట, జూలై 5 (జనం సాక్షి) :** ప్రజల సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్మని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన కుశీట్ల శ్రీనివాస్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి లబ్ధిదారులతో కలిసి కొత్త ఇండ్లలోకి అడుగుపెట్టి వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల ఆత్మగౌరవంతో జీవించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళి పంతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్త మృతి తీరని లోటు

- సరదా నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుమ్మరి రాము

**మొయినాబాద్, జూలై 5 (జనం సాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎంకేపల్లి గ్రామ కార్యకర్త డబ్బు కరంచంద్ మృతి పార్టీకి తీరని లోటని ఆయన పార్టీ కోసం ఎనలేని కృషి చేశారని సరదా నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జీవన్ కూడా రాము ఎంకేపల్లి గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు చాకలి శ్రీనివాస్ లు పేర్కొన్నారు. ఆదివారము ఎనకపల్లి గ్రామంలో డప్పు కరంచంద్ దశదినకర్మ సందర్భంగా ఎంకేపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు వారి కుటుంబానికి లక్ష రూపాయల సహాయ ఆర్థిక అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ ఎన్కెపల్లి గ్రామంలో డప్పు కరంచంద్ తనదైన శైలిలో పార్టీ కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పార్టీ నాయకులను గ్రామస్తులను ఎంతో బాధకు కలిసిందని అన్నారు



పార్టీలో కష్టపడి పనిచేస్తున్న వ్యక్తులు ఇలాంటి సంఘటనలకు గురై మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు వారి కుటుంబం అన్ని విధాలుగా ఉండేందుకు రాష్ట్ర బి ఆర్ ఎస్ పార్టీ అధినాయకులు కేటీఆర్ కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపినట్లు సూచించారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సుకూర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురం ప్లాట్ల బాధితులకు న్యాయం చేస్తాం



**రామచంద్రాపురం, జూలై 5 (జనం సాక్షి) :** కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్ల యజమానుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొల్లూరులో లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1984లో సర్వే నంబర్లు 173 నుంచి 190 వరకు ఉన్న 142 ఎకరాల్లో సుమారు 1,500 మంది ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనల మేరకు ప్లాట్లు కొనుగోలు చేశారని తెలిపారు. అనంతరం కొందరు తప్పుడు పత్రాలతో అదే ప్లాట్లను విక్రయించి అసలు యజమానులను మోసగించారని ఆరోపించారు. బీఎల్ ప్రసాద్ ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లను కబ్జా చేసి హెచ్‌ఎండీఏ అనుమతులతో నిర్మాణాలు చేపట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అక్రమ అనుమతులను రద్దు చేయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ప్లాట్ యజమానుల హక్కులను పరిరక్షించడంలో రాజీ పడబోమని, ఎంతటి పెద్దవారు అడ్డొచ్చినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ప్రతి ప్లాట్ యజమానికి పూర్తి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో సీనియర్ నాయకులు నరసింహ, యాదయ్య, వెంకట్రాంరెడ్డి, మధు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్ళల్లో ఆనందం



**బెజ్జంకి, జూన్ 5 (జనం సాక్షి) :** మండలం లోని గుండారం గ్రామానికి చెందిన చల్ల వెంకటవ్వకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అమర్ రాజు ప్రశాంత్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అమర్ రాజు ప్రశాంత్ మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని,అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని అన్నారు.పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.లబ్ధిదారురాలు చల్ల వెంకటవ్వ మాట్లాడుతూ తమ సొంతింటి కలను నెరవేర్చిన మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కు,మాజీ ఎంపీపీ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్‌కు,కాంగ్రెస్ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి,కోరుకొప్పుల సంపత్,కోని అచ్చయ్య,నాయకులు పుల్ల పోచయ్య,గోపాల్ రెడ్డి,బుర్ర సుమన్,రమేష్,భాస్కర్ రెడ్డి,రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి


- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

**సంగారెడ్డి, జూలై 5 (జనం సాక్షి) :** అర్హులైన పేదలకు ఇండ్లు,ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు.నేడు సంగారెడ్డి లో సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇండ్లు,ఇండ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. తెలంగాణలో ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 2 సంవత్సరాలు అవుతున్న సమస్య పరిష్కారం కావటం లేదన్నారు.నిరుద్యోగులకు ఉద్యోగాల హామీలు వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాలు లేని ప్రతి పేద కుటుంబానికీ 120 గజాల స్థలం కేటాయించి, గుడిసెలు వేసుకుని నివసిస్తున్న కుటుంబాలన్నింటికీ శాశ్వత పట్టాలు ఇవ్వాలని కోరారు. అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న అర్హులందరికీ పట్టా పాసుబుక్కులు జారీ చేయడంతో పాటు




పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. రాష్ట్రంలో వేలాది పేద కుటుంబాలు ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న గృహ, ఉపాధి, జీవన వ్యయ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6న హైదరాబాద్లోని ఇందిరా పార్కు వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం సిపిఎం నాయకులు నర్సిములు,శ్రీనివాస్,శేఖర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేద, మధ్యతరగతి ప్రజలకు వరం



**ఉప్పల్, జూలై 5 (జనం సాక్షి) :** సీఎంఆర్ఎఫ్ పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ కింద వైద్య సహాయాన్ని సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉప్పల్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన సుక్క జీవన్‌కు మంజూరైన రూ. 4.47 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును పరమేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు, ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, పరమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బీరప్పగడ్డ డివిజన్ అధ్యక్షుడు ఆకిటి ఆగం రెడ్డి, చిలకనగర్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, బజార్ జగన్నాథ్ గౌడ్, రాజేష్, నవీన్ యాదవ్, కుషాంగుల సతీష్ ముదిరాజ్, తూర్పాటి జంగయ్య, శ్రీరాములు, కాజా మూలన, సత్యనారాయణ, జగదీష్ ముదిరాజ్, శ్రీను, మంగళ నాగరాజ్, ఫషీమ్, వహీద్, గీతతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి
- గ్రామపంచాయతీ భవన ప్రారంభం
- మహిళ సమైక్య భవనాలకు భూమి పూజ

**వెల్దుర్తి, జూలై 5 (జనం సాక్షి) :** రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అన్నారు ఆదివారం రోజు ఉప్పు లింగాపూర్ రామయ్యపల్లి గ్రామాలలో మహిళా సమాఖ్య భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు అలాగే రామయ్య పల్లి లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు వెల్దుర్తి నుండి మెదక్ వరకు రెండు వరుసల



రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కాంట్రాక్టర్ ఆలస్యంతో పనులన్నీ ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయని ఆ నిధులను రద్దు చేస్తేనే తిరిగి కొత్త నిధులు మంజూరు అవుతాయని రోడ్డు నిర్మాణానికి సంబంధించి సంబంధిత శాఖ మంత్రి ని కలిసి విన్నవించడం జరిగిందని అలాగే అసెంబ్లీలో సైతం రోడ్డు బాగోలేక ఎంతోమంది ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని ప్రస్తావించిన ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదన్నారు గత ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమం నిర్వహించడంతో గ్రామాల రూపురేఖలు మారాయని ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్ మాజీ ఎంపీటీసీలు అశోక్ గౌడ్ మోహన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి శ్రవణ్ కుమార్ కోదండ కృష్ణ గౌడ్ రమేష్ చందర్ తదితర టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలకు దేహదానం

- కోన్ రెడ్డి ఉపేంద్ర పార్థివ దేహాన్ని నర్సంపేట మెడికల్ కళాశాలకు అప్పగింత






**చెన్నారావుపేట, జూలై 5 (జనంసాక్షి) :** మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కోన్ రెడ్డి ఉపేంద్ర (80) అకస్మాత్తుగా ఆదివారం మృతి చెందింది. ఆమె కుమారుడు కోన్ రెడ్డి రామ్ మోహన్ రెడ్డి, మనుమడు ట్వింకిల్ లు సమాజ హితం కోరి వైద్య విద్య నిమిత్తం నర్సంపేట మెడికల్ కళాశాలకు మృతురాలు ఉపేంద్ర పార్థివ దేహాన్ని దానం చేయుటకు అంగీకరిస్తూ ముందుకు వచ్చారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ లో ఆమె పార్థివ దేహాన్ని నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అటానమి విభాగానికి ఆదివారం అప్పగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, అటానమి విభాగపతిలకు అప్పగించినట్లు వారు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ఉపేంద్ర పార్థివ దేహం ఎంబిబిఎస్ వైద్య విద్యార్థుల మెడికల్ చదువుకు, సర్జరీకి, వైద్య పరిశోధనకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఒక నిశ్శబ్ద గురువుగాను, భావి వైద్యులకు ప్రత్యేక్ష పాత్య బోధన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ త్యాగం చేసిన ఉపేంద్ర కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, మనువలు, మనుమరాళ్లు రాఘవరెడ్డి, బుచ్చిరెడ్డి, సాంబరెడ్డి, లక్ష్మారెడ్డి, చింతకింది అశోక్, జయేందర్ రెడ్డి, చల్ల వెంకట్ రెడ్డి, ఉమారెడ్డి, తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### అన్నపూర్ణ పరపతి సంఘం

# ఈశాన్య రాష్ట్రాల విహారయాత్ర



**వరంగల్ ఈస్ట్, జూలై 05 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఫోర్ట్ రోడ్ ఏకశిలా నగర్ లో గల అన్నపూర్ణ పరపతి సంఘం 532 మంది సభ్యులు ఐదు బ్యాచులుగా జూన్ 25 నుండి జూలై 5 వరకు ఈశాన్య రాష్ట్రాలలోని ప్రముఖ శక్తిపీఠమైన కామాఖ్య దేవి శక్తిపీఠం, చిరాపుంజు, ఉమా గోట్ నది, సెవెన్ సిస్టర్స్ వాటర్ ఫాల్స్, భీమేశ్వర దాం, ఎలిఫెంట్ ఆఫ్ వాటర్ ఫాల్స్, ఉమా నందీశ్వర ఆలయం, వెంకటేశ్వర స్వామి ఆలయం, వెళ్లి దర్శనం దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారు . ఈ సందర్భంగా మన్ విలాంగ్ విలేజ్ ఆసియాలో అత్యధిక పరిశుభ్రమైన నగరంగా సభ్యులు తెలిపారు. వెదురు బుట్టలలో తడి పొడి చెత్త వేరు చేస్తారు. మాతృస్వామ్య వ్యవస్థ ఇక్కడ ఉంటుంది. ఇక్కడ తల్లి ఇంటి పేరునే తమ ఇంటి పేరుగా వాడుతారు. పర్యాటకంగా ఎంతో గొప్పగా ఉన్నటువంటి ఈ ప్రాంతాలను సభ్యులు చూసి తన్మయత్వం చెందారు. ఈ యాత్రలో ఇన్చార్జిలుగా మాచన శ్రీధర్, భేతి రాజు, కోడం సతీష్, వలస రాజమల్లు, పెంచాల నరసయ్య, టేకుమట్ల కుమారస్వామి, నేల రాజు, అనుమాస సారయ్య, ఇనుముల ఆగయ్య, బిట్ల సుధాకర్, బత్తిని వీరభద్రయ్య, పోషాల మల్లికార్జున్, రఘువీర్, రాజేందర్, ఎనబోతుల సాంబయ్య, ధర్మపురి జోగేందర్, కొండలరావు, ప్రేమ్ సాగర్, రాజేందర్, గోని కార్ కిషోర్, బండి కోటేశ్వర్, ఇనుముల మల్లేశం, దామోదర్ యాదవ్, హరినాథ్, వెంకటేశ్వర్లు, చక్రపాణి తదితరులు ఉన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదలలో రేవంత్ సర్కార్ రికార్డు



**తాండూర్, జులై 05(జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం ఐబి కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పెద్దబోయిన శంకర్ ఆధ్వర్యంలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన శుభసందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తూ రైతు ఖాతాలో జమ చేస్తోందన్నారు. ప్రజా, రైతు సంక్షేమం, అభ్యున్నతి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, ఐఎన్టీయూసీ నాయకులు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ లు షేక్ మోమిన్ అలీ,చిట్లా రమేష్, తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ నవీన్ పటేల్, కటికల మల్లేష్, సర్పంచ్‌లు ఆకుల వెంకటేష్, గట్ల నర్సయ్య, శ్రీనివాస్ - స్రవంతి, ఉప సర్పంచ్ లు దామోదర్ రెడ్డి ,రామ్మోహన్ ,సేవాదళ్ నాయకులు ఇందురీ గట్టయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు శ్రీనివాస్, నాగరాజు, మైనార్టీ నాయకులు జావిద్ హుస్సేన్, సెక్రటరీ జైన సాంబయ్య, ఇందురీ సత్యం, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మహేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ అహ్మద్, వెంకగౌడ్, పుట్ట శ్రీనివాస్, బిఎల్ఎ కో-ఆర్డినేటర్స్ మేడి శంకర్, ఎండి గౌస్, గోవర్ధన్, జీధుల వేణు, తాండూరు మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేగ స్వామి, కొండగోర్ల అంజి, పప్పీ, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవీ విరమణ ఉద్యోగానికే.. సామాజిక సేవకు కాదు

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**సిరికొండ, జూలై 05 (జనం సాక్షి):** ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ అనేది బాధ్యతల నుంచి మాత్రమేనని, సామాజిక సేవకు అది ముగింపు కాదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సిరికొండ మండలం సుంకిడి గ్రామానికి చెందిన మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) రాథోడ్ ఉదయ్‌రావు పదవీ విరమణ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవలో నిజాయితీ, అంకితభావంతో పనిచేసిన అధికారులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. ప్రభుత్వ సేవలో నిజాయితీ, అంకితభావంతో పనిచేసిన అధికారులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు. రాథోడ్ ఉదయ్‌రావు విద్యాశాఖలో అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. సమాజం పట్ల బాధ్యతను కొనసాగిస్తూనే ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పదవీ విరమణ అనంతరం కూడా విద్యా, సామాజిక రంగాల్లో తన అనుభవాన్ని పంచుకుంటూ ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉదయ్‌రావు దంపతులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ ఎమ్మెల్యే రాయల్ శంకర్, బోథ్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం ప్రభుత్వం గ్రామబాట

- ములుగులో వినూత్న ప్రత్యేక ప్రజాదర్బార్ మోడల్..
- మంత్రి సీతక్క ఆలోచనతో తొలిసారిగా గ్రామాల్లో ప్రత్యేక ప్రజాదర్బార్
- ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచిన ములుగు జిల్లా...





**ములుగు ప్రతినిధి,జూలై05(జనం సాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా ప్రజాకేంద్రీకృత పరిపాలనలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే వినూత్న కార్యక్రమాన్ని అమలు చేసింది.ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి సమస్యలు చెప్పాల్సిన సాంప్రదాయ విధానానికి భిన్నంగా, "ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలి" అనే ఆలోచనతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో గ్రామ స్థాయిలో ప్రత్యేక ప్రజాదర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అడవులు, గిరిజన తండాలు అధికంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లాలో మారుమూల గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రాలకు పలుమార్లు వెళ్లి సమస్యలు వినిపించడం కష్టసాధ్యమనే అంశాన్ని గుర్తించిన మంత్రి సీతక్క, ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ వినూత్న కార్యక్రమాన్ని ములుగు జిల్లా ప్రారంభించడం ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది.ఈ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లాలోని వెంకటాపురం, మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, ములుగు, తాడ్వాయి, వెంకటాపూర్,మల్లంపల్లి మండలాల పరిధిలోని మొత్తం 63 గ్రామపంచాయతీలలో ప్రత్యేక ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమాల్లో స్థానిక మంత్రి దనసరి అనసూయ సీతక్క స్వయంగా పాల్గొని, అప్పటి జిల్లా కలెక్టర్ ప్రస్తుతం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,ప్రస్తుత జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి గ్రామాల్లోనే ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వినతిపత్రాలను స్వీకరించారు. ప్రత్యేక ప్రజాదర్బార్‌లో ప్రజలు భూ సమస్యలు,ఇందిరమ్మ ఇండ్లు,కొత్త రేషన్ కార్డులు,నూతన పెన్షన్లు,తాగునీరు, అంతర్గత రహదారులు, విద్యుత్, రెవెన్యూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక అంశాలపై అర్జీలు సమర్పించారు. అందిన ప్రతి దరఖాస్తుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి, జిల్లా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు.సాధారణంగా ప్రజలు జిల్లా కేంద్రాలకు లేదా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సమస్యలు వినిపించే విధానానికి భిన్నంగా, ప్రభుత్వ యంత్రాంగమే గ్రామాలకు చేరుకుని సమస్యలను నేరుగా స్వీకరించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. అడవులు, గిరిజన తండాలు అధికంగా ఉన్న ఏజెన్సీ ప్రాంత ప్రజలు కార్యాలయాలకు పలుమార్లు వెళ్లాల్సిన ఇబ్బందులను ఈ కార్యక్రమం గణనీయంగా తగ్గించింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాలు, సంక్షేమ శాఖలు ఇతర అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి వినతిపై ప్రత్యేక చర్యలు చేపట్టాయి.ప్రజాదర్బార్‌లో స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక నమోదు వ్యవస్థ ఏర్పాటు చేసి, దరఖాస్తుదారులకు వాటి పరిష్కార స్థితిని నిరంతరం తెలియజేసే విధంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. న్యాయబద్ధమైన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తూ,ఇతర పెండింగ్ అంశాలపై నిరంతర ఫాలోఅప్ కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు, కొత్త రేషన్ కార్డులు, నూతన పెన్షన్ల కోసం వచ్చిన వినతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తున్నారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం తీసుకొచ్చే దిశగా ఈ ప్రత్యేక ప్రజాదర్బార్ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోంది.

ప్రత్యేక ప్రజాదర్బార్ కార్యక్రమం కేవలం సమస్యల స్వీకరణకే పరిమితం కాకుండా, ప్రజల జీవనోపాధికి ప్రత్యక్ష పరిష్కారాలు అందించే వేదికగా కూడా నిలిచింది. ములుగు మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన మహిళలు, మంగపేట మండలానికి చెందిన మహిళలు తమకు సరైన ఉపాధి అవకాశాలు లేక కుటుంబ పోషణ కష్టంగా మారిందని, జీవనోపాధి కల్పించాలని మంత్రి సీతక్కకు ప్రజాదర్బార్‌లో వినతిపత్రాలు సమర్పించారు.ఈ వినతిపై వెంటనే స్పందించిన మంత్రి సీతక్క, రోటరీ క్లబ్ అనే స్వచ్ఛంద సంస్థతో సమన్వయం చేసి కేవలం 48 గంటల వ్యవధిలోనే మంగపేట మండలానికి చెందిన 10 మంది మహిళలకు, ములుగు మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన 15 మంది మహిళలకు మొత్తం 25 ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. అర్జీ స్వీకరణ నుంచి పరిష్కారం వరకు అత్యంత వేగంగా స్పందించి సహాయం అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది.ప్రస్తుతం ఆ మహిళలు కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందుతూ తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. శాఖల మధ్య సమన్వయం పెరిగి, సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలు వెలుగులోకి వచ్చి పరిష్కార దిశగా అడుగులు పడ్డాయి.ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ప్రారంభమైన ఈ ప్రజాకేంద్రీకృత పరిపాలన విధానం ప్రస్తుతం రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తూ, ప్రజా పాలనలో కొత్త ప్రమాణాలను సృష్టించింది. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లి, సమస్యల పరిష్కారంతో పాటు జీవనోపాధి అవకాశాలు కల్పించిన ఈ ప్రత్యేక ప్రజాదర్బార్ కార్యక్రమం "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" విజయవంతమైన అమలుకు ములుగు జిల్లా నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది.

# చోరీకి వచ్చిన దొంగకు దేహశుద్ధి!

- స్థానిక పోలీసులకు అప్పగించిన నెంబర్ వన్ కాలనీవాసులు



**చెన్నారావుపేట, జూలై 5 (జనంసాక్షి) :** దొంగతనం చేయడానికి వచ్చిన దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసిన సంఘటన చెన్నారావుపేట మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కాలనీవాసుల కథనం ప్రకారం.... ఇదే కాలానికి చెందిన బొక్కల బుజ్జమ్మ శనివారం రాత్రి తన ఇంటికి తాళం వేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నైట్ వాచ్ మెన్ గా విధులను నిర్వర్తించడానికి వెళ్ళింది. ఇదే కాలానికి చెందిన సాధు రాజు అనే వ్యక్తి బుజ్జమ్మ ఇంటి తలుపులను తొలగించి లోనికి చొరబడ్డాడు. ఆ ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడంతో పక్కనే ఉన్న మట్టెవాడ మస్తాన్ ఇంట్లోకి చొరబడేందుకు తాళం పగులగొట్టడానికి ప్రయత్ని స్తుండగా శబ్దం రావడంతో తన ఇంటి పక్కన ఉన్నవారు గమనిం చి కేకలు వేయడంతో దొంగ పారిపోతుండగా కాలనీవాసులు వెంబడించి అతన్ని పట్టుకున్నారు. పట్టుకొని దేహశుద్ధి చేసి చెట్టుకు కట్టేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సాధు రాజును పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లారు. సాదు రాజు ఇదే కాలనీలో గత కొద్దిరోజుల క్రితం మాదాసి కుమార్ కు చెందిన కిరాణం షాపులో రెండుసార్లు దొంగతనం చేశాడు. అప్పుడు కూడా అతన్ని పట్టుకొని కాలనీవాసులు దేహ శుద్ధి చేసి చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు. మళ్లీ శనివారం రాత్రి దొంగతనం చేసేం దుకు రాగా కాలనీవాసులు మళ్లీ పట్టుకొని దేహశుద్ధి చేసి చెట్టుకు కట్టేయడం ఇది రెండవసారి అని కాలనీవాసులు తెలిపారు. సాదు రాజు చెన్నారావుపేట, నంబర్ వన్ కాలనీలో అనేక దొంగతనాలకు పాల్పడ్డాడని అతను కాలనీలో రాత్రి వేళలో తిరుగుతుంటే భయమేస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అతనిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని నెంబర్ వన్ కాలనీవాసులు కోరుతున్నారు.

# రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌ను కలిసిన కలెక్టర్

**కాజీపేట, జూలై 5 (జనం సాక్షి) :** కాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లను పరిశీలించేందుకు వచ్చిన రైల్వే బోర్డు చైర్మన్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీష్ కుమార్‌ను ఆదివారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి జిల్లా యంత్రాంగం తరఫున ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం కాజీపేట ప్రాంతంలో కొనసాగుతున్న రైల్వే అభివృద్ధి కార్యక్రమాలు, రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ల ప్రగతి, మౌలిక వసతుల విస్తరణకు సంబంధించిన అంశాలపై సంక్షిప్తంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆర్డీఓ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# పని చేయమన్నందుకు ప్రాణం తీసుకుంది

- తల్లి మందలించడంతో బాలిక ఆత్మహత్య



**సిరికొండ జులై 05 (జనంసాక్షి) :** పని చేయాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సిరికొండ మండలం వాయిపేట్ గ్రామంలో విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పేందుర్ శోభాబాయి భర్త భగవంత్‌రావు నాలుగేళ్ల క్రితమే మృతి చెందాడు. దీంతో ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెల కుటుంబ బాధ్యతలు ఆమెపై పడ్డాయి. పెద్ద కుమార్తె వివాహం కోసం చేసిన అప్పులతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణకు తోడ్పడాలని తల్లి చిన్న కుమార్తె పేందుర్ మంజుల (17)ను మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన మంజుల జూలై 3న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు సిరికొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వ్యక్తి ఆత్మహత్య

**నూగూర్ వెంకటాపురం జూలై 5(జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లో పురుగు మందు సేవించి మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం కంతి నాగయ్య అనే వ్యక్తి తల్లి అనారోగ్యం తో మృతి చెందగా, తన పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కంతి నాగయ్య తన తల్లి, పెద్ద కుమారుడు మరణించినప్పటి నుండి మద్యానికి బానిసై మానసిక ఆందోళన లో ఉండే వాడు. మృతుడు మద్యం మత్తులో పురుగుల మందు సేవించాడు.

# కాళేశ్వరం వైఫల్యంపై కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- తలకిందులుగా తపస్సు చేసిన మరో 10 ఏళ్లు ప్రజలు మిమ్మల్ని నమ్మరు
- ప్రజాధనాన్ని వృథా చేసిన బాధ్యత నుంచి బిఆర్ఎస్ నేతలు తప్పించుకోలేరు



**హనుమకొండ, జూలై 6 (జనం సాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తీరుపై వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు . కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, ప్రాజెక్టు వైఫల్యం, రాష్ట్ర ఖజానాపై పడిన భారీ భారం వంటి అంశాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాజీ ముఖ్యమంత్రికి ఉందని పేర్కొన్నారుప్రజల సొమ్ముతో నిర్మించిన అతిపెద్ద ప్రాజెక్టు విషయంలో జరిగిన తప్పిదాలపై కనీస పశ్చాత్తాపం కూడా లేకుండా వ్యవహరించడం బాధా కరమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, అమలు, నిర్వహణలో చోటుచే సుకున్న లోపాలకు బాధ్యత వహిస్తూ ముందుగా తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రాజెక్టును సందర్శించడం ద్వారా ప్రజలు జరిగిన నష్టాన్ని మర్చిపోతారని భావించడం అవాస్తవమన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని, ఆ ప్రభావాన్ని తెలంగాణ ప్రజలు ఇప్పటికీ అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. అప్పుల భారం, ఆర్థిక అవ్యవస్థ, అభివృద్ధి పేరుతో జరిగిన వ్యయ విధానాల కారణంగా రాష్ట్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములమని చెప్పు కునే నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్ పాలనకు ప్రజాస్వామ్య పద్ధతిలో స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ఆ తీర్పు వెనుక ఉన్న కారణాలను ఆ పార్టీ నాయకత్వం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని సూచించారు.తెలంగాణ ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలను మరోసారి భావోద్వేగాలతో లేదా ప్రచారంతో మభ్యపెట్టే ప్రయత్నాలు విజయవంతం కావని, తెలంగాణ ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకునే స్థాయిలో ఉన్నారని అన్నారు.

# నార్కోటిక్ జాగిలం 'రోమా' సహాయంతో గంజాయి స్వాధీనం

- ఆదిలాబాద్ పట్టణంలో 39 గ్రాముల గంజాయి పట్టివేత
- నిందితుడు గోడెం ఆకాశ్‌పై కేసు నమోదు
- మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీసుల ప్రత్యేక చర్యలు



**మావల జూలై 6 (జనం సాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా, గంజాయి రహిత జిల్లాగా నిర్మించేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈరోజు ఆదిలాబాద్ పట్టణంలోని రాశీ నగర్ ప్రాంతంలో సిసిఎస్ బృందం మరియు నార్కోటిక్ జాగిలం "రోమా" సహాయంతో అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా జాగిలం రోమా వాసన ద్వారా అనుమానాస్పద ప్రదేశాన్ని గుర్తించగా, నిందితుడు గోడెం ఆకాశ్ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 13 ప్యాకెట్లలో సుమారు 39 గ్రాముల గంజాయి లభ్యమవడంతో వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై గంజాయి కేసు నమోదు నమోదు చేయడం జరిగింది. యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్-100 లేదా 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
06 జూలై 2026

## ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఓటరు సహకరించాలి

**రాజేంద్రనగర్, జూలై 5 (జనంసాక్షి) :** ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్‌లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అవగాహన కార్యక్రమం, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటింటికీ పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను చాలామంది తప్పుగా నింపుతున్నారని, దీంతో అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ప్రజలకు సరైన అవగాహన కల్పించి ఫారాల నింపే ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని కోరారు. అలాగే కొంతమంది బీఎల్ఓలు విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని, ఫోన్లు ఎత్తకపోవడం, పత్రాల పరిశీలనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి బీఎల్ఓలకు తగిన సూచనలు చేయడంతో పాటు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న వారిని వెంటనే బదిలీ చేయాలని వెంకటేష్ డిమాండ్ చేశారు.



# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత

**కరీంనగర్ బ్యూరో, జూలై 5 (జనంసాక్షి) :** రైతు సంక్షేమే ప్రజా ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యతగా, వ్యవసాయాన్ని పండుగలా మార్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని, అన్నదాతలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడతల వారీగా విడుదల చేస్తూ, ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ తెలిపారు. 2026 జులై 4 నాటికి 67.44 లక్షల మంది రైతులకు 1.18 కోట్ల ఎకరాలకు రూ. 7,135.77 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం రోజు కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ బొమ్మకల్‌లో, కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతన్నలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కార్పొరేటర్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ... రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, రైతు భరోసా ద్వారా లక్షలాది రైతులకు అండగా నిలుస్తోందని అన్నారు. ఈ దేశంలో రైతుల పక్షాన నిలబడి రైతులకు ఏదైనా సంక్షేమం చేసిందంటే అది కాంగ్రెస్ పార్టీయే అని దేశవ్యాప్తంగా గత యుపిఏ ప్రభుత్వంలో రైతులకు ఏకాలంలో రుణమాఫీ చేసింది కాంగ్రెస్సే పార్టీయే, నేడు అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ఏకాలంలో 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేయడంతో పాటు, రైతులకు ఉచిత కరెంటు, సన్న వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ వంటి అనేక కార్యక్రమాలతో రైతులకు అండగా నిలుస్తోందని, రైతు ప్రభుత్వాన్ని, రేవంత్ అన్న నాయకత్వాన్ని మరొక్కసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కె. రాంరెడ్డి, సాయిని తిరుపతి, బొమ్మకల్లు జరిగిన కార్యక్రమంలో కపిల్ మాధవ్, గట్టు ప్రశాంత్, బి.



ఆంజనేయులు, ఇమ్రాన్, పెంట శేఖర్ వసీం ఫాహాద్, ఇమ్రాన్ గాని, చామనపల్లి గ్రామ రైతు వేదిక లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఐలన్న, సర్పంచ్ తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫకీర్‌పేట్, సర్పంచ్ లక్ష్మణ్ నారాయణ, సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీకాంత్, గ్రామ శాఖ అధ్యక్షుడు శంకరయ్య, తిరుపతి గౌడ్, సేవాదళ్ నాయకుడు ముస్తాక్, హైమద్, హరీష్ గౌడ్, శివరాం, మీసాల సాయన్న, కాశిపాక మురళి, బాలకిషన్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీనగర్ కాలనీ అభివృద్ధికి సహకరించండి

- ఎమ్మెల్యేకు వినతి

**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 5 (జనం సాక్షి) :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని పసుమాముల లోని శ్రీనగర్ కాలనీ అభివృద్ధి పనులను వెంటనే చేపట్టి, కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా శ్రీనగర్ కాలనీలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని తెలిపారు. గత ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా కాలనీ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేయడంతో పాటు అవుట్‌లెట్ డ్రైనేజీ నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, పార్కును అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ పనులను అత్యవసరంగా చేపట్టి కాలనీవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



సమస్యలపై సానుకూలంగా స్పందించారు. కాలనీలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారులతో సమీక్షించి, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చైతన్య, జనరల్ సెక్రటరీ యాకూబ్ పాషా, జాయింట్ సెక్రటరీ హెచ్‌డీఎఫ్‌సీ శ్రీనివాస్, కల్చరల్ సెక్రటరీ శ్రీకాంత్ గౌడ్, ట్రెజరర్ అరవింద్, కమిటీ సభ్యులు వెంకటరమణ, రామకృష్ణ, నాగరాజు గౌడ్, కోటేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లో మార్పు మొదలవడం సంతోషదాయకం

- రామగుండం నగర పాలక మేయర్ మహంకాళి స్వామి

**గోదావరిఖని, జూలై 5 (జనంసాక్షి) :** మార్కెట్‌లో మార్పు మొదలవడం సంతోషదాయకమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఆదివారం శివాజీ నగర్ కూరగాయల మార్కెట్ ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ ను పరిశు భ్రంగా , అందంగా ఉంచుకోవాలని వారం రోజుల క్రితం వార్డు సందర్శనలో భాగంగా సూచించిన మేరకు వ్యాపారుల నుండి మంచి స్పందన వచ్చిందని అన్నారు. వేలాడుతున్న తీగలు , పరదాలు తొలగించి రేకులు వేసుకోవడం శుభసూచకమని , త్వరలోనే ప్లాట్ ఫామ్ లు కూడా నిర్మించుకొని అందంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దుకుంటారని ఆశా భావం వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం యాభయ్ మంది పారిశుధ్య సిబ్బంది, జెసిబి యంత్రాల సహాయంతో మార్కెట్ ను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు వ్యాపారులు చెత్త బయట వేయకుండా సహకరించాలని కోరారు. చెత్త బయట పడవేసిన వారికి జరిమానాలతో పాటు మార్కెట్ గదుల లీజు, లైసెన్స్ కూడా రద్దు చేసి కొత్తవారికి ఇస్తామని అన్నారు. వర్షా కాలం దృష్ట్యా అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్న నేపథ్యంలో మాశీసం వ్యాపారులు ప్రజల ఆరోగ్యానికి భంగం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ విక్రయాలు



జరపాలని అన్నారు. మరో నాలుగు రోజుల్లో 40 అడుగుల వెడల్పుతో మార్కెట్ కు వచ్చే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. అనంతరం , ఇందిరా నగర్ లో , ఎన్ టి పి సి కబ్రస్థాన్ లో , రామగుండం లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ ఎ. ఇ. మీర్, టి పి ఎస్ నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ గోపీ కృష్ణ తదితరులు ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 కేసులు నమోదు



**లింగాల, జూలై 5 (జనం సాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబటిపల్లి--యాపట్ల ప్రధాన రహదారిపై ఆదివారం లింగాల ఎస్ఐ ఎం. చంద్రకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై బ్రెత్ అనలైజర్‌తో పరీక్షలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించిన 8 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వారి వాహనాలను స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం. చంద్రకాంత్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి చర్యలు వాహనదారులతో పాటు అమాయక ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తాయని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మల్దకల్, జూలై 5 (జనంసాక్షి) :** మండలం పరిధిలోని నీలిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. సద్దలోనిపల్లి గ్రామంలోపద్మమ్మ మంజూరు చేశారు. ఎల్కూర్ గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు రాజశేఖర్,గోవిందు ఇల్లు మంజూరుచేశారు. తాటికుంట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు దేవరాజు,రమేష్ లకు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు



చేయడం జరిగింది. ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి తో సాధ్యమైనది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో ఛైర్మెన్ తిమ్మారెడ్డి,మాజీ ఎంపీపీలు రాజారెడ్డి,విజయ్,జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, సర్పంచులు తుమ్ కృష్ణారెడ్డి, వినోద్, మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి,నాయకులు చక్రధర్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్,వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటన్న,భానుప్రకాష్ రెడ్డి,రామకృష్ణ, రాంగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

- మహోత్సవానికి ఆహ్వాన పత్రిక అందజేత

**హయత్‌నగర్, జూలై 5 (జనం సాక్షి) :** మాధవ్ నగర్ కాలనీ మాజీ అధ్యక్షులు గోగిరెడ్డి అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా మాధవ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్‌తో పాటు కాలనీవాసులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మహోత్సవ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరై,విజయవంతం చేయాలని కాలనీవాసులను ఆహ్వానించారు. అయ్యప్పస్వామి ఆశీస్సులతో మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ జాయింట్ సెక్రటరీ ఉయ్యాల యాదయ్య గౌడ్, మేక వెంకట్ రెడ్డి, ఉమా మహేశ్వరరావు, రుసేందర్ ముదిరాజ్ తో పాటు అయ్యప్పస్వామి



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కమిటీ సభ్యులు పాల్గొని మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రికను అందజేశారు.

## బైపాస్ వరద కాల్వ పనులు పూర్తి చేయండి



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 5 (జనం సాక్షి) :** ఖమ్మం నగరంలోని ప్రధానమైన రహదారి బైపాస్ రోడ్ వరద కాల్వ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్ సైడ్ కాలువ పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వై విక్రమ్ మాట్లాడుతూ శ్రీ శ్రీ విగ్రహం నుంచి వస్తున్న వరద నివారణ కోసం ఎన్టీఆర్ విగ్రహం నుంచి బైపాస్ రోడ్ మీదుగా మున్నేరు లో వరద నీళ్ళు కలిసే విధంగా వరద కాల్వ పనులు చేపట్టి రెండు నెలలు పూర్తి అవుతున్నా సగం పనులు కూడా పూర్తి కాలేదు అని ఆరోపించారు. దాదాపు రెండు కోట్లతో నిర్మిస్తున్న కాల్వ పనులు ఇష్టారాజ్యంగా వంకర్లు తిప్పుతున్నారు అని దిని వల్ల ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి అని, సైడ్ వాల్ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తుంది అని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యత పనులపై కమిషనర్ దృష్టి సారించాలి అని డిమాండ్ చేశారు. వర్షాకాలం రావడంతో పనులు వెంటనే పూర్తి చేయకపోతే ట్రాఫిక్ సమస్యతో పాటు, వ్యాపారస్తులకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. ఖమ్మం నగరంలో పలు రహదారులు విస్తరణ పనులు, వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు చాలా నత్తనడకగా నడుస్తున్నాయి అని విమర్శించారు. మంత్రి, కమిషనర్ పెండింగ్ పనులపై దృష్టి సారించి, వాటికి నిధులు కేటాయించి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని వై విక్రమ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంగల తిరుపతిరావు, బోడపట్ల సుదర్శన్, జె వెంకన్న బాబు, జెల్లా ఉపేందర్, భూక్యా ఉపేంద్ర నాయక్, నాగేశ్వరరావు, శెట్టి రవీంద్ర, చిన్న హుస్సేన్, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి



**కుల్కచర్ల, జూలై 5 (జనం సాక్షి) :** రైతుల సంక్షేమం కోసం అంకిత భావంతో పనిచేసి సహకర సంఘాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రముఖ సామాజిక సేవకుడు ఆర్బిఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని బి.భీమ్ రెడ్డి నివాసానికి మర్యాదపూర్వకంగా వెళ్లి నూతనంగా పిఎసిఎస్ ఛైర్మన్‌గా ఎన్నికైన భీమ్ రెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..భీమ్ రెడ్డి నాయకత్వంలో కుల్కచర్ల గ్రూజూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివయ్య, శంకర్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

**బీబీనగర్, జూలై 5 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం సైనో ఫుడ్స్ ఇండియా ఓపీసీ ప్రైవేట్ లిమిటెడ్ రీజనల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా మండల పరిధిలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రోగ్రెసివ్ రైతులు, ప్రకృతి వ్యవసాయ ఆసక్తిగల రైతులకు ప్రకృతి వ్యవసాయం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ జడ్పిటిసి గోళి ప్రణీత పింగళ్ రెడ్డి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఐఆర్డీఏ ఫౌండేషన్ చైర్‌పర్సన్ పొలిమెట్ల వినయ్ కుమార్, జ్యోతి రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జ్యోతి రెడ్డి దుదిపాల రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మరింత ప్రోత్సహించేందుకు జ్యోతి రెడ్డి ఫౌండేషన్ తరఫున రైతులకు వేస్ట్ డీకంపోజర్ బాటిళ్లను ఉచితంగా అందజేశారు. సదస్సులో పాల్గొన్న శాస్త్రి జంధ్యాల ప్రస్తుత వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, రసాయన వ్యవసాయం వల్ల నేల సారంపై పడుతున్న ప్రభావం, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్య పరిరక్షణ, ఉత్పత్తి వ్యయాల తగ్గింపు, రైతుల ఆదాయ వృద్ధి, సురక్షితమైన ఆహార ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం కేవలం ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వ్యవసాయ వ్యవస్థను అందించే జాతీయ ఉద్యమమని శాస్త్రి జంధ్యాల అన్నారు. భవిష్యత్ తరాల కోసం మనం ఫెస్టిసైడ్స్ వాడకం తగ్గించి. సంప్రదాయ వ్యవసాయం చేయడం చాలా ముఖ్యం అని వెల్లడించారు. సదస్సులో పాల్గొన్న సర్పంచులు, రైతులు బీబీనగర్ మండలాన్ని ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రానికే కాకుండా దేశానికే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని సంకల్పం చేస్తూ. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించి, అధిక సంఖ్యలో రైతులను జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పరిధిలోకి తీసుకురావడానికి సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సైనో ఫుడ్స్ ఇండియా ఓపీసీ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వెంకట్




లక్కింశెట్టి , గోలీ జయచంద్రారెడ్డి , బాలు నిరంజన్, బుజ్జమ్మ గోశాల, (రీజినల్ కౌన్సిల్) వ్యవస్థాపకులు మందడి సురేందర్ రెడ్డి, జాతీయ ఆహార భద్రత మిషన్ కేంద్ర, తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త బేతి నరసింహ రెడ్డి, సంస్థ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.




# రూ.29,000 కోట్లతో సరికొత్త ఉడాన్ పథకం

### కొత్త టెర్మినల్‌లో ప్రధాని మోదీ, మంత్రి రామ్మోహన్ నాయుడు

**జోధ్‌పూర్:** దేశంలోని చిన్న పట్టణాలకూ విమాన సర్వీసులు నిర్వహించేందుకు అమలు చేస్తున్న ఉడాన్ పథకం తదుపరి దశను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. రాబోయే పదేళ్లలో సుమారు రూ.29,000 కోట్లు ఈ పథకంపై వెచ్చిస్తారు. ఇప్పటివరకు విమాన సేవలు లేని ప్రాంతాలనూ కొత్త పథకంలో అనుసంధానించనున్నారు. విమాన ప్రయాణాన్ని మరింత మందికి చేరువ చేసేలా మౌలిక వసతులను ఈ పథకం కింద అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. 2016లో ప్రారంభమైన ఉడాన్ పథకం ఇప్పటివరకు 669 మార్గాలను కార్యరూపంలోకి తెచ్చింది. కొత్తగా సవరించిన పథకం కింద, 100 ఏరోడ్రోమ్‌లను రూ.12,000 కోట్లతో అభివృద్ధి చేస్తారు. 200 హెలిప్యాడ్‌లను నిర్మించడం, ప్రాంతీయ విమానయాన సంస్థల కార్యకలాపాల కోసం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కొనసాగించడంతో పాటు చిన్న విమానాశ్రయాల నిర్వహణకూ మద్దతు అందిస్తారు. జోధ్‌పూర్ విమానాశ్రయంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.480 కోట్లతో నిర్మించిన కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించారు. 23,000 చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో ఈ టెర్మినల్‌ను, ఏటా 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా రూపొందించారు.

# లక్ష కోట్ల డాలర్ల ఎగుమతులే లక్ష్యం

### 2026-27పై వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్

### బొమ్మల నాణ్యత నిర్ధారణకు అత్యాధునిక ప్రయోగ శాలలు




దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో లక్ష కోట్ల డాలర్ల (సుమారు రూ.95 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులే లక్ష్యమని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ స్థాయిని చేరుకోవాలంటే వస్తువుల ఎగుమతుల్లో 16-17%, సేవల్లో 11% వృద్ధి సాధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వస్తువుల ఎగుమతుల ద్వారా 530 బిలియన్ డాలర్లు (సుమారు రూ.50.35 లక్షల కోట్లు), సేవల ఎగుమతుల ద్వారా 470 బి.డాలర్ల (సుమారు రూ.44.65 లక్షల కోట్ల) లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ఆయన తెలిపారు. 2025-26లో మన మొత్తం వస్తు-సేవల ఎగుమతులు 870 బిలియన్ డాలర్లు (సుమారు రూ.82.65 లక్షల కోట్లు)గా ఉంది. ఇందులో 442 బి.డాలర్ల (సుమారు రూ.41.99 లక్షల కోట్ల) వస్తువులు ఎగుమతి కాగా, ఈసారి మరో 90 బి.డాలర్ల (సుమారు రూ.8.55 లక్షల కోట్ల) మేర పెరగాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో వస్తువుల ఎగుమతుల్లో 15%, సేవల ఎగుమతుల్లో 11% వృద్ధి నమోదైంది. వివిధ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలను (ఎఫ్‌టీఏ) సద్వినియోగం చేసుకుని, ప్రపంచ బొమ్మల విపణిలో 5% వాటా సాధించే దిశగా దేశీయ కంపెనీలు అడుగులు వేయాలనికేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. పర్యావరణహిత తయారీ పద్ధతులనూ అవలంబించాలని కోరారు. ఇక్కడ 17వ టాయ్ బిజ్ ఇంటర్నేషనల్ బీ2బీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ బొమ్మల తయారీలో నాణ్యత పెంచాలని, అధునాతన పద్ధతులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎగుమతులు 10 రెట్లు పెంచుకోవాలి: బ్రిటన్, ఐరోపా కూటమితో కుదుర్చుకున్న ఎఫ్‌టీఏలు దేశీయ బొమ్మల పరిశ్రమకు భారీగా ఎగుమతి అవకాశాలు కల్పిస్తాయని మంత్రి గోయల్ తెలిపారు. 2024లో 34 కోట్ల డాలర్ల (సుమారు రూ.3,200 కోట్ల) బొమ్మలు ఎగుమతి కాగా, రాబోయే సంవత్సరాల్లో 10 రెట్ల మేర పెంచుకోవాలని సూచించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్), నేషనల్ టెస్ట్ హౌస్, ప్రభుత్వ ఆధ్వర్యంలో బొమ్మల తయారీ క్లస్టర్‌లలో ఆధునిక పరీక్షా సదుపాయాలు ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తేనే, అంతర్జాతీయ బొమ్మల విపణిలో భారత్ తన ఉనికిని గణనీయంగా విస్తరించుకుంటుందని వివరించారు. అంతర్జాతీయంగా బొమ్మల అమ్మకాలు 120 బిలియన్ డాలర్లు (సుమారు రూ.11.50 లక్షల కోట్లు)గా ఉండగా.. ఇందులో భారత్ వాటా కేవలం 0.3 శాతమే. దేశీయ బొమ్మల రంగ విపణి దాదాపు రూ.18,000 కోట్లుగా ఉంది.

## బిగ్ టికెట్‌లో.. భారత గృహిణికి రూ.65 కోట్ల జాక్‌పాట్

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుధాబీలో ప్రతి నెల నిర్వహించే 'బిగ్ టికెట్'లో ఓ భారత మహిళను అదృష్టం వరించింది. దిల్లీకి చెందిన కనికా అరోడా (42) అనే గృహిణికి రూ.65 కోట్ల జాక్‌పాట్ తగిలింది. డ్రాలో గెలుపొందిన విషయం తెలియగానే తొలుత నమ్మశక్యంగా అనిపించలేదని కనికా పేర్కొన్నారు. గత మూడేళ్లుగా తన భర్తతో లక్కీ డ్రాలో పాల్గొంటున్నామని.. ఈసారి మాత్రం తన పేరు మీద టికెట్ కొనుగోలు చేశామని కనికా వెల్లడించారు. వీటి గురించి మొదట్లో సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని, పాల్గొంటున్నామని చెప్పారు. డ్రాలో వచ్చిన డబ్బులో కొంత మొత్తంతో ఓ ఇల్లు కొనుగోలు చేస్తామన్నారు.




# తక్కువ నిర్వహణ వ్యయంతో ఆకర్షణీయం

### విద్యుత్తు,పెట్రోలు స్కూటర్ ఒకే ధరకొచ్చే రోజులొస్తాయ్

**న్యూఢిల్లీ:**ఏథర్ ఎనర్జీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవనీత్ ఎస్ ఫోకెలా పెట్రోలుతో నడిచే స్కూటర్ల ధరకే విద్యుత్ ద్విచక్రవాహనం (ఈవీ) లభించేందుకు ఎంతో సమయం పట్టదని ఏథర్ ఎనర్జీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీఓ) రవనీత్ ఎస్ ఫోకెలా తెలిపారు. ఈ రెండింటికి ధరల అంతరం తగ్గుతుండడం, పెట్రోలు ధర పెరుగుతున్నందున విద్యుత్ స్కూటర్లపై ఆసక్తి అధికమవుతోందని వివరించారు. విద్యుత్తు మోటార్‌సైకిళ్లకు ఆదరణ పెరగడానికి ఇంకా సమయం పట్టొచ్చని అంచనా వేశారు. విద్యుత్తు ద్విచక్ర వాహనాలపై దేశ సగటు కంటే ఆదరణ ఎక్కువగా ఉందన్నారు. వివిధ అంశాలపై ఆయన ఏమన్నారంటే..కొత్త బండి కొనడంలో పెట్రోలు ధరను మాత్రమే వినియోగదారులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. బండి కొనడానికి అయ్యే మొత్తం వ్యయం- పనితీరు, ఇంటర్నెట్-ఫోన్‌కు కనెక్ట్ చేసుకోవచ్చా.. డ్రైవింగ్ అనుభూతి ఎలా ఉందో పరిశీలిస్తున్నారు. పెట్రోలు ధర పెరిగినప్పుడు, విద్యుత్తు వాహనాల (ఈవీ) గురించి విచారణలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. కీలకమైన బ్యాటరీ వ్యయాలు ఇప్పటికే అర్థవంతంగా తగ్గాయి. విడిభాగాలు కూడా స్థానికంగా లభిస్తున్నందున.. ప్రీమియం విద్యుత్ స్కూటర్లు, వాటితో పోల్చదగిన సంప్రదాయ (ఐసీఈ) స్కూటర్ల మధ్య ధర అంతరం తగ్గింది. ఈవీల నిర్వహణ వ్యయం తక్కువ. భవిష్యత్‌లో బ్యాటరీ సాంకేతికత ఇంకా మెరుగుపడి, స్థానికంగా తయారీ పెరిగితే.. రెండు రకాల వాహనాల కొనుగోలు ధరల్లో వ్యత్యాసం ఉండకపోవచ్చు. దేశంలోని పెద్ద



కంపెనీలతో పాటు కొత్త కంపెనీలూ ఇ-స్కూటర్లనే తొలుత అందించాయి. రీసేల్ విలువ, బ్రాండ్‌పై విశ్వాసం, నెట్‌వర్క్‌ను గమనించుకుంటూ వీటిని కొంటున్నారు.
ఇ-మోటార్‌సైకిళ్లను కొత్త సంస్థలే అధికంగా తెస్తున్నాయి. వాటి నెట్‌వర్క్ ఇపుడిపుడే పెరుగుతోంది. సంప్రదాయ స్కూటర్ల కంటే బైక్‌లు ఎక్కువ మైలేజీ ఇవ్వడం వల్లే వాటిని కొంటున్నారు. విద్యుత్తు బైక్‌ల సాంకేతికత మెరుగై, ధరలు తగ్గి, విశ్వాసం పెరిగితే.. మార్కెట్‌ను లీడ్ చేయొచ్చేమో. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పెద్ద నగరాల్లో ఈవీలకు ఆదరణ బాగుంది. దేశ సగటు కంటే ఇక్కడే గిరాకీ బాగుంది. 2025-26లో దేశవ్యాప్తంగా ద్విచక్ర విద్యుత్ వాహనాల వ్యాప్తి 7.8%కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 9.3%, తెలంగాణలో 10.2 శాతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని రెండో అంచె నగరాల్లో ఈవీలకు ఆదరణ ఏడాది వ్యవధిలో 7.5% నుంచి 10.2 శాతానికి పెరిగింది. మూడో అంచె నగరాల్లో 6.2% నుంచి 8.7 శాతానికి చేరింది. తెలంగాణలో పెద్ద నగరాల్లో ఈవీల వాటా 12%, రెండో అంచె నగరాల్లో 11%, చిన్న పట్టణాల్లో 9.2 శాతంగా నమోదైంది. బ్యాటరీ ఎన్ని రోజులు పనిచేస్తుంది, ఛార్జింగ్ చేస్తే చెప్పినంత మైలేజీ వస్తుందా.. దూరప్రాంతాలకు, గ్రామాలకు వెళ్తే ఛార్జింగ్ ఎలా, విడిభాగాలు, సర్వీసింగ్ లభిస్తుందా.. వంటి అనుమానాలు ఉన్నాయి. రెండు, మూడేళ్ల తర్వాత అమ్ముకోవాలంటే, రీసేల్ విలువ ఎంత రావచ్చో ఆలోచిస్తున్నారు. కొనుగోలుదార్లకు ఈ విషయంలో డీలర్లు స్పష్టత ఇస్తే, విశ్వసనీయత పెరుగుతుంది. ఏథర్ కంపెనీ పరంగా ఈ విషయాల్లో సహకరిస్తున్నాం. 2030 కల్లా కొత్త వాహన విక్రయాల్లో 30% ఈవీలే ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. స్కూటర్ విభాగంలో ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. ఆసక్తి చూపడం నుంచి, కొనుగోలు చేసే దిశగా వినియోగదార్ల ధోరణి మారుతుంది. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు, ఛార్జింగ్ వ్యవస్థ, సర్వీసింగ్ మెరుగయ్యే కొద్దీ ఈవీలకు ఆదరణ పెరుగుతుంది.



# మరుగునపడ్డ అసలు యజమానులు!

**వాషింగ్టన్:**యూరోపియన్ వలసదారుల రాకతో సొంత భూములను వీడిన స్థానిక అమెరికన్లు
స్వతంత్ర అమెరికా గత రెండున్నర శతాబ్దాల్లో ఎంతో పురోగమించింది. ఎన్నో విజయాలు సాధించింది. అయితే ఆ విజయాల వెనుక విషాద గాథలూ తక్కువేం కాదు! వాటిలో ప్రధానంగా ప్రస్తావించుకోవాల్సింది- అక్కడి ఆదివాసీల దుస్థితి గురించి. అమెరికాకు అసలు యజమానులైన ఈ స్థానిక (నేటివ్) అమెరికన్లు.. యూరోపియన్ వలసదారుల రాకతో సొంత భూములను వదిలి వెళ్లాల్సి వచ్చింది. అమెరికా ప్రస్తుత జనాభాలో ఐరోపా వలసదారుల సంతానమే ఎక్కువ. వీరిని వైట్ అమెరికన్లు అంటారు. అయితే ఐరోపా వలసదారులు అడుగు పెట్టడానికి వేల ఏళ్ల ముందు నుంచే అమెరికాలో స్థానిక అమెరికన్లు నివసిస్తున్నారు. వీరినే రెడ్ ఇండియన్లు అని కూడా పిలుస్తుంటారు. నేటివ్ అమెరికన్లలో చెరోకీ, నవాహో, సియూ, అపాచీ, జునీ, హ్పపీ వంటి అనేక ఆదివాసీ తెగల ప్రజలు ఉండేవారు. పలు తెగలకు వేర్వేరు భాషలు, సంస్కృతులు, పాలనా వ్యవస్థలు ఉండేవి. వలసదారులు వచ్చాక భూముల కోసం జరిగిన ఘర్షణలు, యుద్ధాలు, ఐరోపా నుంచి ప్రబలిన వ్యాధులు అమెరికాలో లక్షల మంది స్థానిక ఆదివాసీల ప్రాణాలను బలి తీసుకున్నాయి. స్వాతంత్ర్యం వచ్చాక అమెరికా భూభాగం పశ్చిమ దిశగా విస్తరించిన కొద్దీ ఆదివాసీల పరిస్థితి ఇబ్బందికరంగా మారుతూ వచ్చింది. వారు తమ భూములు, అడవులు, వేట ప్రాంతాలను కోల్పోయారు. మిసిసిపీ నదికి తూర్పున నేటివ్ అమెరికన్ల యాజమాన్యంలో ఉన్న సారవంతమైన, అపార వనరులున్న భూములను వైట్ అమెరికన్లు దక్కించుకోవాలని చూడటంతో.. 1830లో అమెరికాలో 'ఇండియన్ రిమూవల్ యాక్ట్' వచ్చింది. ఈ చట్టం సహాయంతో స్థానిక అమెరికన్లను అమెరికాలోని తమ భూముల నుంచి బలవంతంగా ఖాళీ చేయించి.. మిసిసిపీ నదికి పశ్చిమాన ఉన్న భూభాగాలకు తరలించారు. స్థానిక ఆదివాసీల హక్కులను పరిరక్షించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్తూ 1829లో దేశాధ్యక్షుడిగా తన తొలి ప్రసంగం చేసిన ఆండ్రూ జాక్సన్.. ఆపై కొన్ని నెలలకే కాంగ్రెస్‌తో ఇండియన్ రిమూవల్ బిల్లును ఆమోదింపజేయించి చట్టంగా మార్చడం గమనార్హం. 1838లో ఆదివాసీలను ఖాళీ చేయించే తుది గడువు సమీపించినప్పుడు.. వేల మంది ఫెడరల్ సైనికులు, జార్జియా వలంటీర్లు రంగంలోకి దిగారు. చెరోకీలు సహా మరికొన్ని తెగల ప్రజలను బంధించి, దాడులు చేసి తరలించారు. కొన్నిచోట్ల హత్యాకాండకూ పాల్పడ్డారు. నాటి బలవంతపు తరలింపులో వేల మంది నేటివ్ అమెరికన్లు ప్రాణాలు కోల్పోయారు. దీనినే చరిత్రలో 'ట్రయల్ ఆఫ్ టియర్స్'గా పిలుస్తారు. ఆపై మెక్సికో-అమెరికా యుద్ధం (1846-48) సహా పలు ఇతర పరిణామాలతో.. అమెరికా విస్తరణ, రెడ్ ఇండియన్ల భూముల ఆక్రమణ చాలా వేగంగా జరిగిపోయింది.
25% మంది దారిద్ర్య రేఖకు దిగువనే..
ప్రస్తుతం అమెరికా జనాభాలో నేటివ్ అమెరికన్ల వాటా 3% కంటే తక్కువే. వీరు ఇప్పటికీ స్వదేశంలో సామాజిక-ఆర్థిక, చట్ట, సాంస్కృతికపరమైన ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వీరిలో- దాదాపు 22% మంది ప్రభుత్వం తమకు (ఆదివాసీలకు) కేటాయించిన ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. 25% మంది దారిద్ర్య రేఖకు దిగువనే బతుకీడుస్తున్నారు. అమెరికా జాతీయ సగటు కంటే వీరి ఆయుర్దాయం దాదాపు 20 ఏళ్లు తక్కువగా ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నేడు అమెరికా ప్రభుత్వం నేటివ్ అమెరికన్ల హక్కులను గుర్తించినప్పటికీ, వారికి గతంలో జరిగిన అన్యాయంపై చర్చ కొనసాగుతూనే ఉంది. అమెరికాకు అసలు యజమానులైన స్థానిక అమెరికన్లు కాలక్రమంలో మరుగునపడటం దేశ చరిత్రలో ఓ విషాద గాథగా నిలిచిపోయింది.

### ఘనంగా 250వ అగ్రరాజ్య స్వాతంత్ర్య సంబరాలు

వాషింగ్టన్: భరించలేని ఎండలు... రాజకీయ విభజన వాదాల మధ్య... అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం కోట్ల మంది ప్రజలు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం రాత్రి బాణసంచాతో సంబరాలు అంబరాన్నంటగా.. శనివారం మధ్యాహ్నం న్యూయార్క్‌లో యుద్ధ విమానాల విన్యాసాలు, యుద్ధ నౌకల కవాతు ఆకట్టుకుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగాములు హ్యూస్టన్‌లో ప్రపంచకప్ ఫుట్‌బాల్ మ్యాచ్ జరగడానికి ముందు స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ఇచ్చారు. అమెరికాకు కమ్యూనిజంతో అతి పెద్ద ముప్పు పొంచి ఉందని, ప్రపంచ యుద్ధాలకన్నా అది తీవ్ర ప్రమాదకరమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. 'కమ్యూనిజం అనేది అమెరికా స్వేచ్ఛకు ప్రాణాంతక ముప్పు. ఇది దేశానికి అతి పెద్ద ప్రమాదం. మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలు, పెరల్ హార్బర్‌పై దాడి, సెప్టెంబరు 11 దాడులకన్నా ఇది ప్రమాదకరం' అని పేర్కొన్నారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలు శుక్ర, శనివారాల్లో దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. శుక్రవారం సాయంత్రం సౌత్ డకోటాలోని నేషనల్ పార్కులో ఉన్న మౌంట్ రష్‌మోర్ మెమోరియల్ వద్ద జరిగిన కార్యక్రమంలో ట్రంప్ ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవాల కీలక ఘట్టాల సమయంలో గత అధ్యక్షులు చేసిన ప్రసంగాలకు భిన్నంగా ఆయన ప్రసంగం రాజకీయంగా సాగింది. తన సహజ ధోరణిలో ఆయన విరుచుకుపడ్డారు. అది ఈసారి కమ్యూనిస్టులపై కావడం గమనార్హం. మరోవైపు దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సంబరాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాత్రి బాణసంచాతో నగరాలు, పట్టణాలు వెలుగులు విరజిమ్మాయి. రష్‌మోర్‌వద్ద గత అధ్యక్షులకు ట్రంప్ నివాళులర్పించారు. జార్జ్ వాషింగ్టన్, థామస్ జెఫర్సన్, అబ్రహాం లింకన్, రూజ్‌వెల్ట్‌ల సేవలను గుర్తు చేసుకున్నారు. న్యూయార్క్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మేయర్ జోహ్రాన్ మందానీ.. అమెరికాను వైవిధ్య దేశంగా పేర్కొన్నారు. అది తాను ఆకాంక్షించే పరిపూర్ణత దిశగా ప్రతి రోజూ కృషి చేస్తుందని తెలిపారు. వాషింగ్టన్‌లోని గ్రేట్ అమెరికన్ స్టేట్ ఫెయిర్ ప్రాంతంలో వందల మంది గుమికూడి సంబరాలు చేసుకున్నారు. సంబరాల్లో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 40 యుద్ధ నౌకలు న్యూయార్క్ జలాల్లోకి ప్రవేశించాయి. ఇది అమెరికా చరిత్రలోనే అతి పెద్ద సముద్ర, వైమానిక కలయిక అని నిర్వాహకులు తెలిపారు. ఫిలడెల్ఫియాలో



## మాలిలో వేర్పాటువాదుల విజృంభణ

బమాకో: మాలి ఉత్తర ప్రాంతంలోని గావో, సెవారేలతో సహా పలు పట్టణాలపై తిరుగుబాటుదారులు దాడులు చేస్తున్నట్లు శనివారం ఆ దేశ సైన్యం తెలిపింది. అనెఫిస్‌ను స్వాధీనం చేసుకోవడానికి దాడులు చేపట్టామని వేర్పాటువాద గ్రూపు అజావాద్ లిబరేషన్ ఫ్రంట్ (ఎఫ్‌ఎల్‌ఎ) ప్రతినిధి మహమ్మద్ ఎల్మౌలౌద్ రమదాన్ పేర్కొన్నారు. మాలి అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ గ్రూప్‌లతో అనుబంధం ఉన్న తీవ్రవాదుల తిరుగుబాట్లను ఎదుర్కొంటోంది. ఉత్తర మాలిలో స్వతంత్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం కోసం వేర్పాటువాదులు కొన్నేళ్లుగా పోరాడుతున్నారు. మాలితోపాటు పొరుగు దేశాలైన నైజర్, బుర్కినా ఫాసో అల్‌ఖైదా, ఐఎస్ అనుబంధ సంస్థలతో పోరాడుతున్నాయి. ఈ మూడు దేశాల్లో సైనిక తిరుగుబాట్లు జరిగాయి. గతంలో ఈ దేశాలు వేర్పాటువాదులపై పోరుకు ఫ్రాన్స్ తదితర పాశ్చాత్య దేశాల సహాయం తీసుకునేవి. కానీ సైనిక పాలకులు ఇస్లామిక్ తీవ్రవాదులపై పోరాడటానికి రష్యా మద్దతు స్వీకరిస్తున్నారు.



## సోషల్ మీడియా ఆక్టివిస్ట్ రావణ్‌పై 'ఉపా'కేసు

యలమంచిలి కోర్టు నుంచి బెయిల్‌పై విడుదలై హైదరాబాద్ వెళ్తుండగా మార్గంమధ్యలో ఆదివారం తెల్లవారుజామున గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రావణ్‌పై గన్నవరం పోలీసులు 147, 148, 152, 197, 197(1డి), 353(1బి) బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు.. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఉగ్రవాద సంస్థలకు సహకారం, మద్దతు వంటి ఆరోపణలతో ఉపా కేసు నమోదైంది. గన్నవరం పీఎస్‌లో విచారించిన అనంతరం రావణ్‌ను కోర్టులో హాజరుపరిచారు.

## థాంక్యూ భారత్.. కోలుకుంటున్న వెనెజువెలా

కరాకస్(జనంసాక్షి):ఇటీవల సంభవించిన జంట భూకంపాలతో కకావికలమైన వెనెజువెలా ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. మహా ప్రళయం మిగిల్చిన విషాదం నుంచి తేరుకుంటోంది. తమకు ఆపన్న హస్తం అందించిన భారత్‌కు అక్కడి ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు. భారత్ సాయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. జూన్ 24న సంభవించిన జంట భూకంపాలతో వెనెజువెలా చిగురుటాకులా వణికిపోయిన సంగతి తెలిసిందే. దాదాపు 2,900 మందికి పైగా మృత్యువాత పడగా.. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. భూకంప బాధితులకు మానవతా సాయం అందించేందుకు భారత్ 'ఆపరేషన్ అమిస్తాద్' చేపట్టింది. భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామర్థ్యమున్న రెండు మొబైల్ ఆసుపత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలను తీసుకెళ్లి సేవలందించింది. తాజాగా అక్కడి భారత్ ఆర్మీ ఫీల్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఫొటోలు, వీడియోలను విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఘోర ప్రకృతి విపత్తు నుంచి ప్రాణాలతో బయటపడినవారు, వారి కుటుంబ సభ్యులు భారత్ సాయానికి కృతజ్ఞతలు చెబుతున్నారు. కఠిన పరిస్థితుల్లో భారత్ వైద్య సిబ్బంది అద్భుత సేవలు అందించారని కొనియాడుతున్నారు. " భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు. కష్టకాలంలో మమ్మల్ని ఆదుకున్నారు. మీ మేలు మర్చిపోలేం" అంటూ భావోద్వేగానికి గురవుతున్నారు.

## పాక్‌లో ఆత్మాహుతి దాడి.. ముగ్గురు సైనికుల మృతి

క్వెట్టా: పాకిస్థాన్‌లోని గ్వాదర్‌లో సైనికులు, కోస్టుగార్డులపై బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) జరిపిన ఆత్మాహుతి దాడిలో ముగ్గురు మరణించారు. 15 మంది గాయపడ్డారు. వాహనంలో బాంబులను నింపుకొని ఆత్మాహుతి దళ సభ్యుడు పన్వన్ చెక్‌పోస్టుపైకి దూసుకొచ్చాడని పాక్ పోలీసులు శనివారం వెల్లడించారు. మజీద్ బ్రిగేడ్ యూనిట్‌పై ఈ దాడి జరిగిందని, ముగ్గురు సైనికులు మరణించారని తెలిపారు. చైనా, పాకిస్థాన్ ఆర్థిక కారిడార్‌లో గ్వాదర్ పోర్టు అత్యంత కీలకమైనది.

## 2030 కల్లా 10 కోట్ల ఫండ్ మదుపర్లు

### ఏయూఎమ్ రూ.150 లక్షల కోట్లకు

మ్యూచువల్ ఫండ్ మదుపర్ల సంఖ్యను 2030 కల్లా 10 కోట్లకు చేర్చడమే లక్ష్యంగా భారత మ్యూచువల్ ఫండ్‌ల సంఘం యాంఫీ పనిచేస్తోంది. ఫండ్ సంస్థల నిర్వహణలోని ఆస్తుల విలువ ఆ సమయానికి, ప్రస్తుతం కంటే రెట్టింపై రూ.150 లక్షల కోట్లకు చేరుతుందని యాంఫీ సీఈఓ వెంకట్ చలసాని అంచనా వేశారు. ప్రజల్లో ఆర్థిక అంశాలపై అవగాహన పెరుగుతుండడం, చిన్న నగరాల నుంచి మదుపర్ల సంఖ్య విస్తరిస్తుండడం, క్రమానుగత పెట్టుబడి పథకా (సిప్)లకు ఆదరణ కొనసాగుతుండడం ఇందుకు దోహదం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్లో ఊగిసలాటలున్నా, విదేశీ మదుపర్లు (ఎఫ్‌ఐఐ) విక్రయాలు కొనసాగిస్తున్నా, నెలవారీ సిప్‌లు అంతకంతకూ పెరుగుతున్నాయని వెంకట్ గుర్తు చేశారు. దేశీయ మదుపర్ల స్థిరమైన కొనుగోళ్ల వల్లే, అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ మన ఈక్విటీ మార్కెట్లు స్థిరంగా ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలోని అగ్రగామి 30 నగరాలకు దూరంగా ఉన్న 30 నగరాల (బీ30) నుంచి, మార్కెట్లోకి మదుపర్లు వస్తారని యాంఫీ అంచనా వేస్తోంది. అక్కడి మదుపర్లకు చేరువకావడం తమ ప్రాధాన్యతగా వెంకట్ తెలిపారు. మార్కెట్‌లో చిన్నపాటి దిద్దుబాట్లకే సిప్‌లను నిలిపేయకుండా, దీర్ఘకాల పెట్టుబడులను ప్రోత్సహించేలా మదుపర్లకు అవగాహన కల్పించాల్సి ఉందని చలసాని అన్నారు. పాసివ్ పెట్టుబడి ఉత్పత్తులైన ఇండెక్స్ ఫండ్స్, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్)లలో వృద్ధి పుంజుకుంటోందని చెప్పారు. రాబోయే సంవత్సరాల్లో స్ట్రక్చర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటీస్(సిఫ్స్) వంటి కొత్త పెట్టుబడి అవకాశాలపై ఆసక్తి పెరగొచ్చని ఆయన అంచనా వేశారు. మదుపర్ల రక్షణకు హామీనిస్తూనే, నిబంధనల వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీతో యాంఫీ కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
6 జూలై 2026

# వేలాది ప్రజల కళ్ళల్లో వెలుగులు నింపుతున్న ఐక్యత ఫౌండేషన్

- రెండవ రోజు విజయవంతంగా కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరం సేవలు
- వైద్య శిబిరాన్ని సందర్శించిన ఐక్యత పౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓఓ,సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**తలకొండపల్లి జూలై 05(జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత ప్రజలు అంధత్వంతో బాధపడకూడదు అనే లక్ష్యంతో ఖరీదైన కంటి వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రముఖ కంటి వైద్య నిపుణులు శంకర నేత్రాలయ వారి భాగస్వామ్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు.తలకొండపల్లిలో ఐక్యత పౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాది పేద ప్రజల కళ్ళల్లో వెలుగులు నింపేందుకే కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు.వైద్య శిబిరానికివచ్చే ప్రతి ఒక్కరికీ కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ,అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు,కంటి శుక్లాల శస్త్రచికిత్స వంటి సేవలను అందిస్తున్నామని చెప్పారు.ప్రతి నిరుపేదకు మా ఉచిత సేవలు అందించి,వారి ఆరోగ్యానికి ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ఐక్యత ఆరోగ్య భరోసా కార్యక్రమంతో ముందుకు సాగుతున్నామని,ప్రస్తుతం తలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య సేవలను తలకొండపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ నెల 12వ తేదీ(ఆదివారం) వరకు శిబిరం సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఇప్పటి వరకు రెండు రోజుల వ్యవధిలో దాదాపు1,200 మందికిపైగా ప్రజలు శిబిరాన్ని సందర్శించగా,600 మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు,350 మందికి ఉచిత కంటి అద్దాల పంపిణీ చేయగా,46 మంది పేషెంట్లను కంటి శుక్లాల ఆపరేషన్ కి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.ప్రముఖ వైద్య నిపుణులు శంకర నేత్రాలయ చెన్నై వారి సేవలతో కొనసాగుతున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉచిత వైద్య సేవలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్ నాయక్,కళ్యాణ్ నాయక్,ఉప సర్పంచ్‌లు భాస్కర్,దేరంగుల అనిత విజయ్,రమేష్ యాదవ్,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు,ప్రజాప్రతినిధులు,వైద్య బృందం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి బీడు భూములకు సాగునీరు

- లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు వెంటనే ముగించాలి
- జేఏసీ డిమాండ్.. 19న షాద్‌నగర్‌లో విస్తృత రౌండ్ టేబుల్ సమావేశం
- కరపత్రాలు విడుదల.. ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలి



**షాద్‌నగర్, జూలై 4 (జనం సాక్షి):** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి బీడు భూములకు సాగునీరు అందించాలని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కాలువ, పంప్ హౌస్ పనులు త్వరగా చేపట్టాలని పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ డిమాండ్ చేసింది. ఈ నెల 19వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే విస్తృత రౌండ్ టేబుల్ సమావేశానికి షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజా సంఘాల నాయకులు, రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని విస్తృత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను షాద్‌నగర్ పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో గ్రామీణ ప్రాంతాలను వదిలి దూర ప్రాంతాలకు రైతులు వలసలు వెళ్తున్నారని, భవిష్యత్తులో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే నీటి కరువు సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని వెంటనే ప్రభుత్వం స్పందించి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ చైర్మన్ మిద్దెల సత్యనారాయణ, కన్వీనర్ టి.జి. శ్రీనివాస్, జేఏసీ నేతలు అర్జునప్ప, బిజిలి సత్యం, తిరుమలయ్య, గొర్ల రాము, రవికుమార్, మందారం నరసింహులు, శ్రీకాంత్, ఆకాష్ పాల్గొన్నారు.

### బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై

# నిషేధాజ్ఞల కొనసాగింపు

- అనుమతి లేని డ్రోన్లు, డీజే సౌండ్స్‌పై కఠిన చర్యలు
- రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ చట్టం అమలు
- ప్రజల భద్రత, శాంతి కోసం పోలీసుల హెచ్చరిక



**గోదావరిఖని, జూలై 3 (జనం సాక్షి):** సాధారణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు.
బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో వీధులు, రహదారులపై అసభ్యంగా ప్రవర్తించడం, అసభ్య పదజాలంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వల్ల సాధారణ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ నిషేధాజ్ఞలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ నిషేధాజ్ఞలు జూలై 1 నుంచి ఆగస్టు 1 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి వాటి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
డీజే సౌండ్స్, డ్రోన్లపై నిషేధాజ్ఞలు కూడా పొడిగించారు. చిన్నారులు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి అంతరాయం కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నివారించే ఉద్దేశంతో అధిక శబ్దంతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధం విధించారు. ఏదైనా కార్యక్రమం నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. అనుమతి లేకుండా డ్రోన్లను వినియోగించడం కూడా నిషేధితమని, డ్రోన్లను వినియోగించాలనుకునేవారు సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ చట్టం అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. బంద్‌ల పేరుతో వ్యాపార సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ఒత్తిడి చేయడం లేదా బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా విజ్ఞప్తి చేశారు.

# విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

- జూలై 10న రాష్ట్రవ్యాప్త బంద్
- పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి
- కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలి




**బోధన్, జూలై 5 (జనం సాక్షి):** రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. బోధన్ డివిజన్ కేంద్రంలోని పిఆర్టియు భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఏఐపీఎస్యు జిల్లా కార్యదర్శి బోడ అనిల్, పీడీఎస్యు జిల్లా అధ్యక్షులు ఆర్. గౌతమ్ కుమార్ మాట్లాడుతూ ఈ పిలుపు ఇచ్చారు. గత ఆరు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సుమారు రూ.10,500 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉండటంతో లక్షలాది మంది ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ మరియు ఇతర వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు.
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక విద్యాసంస్థల యాజమాన్యాలు అధ్యాపకులకు, సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వాటిని విస్మరించి జి.ఓ. నెం. 7, 8, 9లను తీసుకువచ్చి ప్రజాస్వామ్య హక్కులను అణిచివేసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అదేవిధంగా రాష్ట్రంలోని విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత, పరిశుభ్రత వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన, సమాన విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను విరమించి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు తగిన బడ్జెట్ కేటాయించాలని, పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల చదువులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కావున జూలై 10న నిర్వహించే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, అధ్యాపకులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యావేత్తలు, ప్రజాసంఘాలు మరియు ప్రజలు పూర్తి సహకారం అందించి విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ బోధన్ డివిజన్ ఇంచార్జ్ విశాల్ దేవ్, పీడీఎస్యు జిల్లా కార్యదర్శి అనిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు విశాల్, ఏఐఎఫ్డిఎస్ జిల్లా కన్వీనర్ మోసిన్, పీడీఎస్యు కె.సాయినాథ్, ఇతర సంఘాల నాయకులు జి.కిషోర్, శంకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

### నూతన కమిటీ సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, జులై 5 (జనం సాక్షి) :** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనర సింహ స్వామి కాలనీ సమస్యలు పరిష్కరించాలని లక్ష్మి నరసింహ స్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జె సుధాకర్, అఖిల్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో విద్యుత్, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వాటర్, శానిటేషన్, ఫాగింగ్ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేలను కోరారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచినీరు, డ్రైనేజీ, విద్యుత్ కి సంబందించిన తదితర సమస్య లను పరిష్కరించేందుకే కృషి చేస్తానని అన్నారు. త్వరలో కాలనీ లో పర్యటించి సంబంధిత అధికారులకు సమన్వయం చేసి, వెంటనే సమస్యల పై చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్, కాలనీ ఉపాధ్యక్షులు బి కృష్ణ, సహాయ కార్యదర్శులు మునీర్, మలేష్, ట్రెజరర్ ఎ శ్రీనివాస్, కమిటీ సభ్యులు రాజేష్, శ్రీనివాస్, మాదేశ్, హరీష్, రామస్వామి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యపై అనుమానంతో దారుణ హత్య

- నర్సుగా పనిచేస్తున్న భార్యను హత్య చేసిన భర్త
- పరారీలో నిందితుడు.. తల్లిని కోల్పోయిన చిన్నారి
- కుటుంబ కలహాలు చివరకు ప్రాణాలు బలి




**ఉప్పల్, జూలై 5 (జనం సాక్షి):** భార్య శీలాన్ని అనుమానిస్తూ కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్న భర్త చివరకు ఆమెను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకనగర్ ఆదర్శనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. నర్సుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న మహిళ హత్యకు గురికావడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆదర్శనగర్‌కు చెందిన పి. సురేష్ (41) సఫిల్‌గూడలోని ఓ ప్రైవేట్ సంస్థలో క్యాబ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య పి. జెస్సికా (38) తార్నాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తోంది. 2015లో వీరి వివాహం జరిగింది. దంపతులకు ప్రస్తుతం తొమ్మిదేళ్ల కుమార్తె ఉంది. కుటుంబ జీవితం సాఫీగా సాగుతున్నట్లు కనిపించినప్పటికీ, కొంతకాలంగా భార్యపై అనుమానంతో సురేష్ తరచూ గొడవలకు దిగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. జెస్సికా విధులకు వెళ్లడం, ఆస్పత్రిలో ఉద్యోగం చేయడం వంటి విషయాలపైనా సురేష్ అనుమానాలు పెంచుకున్నాడని, ఇదే అంశంపై తరచూ ఇద్దరి మధ్య వాగ్వాదాలు జరిగేవని మృతురాలి బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.
ఈ నేపథ్యంలో శనివారం మరోసారి భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి లోనైన సురేష్ తన భార్య జెస్సికాపై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.
ఘటన అనంతరం సురేష్ మృతురాలి సోదరికి ఫోన్ చేసి తాను జెస్సికాను హత్య చేసినట్లు చెప్పినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురై వెంటనే ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆలస్యం చేయకుండా ఘటనాస్థలికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు పరారీలో ఉండటంతో అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై ఉప్పల్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# యూ డ్రివో యాప్‌తో నిమిషాల్లోనే..

- క్షణాల్లో కార్ డ్రైవర్‌ను బుక్ చేసుకోవచ్చిలా..
- డ్రైవర్లకూ నెలకు రూ.60వేల వరకు ఆదాయం




**హైదరాబాద్, జూలై 4 (జనంసాక్షి) :** కారు యజమానులకు రెగ్యులర్ కార్ డ్రైవర్ రాలేదనే చింత ఇక అవసరం లేదు. మీ డ్రైవర్ రాకపోయినా, అకస్మాత్తుగా డ్యూటీ మానేసినా ఇక బేఫికర్. టెంపరరీ డ్రైవర్ల కోసమూ వెతకాల్సిన అవసరం లేదు. అలా అన్ని సేవలూ ఇక నుంచి ఒకే యాప్ లో లభిస్తాయి. ఆదివారం నుంచి హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఈ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. జూబ్లీహిల్స్ లో ఈ యాప్ ను ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభమైన యూ డ్రివో యాప్ దేశవ్యాప్తంగా కార్ డ్రైవర్ హైరింగ్ సేవలను వేగంగా విస్తరిస్తోంది. ప్రముఖ సామాజిక సేవకులు మేరుగు అశోక్ సారథ్యంలో, తుప్పరి సుహాసిని మేనేజింగ్ డైరెక్టర్‌గా, కొక్కరకొండ మౌనిక డైరెక్టర్‌గా, కొక్కరకొండ సుధాకర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా నాయకత్వం వహిస్తున్న ఈ యూ డ్రివో యాప్ ద్వారా వినియోగదారులు కేవలం నిమిషాల వ్యవధిలోనే వెరిఫైడ్ ప్రొఫెషనల్ కార్ డ్రైవర్లను బుక్ చేసుకునే అవకాశం ఉంది. వినియోగదారులు బుక్ చేసుకునే డ్రైవర్ ఎంత సమయం సేవలు అందిస్తే, అంత సమయానికే వేతనం చెల్లించేలా గల పారదర్శక ధరల విధానాన్ని యూ డ్రివో అమలు చేస్తోంది. గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ లో అందుబాటులో ఉన్న ఈ యాప్ లో ఇప్పటి వరకు 25వేల మందికి పైగా కార్ డ్రైవర్లు వారి పేర్లను ఈ యాప్‌లో నమోదు చేసుకోవడం గమనార్హం. 5,500మందికి పైగా వెరిఫైడ్ డ్రైవర్లతో దేశంలోని ప్రధాన నగరాల్లో విజయవంతంగా వినియోగదారులకు ఈ సంస్థ సేవలను అందిస్తోంది. అసంఘటితంగా ఉన్న కార్ డ్రైవర్ నియామక రంగాన్ని సాంకేతికతతో సంఘటిత రంగంగా మార్చడంతో పాటు, డ్రైవర్లు గౌరవప్రదమైన, స్థిరమైన ఆదాయాన్ని సంపాదించేలా చేయడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ క్రమంలో రాబోయే ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 1 లక్ష మంది ప్రొఫెషనల్ కార్ డ్రైవర్లను ఈ ప్లాట్‌ఫాంలో ఆన్‌బోర్డ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వారు వెల్లడించారు. యూ డ్రివో ద్వారా కార్ డ్రైవర్‌గా పనిచేసే వారు డిమాండ్, పని గంటలు, సేవల లభ్యతను బట్టి నెలకు రూ.60వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# మల్లాపూర్‌లో 'జై భీమ్' సీన్ రిపీట్

### దళితుడిపై థర్డ్ డిగ్రీ..!?

**మల్లాపూర్, జూలై 05 (జనంసాక్షి) :** న్యాయాన్ని కాపాడాల్సిన రక్షకుడే భక్షకుడిగా మారితే.? చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సామాన్యులపై విరుచుకుపడితే.? సరిగ్గా ఇలాంటి ఘటనే జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. జై భీమ్ సినిమాను తలపించేలా దళిత యువకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన మల్లాపూర్ ఎస్సై ఏ. అనిల్ వ్యవహారం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. 'జై భీమ్' సినిమాలో పోలీసులు అణగారిన వర్గాలపై చూపించిన అమానుషాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోందని స్థానిక దళిత సంఘాల నాయకులు మండిపడుతున్నారు. నమ్మకమైన సమాచారం ప్రకారం.. మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక చిన్న వివాదానికి సంబంధించి దళిత యువకులను విచారణ పేరిట స్టేషన్‌కు పిలిపించారు. అయితే, విచారించాల్సిన ఎస్సై అనిల్, చట్ట పరిధులను దాటి బాధితులపై విచక్షణారహితంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. యువకులను తీవ్రంగా కొట్టడమే కాకుండా, కులం పేరుతో దూషించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. దళిత సంఘాల నాయకులు ఈ విషయమై స్థానిక మెట్ పల్లి డీఎస్పీ రాములుని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితులను వేధించి, కులం పేరుతో దూషించిన మల్లాపూర్ ఎస్సై ఏ. అనిల్‌పై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఎస్సైని తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోలీసుల నుంచి బాధితులకు ఎలాంటి ప్రాణహాని లేకుండా తగిన రక్షణ కల్పించాలని వారు కోరారు.




# ఉత్తుత్తి నోటీసులు.. అక్రమ వసూళ్లు!

### చోద్యం చూస్తున్న అధికారులు

**మల్కాజిగిరి జూలై 5 (జనంసాక్షి) :** మౌలాలి సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నేరెడ్ మెట్ లోని రోహిణి కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా ఒక వ్యక్తి ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నాడని స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్న సెక్షన్ అధికారి సంగీత, న్యాక్ ఇంజనీర్ ప్రజ్వల్ వెంటనే స్పందించి నిర్మాణాన్ని ఆపివేసి నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల తర్వాత యధావిధిగా నిర్మాణపు పనులు పూర్తి అయ్యి పెయింటింగ్ దశకు చేరుకుందని స్థానికులు మండి పడుతున్నారు. బండ చెరువులోని బఫర్ జోన్ లో జిహెచ్ఎంసి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని గమనించిన అధికారులు నోటీసులు జారీ చేసి పనులు నిలిపివేశారు. రెండు రోజుల తర్వాత యధా విధిగా పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణదారులతో క్రింది స్థాయి సిబ్బంది అంతర్గత ఒప్పందాలు కుదుర్చుకొని త్వరితగతన పనులు పూర్తిచేసుకుని బిల్డింగులకు పెయింటింగ్ వేసుకోవాలని ఉచిత సలహాలు ఇచ్చి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. నేటికీ అవి కొనసాగుతూనే ఉన్నాయి, అక్రమ నిర్మాణాలపై స్థానికులు ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు కేవలం కంటితుడుపుగా ఉత్తుత్తి నోటీసులు ఇస్తూ, లోపాయికారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ కూడా లంచాలకు అలవాటు పడి, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతూ అధికారులు తమ జేబులు నింపుకుంటున్నారు. పత్రికల్లో వార్తలు వచ్చినా, ప్రజావాణిలో లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు స్పందించడం లేదు, ఉన్నతాధికారులు అయినా తక్షణమే స్పందించి మౌలాలి సర్కిల్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆదివరహ స్వామి ఆలయానికి సీసీ రోడ్డు

- రూ.95 లక్షలతో పనులు ప్రారంభం
- మంత్రి శ్రీధర్ బాబు సానుకూల స్పందన
- భక్తుల సౌకర్యార్థం కీలక అభివృద్ధి
- కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ, సర్పంచ్



**మంథని, జూలై 4 (జనం సాక్షి):** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆదివరహ స్వామి దేవాలయం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి సీసీ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈజీఎస్ నిధుల నుంచి రూ.95 లక్షలు మంజూరు చేయించారు.
ఈ పనులను ఆదివారం రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పులి దేవేందర్ రెడ్డి (పీడీఆర్) ప్రారంభించారు. ఆదివరహ దేవస్థానం చైర్మన్ ముస్త్యాల దామోదర్, కమాన్‌పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఆలయ కమిటీ డైరెక్టర్లు కాంట్రాక్టర్‌తో కలిసి పనులను పరిశీలించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఆలయానికి వెళ్లే రహదారి దెబ్బతినడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన సానుకూలంగా స్పందించి రహదారి అభివృద్ధి కోసం రూ.95 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు మంత్రి శ్రీధర్ బాబుకు దేవస్థానం పాలకవర్గం, గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ రహదారి నిర్మాణం పూర్తయిన అనంతరం ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించబడటంతో పాటు దేవస్థానం అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి కొనసాగుతుందని ఆలయ చైర్మన్ దామోదర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్, దేవస్థానం డైరెక్టర్లు తీగల రాజయ్య, బూస శ్రీనివాస్ గౌడ్, చాట్ల రాయమల్లు, కుందారపు శంకర్, కొంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చేవెళ్లలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన అభివృద్ధి పనులకు శ్రీకారం

**చేవెళ్ల, జూలై 05 (జనంసాక్షి)**
నేడు చేవెళ్లలో నిర్వహించనున్న అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో శంకర్‌పల్లి చౌరస్తా జంక్షన్ అభివృద్ధికి రూ.2 కోట్లతో శంకుస్థాపన, 18వ వార్డులో రూ.24 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభోత్సవం, పామేన గేటు నుంచి గ్రామం వరకు బీటీ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగనున్నట్లు తెలిపారు. స్థానిక కౌన్సిలర్ దావల్ గోపాల్ రెడ్డి సొంత నిధులతో చేపడుతున్న ఈ రహదారి అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు.



- చారిత్రాత్మక ప్రాజెక్ట్ పై ఎందుకింత నిర్లక్ష్యం
- ప్యాకేజీలు సరే.. ఫలితాలేవి
- కనీసం పూడిక తీత కూడా లేదు..! కాలువల పట్ల పట్టింపు లేదు

# నిర్లక్ష్యం అంచుల్లో నర్మాల ఎగువ మానేరు

## లక్ష్యం పెద్దది.. ఆచరణ చిన్నది.

**గంభీరావుపేట జూలై 02 ( జనం సాక్షి);**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొట్టమొదటి సాగునీటి వనరు ఎగువ మానేరు (నర్మల ప్రాజెక్ట్). రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లో కూడెల్లి పాల్వంచ మానేరు వాగులు కలిసే చోట నిర్మించబడ్డ మొట్టమొదటి చారిత్రాత్మక ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్టు ఎంతో ప్రాధాన్యత ఉంది. స్వాతంత్రానికి పూర్వం హైదరాబాద్ సంస్థానం పరిధిలో నిజాం ఏలుబడిలో 1945 మొదలైన ప్రాజెక్టు పనులు దేశానికి స్వాతంత్ర్యం వచ్చి హైదరాబాద్ సంస్థానం భారత రిపబ్లిక్ లో విలీనం అయిన క్రమంలో 1950లో ప్రాజెక్ట్ పూర్తయింది. వర్షాధారం పైనే మొదట్లో ప్రాజెక్టు ఆధారపడి ఉండేది.

సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలోని ముస్తాబాద్ ఎల్లారెడ్డిపేట్ గంభీరావుపేట్ మండలాల పరిధిలోని 16 గ్రామాల రైతులకు 13, 086 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో కాలువల నిర్మాణం జరిగింది. ఏండ్లు గడుస్తున్నా కనీసం డ్యాములో ఒక్కసారి కూడా పూడికతీత జరగకపోవడంతో నిర్దేశించుకున్న నీటి నిలువల లక్ష్యం నీరు కారుతున్న పరిస్థితి. నీటి వనరులు అన్నదాతలకు అందుబాటులో లేకుండా పోతున్న పరిస్థితి.నర్మల డ్యామును నమ్ముకున్న అన్నదాతల ఆశలు ఆవిరవుతున్న పరిస్థితి కొనసాగుతోంది.

### కొత్త ఆశలు. ఫలితం ఇవ్వని ప్యాకేజీలు..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలోని రైతుల్లో ఎన్నో ఆశలు పెరిగాయి. మరోవైపు ప్రభుత్వాలు ప్యాకేజీల పేరుతో అన్నదాతల్లో ఆశలు కల్పించాయి. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ మూడు ప్యాకేజీ 9 నుంచి మిడ్ మానేరు ద్వారా లింకు మూడు ప్యాకేజీ 9 ద్వారా డ్యామ్ సామర్థ్యం 6 టీఎంసీలకు పెంచి 86 వేల 160 ఎకరాలకు సాగునీరు అందిస్తామని పాలకులు చెబుతూ వచ్చారు. మల్కాపేట్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా 120 రోజుల్లో నీటిని తరలించేందుకు అధికారులు అప్పట్లో అంచనాలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు అంచనా కోసం మొదట్లో 911. 32 కోట్లు కాగా సవరించిన అంచనా పరిపాలన అనుమతి ప్రకారం 996. 01 కోట్లు, 12 .035 కిలోమీటర్ల పొడవైన టన్నెల్. అప్పట్లో 9వ ప్యాకేజీకి సంబంధించి కాంట్రాక్టర్ పార్లమెంటులో సమర్పించిన నివేదిక ప్రకారం 34 వేల 874 హెక్టార్లు (86 వేల 150 ఎకరాలు సాగునీటిని స్థిరీకరించడం లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలిపారు. 2022లో జల నియంత్రణ మండలి, కాగ్ నివేదిక తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరలేదని స్పష్టం చేసింది.

### కొత్తది చేతికి రాదు - పాతది అడ్రస్ లేదు

ప్రస్తుతం సిరిసిల్ల నియోజకవర్గం లోని రైతుల పరిస్థితి అగమ్య గోచరంగ ఉంది. కొత్తగా అంచనాలతో రూపొందించిన ప్రాజెక్టు అన్నదాతలకు అందుబాటులోకి రాదు ,పోనీ పాతదైన చేతికొస్తుందా అనుకుంటే అది లేదు. పాత అంచనాల ప్రకారం వర్షాలు బాగుంటే 2.17 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో ఆ కాస్త నీటి సామర్థ్యం కూడా భారీగా తగ్గిపోయింది పరిస్థితి. ప్రాజెక్టు సంబంధించిన కాలువలు ప్రస్తుతం ఆనవాలు కోల్పోయే దశలో పిచ్చి మొక్కలతో అన్నదాతలకు అక్కరకు వచ్చే దశలో లేకుండా పోయాయి. ప్రస్తుతం డ్యాం పరిస్థితి దయనీయంగా మారింది. కనీసం మరమ్మతులు లేకపోవడంతో డ్యాం భద్రతపై అనేక సందేహాలు ముసురుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం సిరిసిల్ల నియోజకవర్గంలోని నర్మల డ్యామ్ పరిధిలోని అన్నదాతలు కష్టాలను అర్థం చేసుకొని డ్యాం పూడికతీత పనులు కాలువల మరమ్మత్తుల పనులు పూర్తి చేయడంతో పాటు తొమ్మిదవ ప్యాకేజీ ద్వారా సాగునీటిని అందించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించవలసిన అవసరం ఉంది. రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాటి నిజాం హయాంలో 2.17 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని నేటి పాలకులు 6 టీఎంసీలకు పెంచినట్లు చెబుతున్న ప్రస్తుతానికైతే కనీసం ప్రాజెక్టు పూడికతీత పనులు కాలువలు మరమ్మత్తు పనులు చేసి అన్నదాతల కు చేయూత అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎగువ మానేరు ప్రాజెక్టు పనులు త్వరగా చేపట్టాలి..



మంగలి చంద్రమౌళి.
ఎగువ మానేరు పరిరక్షణ పోరాట సమితి నాయకులు

# రైతు గొంతుక నొక్కేసి ఫార్మా సిటీయా?

- తాటిపర్తి ప్రజా కోర్టులో రైతుల ఆక్రందన!
- భూసేకరణ పేరిట దౌర్జన్యాలు, అక్రమాలు సాగుతున్నాయి
- ప్రజా అభిప్రాయ సేకరణ సభలో బాధితుల వెల్లడి'



**యాచారం,జూలై 05(జనం సాక్షి) :** అభివృద్ధి పేరిట సాగుతున్న ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల భూసేకరణలో రైతులపై జరుగుతున్న దౌర్జన్యాలు, అక్రమాలకు వ్యతిరేకంగా తాటిపర్తి గ్రామంలో రైతాంగం కదలిలా ఉప్పొంగింది. తెలంగాణ ప్రజా జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం తాటిపర్తి గ్రామంలో ఫార్మా సిటీ – ఫ్యూచర్ సిటీ భూసేకరణ సమస్యలపై భారీ 'ప్రజా అభిప్రాయ సేకరణ' సభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని టీపీజేఏసీ కో–కన్వీనర్ కన్నెగంటి రవి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సభకు చుట్టుపక్కల నాలుగు గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన రైతులు, మహిళలు, వ్యవసాయ కూలీలు తమ ఆవేదనను, ఆక్రోశాన్ని జ్యూరీ సభ్యుల సమక్షంలో నాలుగు గ్రామాల బాధితులు తాము ఎదుర్కొంటున్న వేధింపులను జ్యూరీ ముందు కన్నీటి పర్యంతమవుతూ వివరించారు. అధికారులు చట్టాలను అతిక్రమించి, పోలీసు బలగాలతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. తరతరాలుగా నమ్ముకున్న భూములే మాకు జీవనాధారం. మా ప్రాణాలు పోయినా సరే, మా భూములను వదులుకునే ప్రసక్తే లేదు అని రైతులు, కూలీలు ముక్తకంఠంతో తేల్చిచెప్పారు. భూసేకరణ ప్రక్రియలో జరుగుతున్న దౌర్జన్యాలపై ప్రభుత్వం తక్షణమే వెనక్కి తగ్గాలని డిమాండ్ చేశారు. ప్రజా కోర్టుకు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు జ్యూరీ సభ్యులుగా హాజరై, రైతుల వాదనలను క్షుణ్ణంగా విన్నారు. జ్యూరీలో సీనియర్ అడ్వకేట్ వి. రఘునాథ్, మానవ హక్కుల వేదిక జాతీయ కమిటీ సభ్యులు ఎస్. జీవన్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ వి. వసంత లక్ష్మి, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాత సురేపల్లి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్, రిటైర్డ్ తాసిల్దార్ వి. బాలరాజ్ లు ఉన్నారు.ఈ సందర్భంగా జ్యూరీ సభ్యులు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి సేకరించిన ప్రతి అక్రమాన్ని, దౌర్జన్యాన్ని తాము సమగ్రమైన రిపోర్టుగా తయారు చేస్తామని ప్రకటించారు. ఈ ప్రజా నివేదికను ప్రభుత్వానికి పంపించడంతో పాటు, బాధితుల గొంతుకను పాలకులకు వినపడేలా బయటి ప్రపంచంలో పెద్ద ఎత్తున వినిపిస్తామని రైతులకు నమ్మకమైన మాట ఇచ్చారు. చట్ట వ్యతిరేక భూసేకరణను సహించేది లేదన్నారు.బాధితులకు అండగా నిలిచిన సర్పంచులు, నేతలుఈ నిరసన సభలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతులకు మద్దతు ప్రకటించారు. పాల్గొన్న వారిలో నాలుగు గ్రామాల సర్పంచులు నీలం శ్రీవిద్య, నీలం ఝాన్సీ, సంగం చైతన్యలు ఉన్నారు. అలాగే ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు కానేమోని గణేష్, సందీప్, కొండల్ రెడ్డి, సమ నిరంజన్, అచ్చి రెడ్డి, కుందారపు నారాయణ, చెన్నయ్య, దేవోజీ, వినోద్ రెడ్డి, సోమయ్య, అనంత్ రెడ్డిలతో పాటు వందలాది మంది రైతులు, మహిళా కూలీలు తరలివచ్చి సభను విజయవంతం చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి వీడే వరకు పోరాటం ఆపేది లేదని కమిటీ నేతలు స్పష్టం చేశారు.

# గోదావరి పుష్కరాలు కనివిని ఎరుగని రీతిలో నిర్వహిస్తాం

- ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- ధర్మపురి నుంచి భద్రాచలం వరకు కొత్త శోభ
- కోటిలింగాల స్వామి ఆలయానికి రూ.10 కోట్లు
- పుష్కరాలకు ముందే ఘనమైన ఏర్పాట్లు

**వెల్గటూర్, జూలై 5 (జనం సాక్షి):** గోదావరి పుష్కరాలను దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పుష్కరాలకు ముందే గోదావరి తీరంలోని ఆలయాలను కొత్త శోభతో తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఆదివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలోని పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోదావరి పుష్కరాలకు ఏడాది ముందుగానే ఏర్పాట్లు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు.

ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి నిధులు కేటాయించడంతో పాటు కోటిలింగాలలోని కోటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ధర్మపురి నియోజకవర్గానికి పుష్కర పనుల కోసం రూ.117 కోట్లు కేటాయించగా, కోటిలింగాలలో పుష్కర ఘాట్ నిర్మాణానికి రూ.8 కోట్లు, కోటిలింగాల నుండి పాసిగాం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు, వెల్గటూర్ నుండి కోటిలింగాల వరకు నాలుగు లైన్ల రహదారి విస్తరణకు రూ.20 కోట్లు కేటాయించారు. కోటిలింగాలతోపాటు రాజక్క పల్లి వద్ద మినీ ట్యాంక్ బండ్ మాదిరిగా నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కోటిలింగాల గ్రామానికి చెందిన మంచి కట్ల మణితేజ ఇటీవల కుక్క కాటుకు గురై మరణించగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. వెల్గటూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన సింగం రాజేశ్వరి – తిరుపతి ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## 2వ డివిజన్ సరస్వతి నగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన


**నగరపాలక సంస్థ మేయర్ కొలగల శ్రీనివాస్**

**కరీంనగర్ అర్బన్, జూలై 05 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రెండో డివిజన్ తీగలగుట్టపల్లి లోని సరస్వతి నగర్, రోడ్ నెం.5లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భాస్కర్ నాయక్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతన్నలు ఆపసోపాలు

- యాప్ వల్ల రైతుల నుంచి వ్యతిరేకత
- యూరియా యాప్ ను ఎత్తివేసి మార్కెట్లో సరిపడా ఎరువులు ఉంచి పాత పద్ధతి ద్వారానే అందించాలి

**మర్పల్లి జూలై 05 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం లో రైతులకు సరిపడా యూరియా నిలువలు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. రైతన్నకు ఆపద వస్తే ఆదుకోవలసిన ప్రభుత్వాలే అతని మెడకు ఉరితాడులా మారుతున్నాయి. వ్యవసాయానికి సులభతరం చేయవలసిన ప్రభుత్వాలు రైతుల జీవితాలను మరింత క్లిష్టంగా చేసే విధంగా యూరియా కోసం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను తీసుకురావడంతో రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. పెరిగిన ధరలతో ఇప్పటికే రైతులపై పెను భారం పడుతుంది. పెట్టుబడి ఖర్చులు, ప్రకృతి వైపరీత్యాలతో అల్లాడుతున్న రైతాంగంపై మరో భారాన్ని మోపినట్లు అవుతుంది. యూరియా పంపిణీకి యాప్ ను అనుసంధానం చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలలోని వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరక్షరాసులు, వృద్ధ రైతులు స్మార్ట్ఫోన్లు లేక రైతులు వివిధ రకాలతో పూర్తిగా ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెబుతున్న కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని అంటున్నారు. యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేయాలంటే మూడు దశల్లో బుకింగ్ ప్రక్రియను పూర్తి చేయవలసి వస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం తెలియక రైతులకు మాత్రం పెద్ద తలనొప్పిగా మారింది. అంతేకాకుండా ఎకరానికి రెండు బస్తాలే కేటాయించడం వల్ల కూడా రైతుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేయాలంటే రైతు పట్టా పాసుబుక్కు నెంబరు కు ఆధార్ నెంబర్ ఆధార్కు మొబైల్ నెంబర్ తప్పనిసరిగా లింకు అయ్యి ఉండాలని నిబంధన ఉండడంతో ఈ లింకులు లేకపోతే లేదా వివరాల్లో చిన్నపాటి పొరపాట్లు ఉన్న రైతులు యాప్ లో నమోదు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని దీంతో రైతుల వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరగవలసి వస్తోంది. వ్యవసాయం చేయాలా లేదా స్మార్ట్ ఫోన్ పట్టుకొని యాప్ ల గురించి నేర్చుకోవాలా అనే సందేహం రైతుల్లో వ్యక్తం అవుతుంది. ఒకవైపు సమయానికి వర్షాలు పడక ఆందోళన చెందుతున్న రైతన్నకు సమయానికి సరిపడా యూరియా దొరకక మరింత ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఎరువులు విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో నుంచి రైతులకు సులభంగా చేరే విధంగా అమలు చేయాలని రైతాంగాన్ని నట్టేట ముంచే నిర్ణయాలు కాకుండా వ్యవసాయాన్ని లాభసాటిక మార్చే చర్యలు అవసరమని రైతు బతికితేనే దేశం బతుకుతుంది అన్న సత్యాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ యూరియా యాప్ ను ఎత్తివేయాలంటూ రైతులు రోడెక్కే పరిస్థితికి రాకముందే ప్రభుత్వాలు ఈ విధానాన్ని పున సమీక్షించి యాప్ ను ఉపసంహరించుకోవాలని రైతన్నలు డిమాండ్ చేస్తున్నారు.




# బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సర్కారు లక్ష్యం

- జైనలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి జగిత్యాల జిల్లా జులై04(జనంసాక్షి) :** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన మార్గం దేశానికి ఆదర్శమని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య ద్వారా సాధికారత కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్య, ఉపాధి రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా పేదల కొరకు పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులకు రేషన్ కార్డు ఇవ్వడంతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు సన్న ధాన్యం పండించిన రైతులకు బోనస్ చెల్లిస్తున్నమని తెలిపారు. యువత అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకుని సమాజంలోని అసమానతలను దూరం చేయడానికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల పరిరక్షణలో సామాజిక సంస్థల పాత్ర కీలకం

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**




**కాప్రా, జులై 5 (జనం సాక్షి) :** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ బ్యూరో (ఇండియా) నూతన సభ్యులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన సభ్యులకు అభినందనలు తెలిపారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహ గౌడ్ లు తాము ఇప్పటివరకు చేపట్టిన కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సేవా భావంతో ప్రజలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే సంస్థలు సమాజ చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కె.వి. గీతా సింధు, చిందం మల్లేష్, గడ్డం సాయి కిరణ్, సురేష్ అడ్లూరి, ఎస్. యువరాజ్, డి.రమ్యశ్రీ,, పి వి వి ఎస్ ఎన్ ధనలక్ష్మి, టి విజయలక్ష్మి లకు ఆయన గుర్తింపు కార్డులు, నియామక పత్రాలను అందజేశారు. సభ్యులు నిబద్ధతతో సేవలందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందిస్తూ, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖాన ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బస్తీ దవాఖాన ఎక్స్‌టెన్షన్ భవనం నిర్మాణం కోసం ఏఎస్ రావు నగర్ పరస్పర సహకార సమాఖ్య గ్రూప్ సహకారం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఏఎస్ రావు నగర్ బస్తీ దవాఖాన ఎక్స్‌టెన్షన్ పరస్పర సహకార సమాఖ్య గ్రూప్ ద్వారా 8 లక్ష రూపాయల నిధులతో నిర్మించిన భవనాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పరిశుభ్రమైన పరిసరాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బస్తీ దవాఖానల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం వల్ల పారిశుద్ధ్యం మెరుగుపడి ప్రజల ఆరోగ్యం మరింత రక్షించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ గీత మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి మాజీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి కె. సోమశేఖర రావు జి. వీరయ్య, ఐ. శివశంకరరావు, ఎస్. శంకర రావు ఎ. వెంకటేశ్వర రావు సి. చంద్రశేఖర్ పార్టీ నాయకులు కార్యకర్తలు డాక్టర్స్ పాల్గొన్నారు.

## అల్కాపూర్ లో టౌన్‌షిప్‌లో 'హెర్‌స్పేస్' మహిళా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**రాజేంద్రనగర్,జూలై4(జనంసాక్షి) :** మణికొండ పరిధిలోని నెక్నాంపూర్, అల్కాపూర్ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ' హెర్ స్పేస్ మహిళా ఆరోగ్య కేంద్రాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం, సంతానలేమి సమస్యలకు ఆధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రముఖ గైనకాలజిస్టులు, ఇన్ఫెర్టిలిటీ నిపుణులు డాక్టర్ కె. మాధవీ లత, డాక్టర్ ఉమా మహేశ్వరి కాసిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్, నార్సింగ్ ఏఎంసీ చైర్మన్లు తలారి మల్లేష్ ముదిరాజ్, కోట వేణు గౌడ్,



పిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కె. రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు క్యాతం అశోక్ యాదవ్, బుద్దోలు శ్రీరాములు, ఏర్పుల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక వైద్య పరిజ్ఞానంతో సేవలు అందించాలి

- కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ రమేష్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, జూలై 5 (జనంసాక్షి) :**

ప్రస్తుత వైద్య రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా వైద్యులు నిరంతరం తమ విజ్ఞానాన్ని పెంపొందించు కుంటూ ఆధునిక వైద్య సేవలు అందించాలని కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ రమేష్ రెడ్డి అన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్స్ (ఐఎస్ఏ) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శాస్త్రీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనస్థీషియా వైద్యులు ప్రతి శస్త్రచికిత్స విజయానికి కీలకమని, రోగుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యులు నిరంతర శిక్షణ, శాస్త్రీయ పరిశోధనల ద్వారా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇటువంటి శాస్త్రీయ సదస్సులు వైద్యులకు విజ్ఞానాన్ని విస్తరించడంతో పాటు అనుభవాలను పంచుకునే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.




### నిరంతర శిక్షణతోనే నాణ్యమైన వైద్య సేవలు ..

**ప్రతిమ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ బోయినపల్లి హరిణి.**

ప్రతిమ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ బోయినపల్లి హరిణి మాట్లాడుతూ... ఆధునిక వైద్య సేవల్లో నాణ్యతను పెంచాలంటే వైద్యులు ఎప్పటికప్పుడు కొత్త చికిత్సా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. శాస్త్రీయ సదస్సులు యువ వైద్యుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు క్లినికల్ నైపుణ్యాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణులు ఆధునిక అనస్థీషియా విధానాలు, క్రిటికల్ కేర్, పేషెంట్ సేఫ్టీ, నొప్పి నివారణలో తాజా పద్ధతులు, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన వైద్య విధానాలపై శాస్త్రీయ ప్రసంగాలు నిర్వహించారు.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన అనస్థీషియా వైద్యులు, అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, యువ వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా సదస్సు విజయవంతానికి సహకరించిన ముఖ్య అతిథులు, అధ్యాపకులు, శాస్త్రీయ కమిటీ సభ్యులు, స్పాన్సర్లు, నిర్వాహకులు, వైద్యులు, మీడియా ప్రతినిధులు, వాలంటీర్లు మరియు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎనమల్ల నరేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో వైద్యుల విజ్ఞానాన్ని పెంపొందించే ఇలాంటి శాస్త్రీయ సదస్సులను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ రమేష్ రెడ్డి, ప్రతిమ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ బోయినపల్లి హరిణి, ఐఎస్ఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దేవులపల్లి ప్రదీప్ కుమార్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎనమల్ల నరేష్, శాస్త్రీయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏ. విజయ్ సింగ్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బి. వెంకటేశ్వర్లు, ట్రెజరర్ డాక్టర్ టీ. ఓంప్రసాద్, కరీంనగర్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ టీ. దివ్యం కుమార్, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ నీలేష్ ముద్గల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనస్థీషియా వైద్యులు, అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కొత్తనీటితో గోదావరికి జలకళ

- గోదావరి ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు

**భద్రాచలం జూలై 05 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో పవిత్ర గోదావరి జలకళ సంతరించుకొంది. ఇంత కాలం ఇసుక తిన్నెలతో, తక్కువ నీటితో ఉండేది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో ఆ నీరంతా గోదావరిలోకి చేరుతుండటంతో భద్రాచలం వద్ద గోదావరి ఈ ఏడాది తొలిసారి ఆదివారం కొత్తనీటితో కళకళలాడింది. నిన్నటి వరకు 2.5 అడుగుల వరకు ఉన్న గోదావరి ఆదివారం 4.6 అడుగుల గరిష్ట నీటిమట్టంతో ప్రవహిస్తోంది. గోదావరికి మరింతగా వరద పెరిగితే ఇక వరదల సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే గోదావరి వరదలపై రాష్ట్ర మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించగా, జిల్లా అధికార యంత్రాంగం గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు తగిన కార్యాచరణతో సిద్ధమవుతోంది. వర్షాలు మరింతగా పెరగడంతో పాటు గోదావరి ఎగువన ఉన్న మహారాష్ట్రలో అధిక వర్షపాతం నమోదవుతుండటంతో ఈ నెలలోనే గోదావరికి భారీగా నీరు వచ్చే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# కన్నతల్లిపైనే లైంగిక దాడి

- ఘట్‌కేసర్‌లో దారుణం..

**ఘట్‌కేసర్, జూలై 5 (జనంసాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో దారుణం జరిగింది. మానవత్వం, విచక్షణ కోల్పోయిన ఓ యువకుడు కన్నతల్లిపైనే లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాకు చెందిన ఓ మహిళ(56)కు సుమారు 35 ఏళ్ల కిందట అప్పన్న అనే వ్యక్తితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు పుట్టిన తర్వాత సదరు మహిళ భర్తతో విడిపోయింది. అనంతరం శివరామకృష్ణను రెండో వివాహం చేసుకుంది. కొన్నేళ్ల కాపురం తర్వాత అతన్ని కూడా విడిచిపెట్టింది. జీవనోపాధి కోసం కొంతకాలం కిందట హైదరాబాద్‌కు వచ్చింది. ఘట్‌కేసర్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్ భవనం సెల్లార్‌లో నివసిస్తూ వివిధ ఇళ్లలో పని చేస్తోంది. మొదటి భర్తకు జన్మించిన రెండో కుమారుడు విజయ్ (25) అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు వచ్చేవాడు. గత రెండు నెలల నుంచి ఆమె వద్దే ఉంటున్నాడు. విజయ్ తరచూ మద్యం సేవించి వచ్చి తల్లితో గొడవపడుతూ వేధించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన సాయంత్రం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన విజయ్ మరోసారి తల్లితో గొడవపడ్డాడు. రాత్రిపూట ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా, అడ్డుకుని మెడకు విద్యుత్ తీగను వేసి బెదిరించడంతో పాటు నోటిలో గుడ్డకుక్కి ఊపిరాడకుండా చేసి మరోసారి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# లైంగికదాడుల నివారణలో ప్రభుత్వాలు విఫలం

**చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కో-కన్వీనర్స్ శ్రీదేవి రాధ**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** లైంగికదాడుల నివారణలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కో-కన్వీనర్స్ శ్రీదేవి రాధ అన్నారు. రాజస్థాన్లోని గంగానగర్‌లో 13 సంవత్సరాల అమ్మాయి పై 32 మంది వివిధ హోటల్లో తిప్పుతూ ఐదు రోజులు అత్యాచారం చేయడం హృదయాన్ని కలచి వేసే సంఘటన చోటుచేసుకుందని, మానవత్వం ఉన్న ప్రతి మనిషిని స్పందించే సంఘటన ఇది అని తెలిపారు. అత్యాచారాలు ఈ సమాజంలోని ఎందుకు జరుగుతున్నాయి? వాటి కారణాలను ఎంతోమంది మానసిక విశ్లేషకులు ఒకపక్క చెబుతున్నారని, ఇంకో పక్క మహిళా సంఘాలు ఇవి జరగకుండా ప్రభుత్వం తీసుకుని చర్యలు డిమాండ్ చేస్తూనే ఉందని తెలిపారు. టీవీలలో నిరంతరం క్రైమ్ సినిమాలు, సెన్సార్ లేని సినిమాలు, ఫ్రీ డేటా తో ఫోన్లో చూసే పోర్న్ వెబ్సైట్లు... ఇవన్నీ యువతను చెడు మార్గం వైపు నెడుతున్నాయి. వీటిపై కట్టడి చేయాలని నిషేధించాలని సమాజంలో ఉన్న అన్ని సెక్షన్స్ ప్రజలు ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నా, చెవిటోని ముందు శంఖం ఊదినట్టే అవుతోందని తెలిపారు. చాలా దేశాలలో పోర్న్ సైట్లపై నిషేధం ఉందని, అసలు మైనర్లు ఫోను చూడడానికి చాలా దేశాల్లో అనుమతి లేదు. అందుకే ఆ దేశంలో ఇలాంటివి జరగడం లేదని తెలిపారు. పాఠ్యాంశాల్లో సెక్స్ విద్య లైంగిక విద్య లాంటి సిలబస్ ఉండాలని విద్యావేత్తలు చెబుతూనే ఉన్నారని, పాఠ్యాంశాల్లో కనీస నైతిక విలువలు బోధన కూడా లేదని, ఇటువంటి వాతావరణంలో పెరిగిన పిల్లలు మహిళలు చూసే దృష్టి కోణం ఇలా కాకుండా ఇంకెలా ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పోర్న్ వెబ్‌సైట్లను నిషేధించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలలో సినిమాలపై టీవీలపై నియంత్రణ ఉండాలని, హోటల్ లను బుల్డోజర్లతో కూల్చినంత మాత్రాన ఈ సమస్యకు పరిష్కారం కాదని, సమాజం నేర పూరితం కాకుండా ప్రభుత్వాలు పై చర్యలను వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనర్లపై, మహిళలపై అత్యాచారాలు నివారించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, అందుకే ఇవి రాను రాను ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. అత్యాచారాల కేసుల్లో సరైన నేర నిర్ధారణ జరగడం లేదని అన్నారు. అందుకే ఎంతోమంది శిక్ష నుంచి తప్పించుకుంటున్నారని, మొత్తంగా మహిళలపై జరిగే నేరాలు పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తెలిపారు. ఈ నేరాలను సీరియస్ గా తీసుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే శిక్షలు పడేటట్టు కోర్టులు పోలీసులు ప్రవర్తిస్తే కొంతవరకు వీటిని నివారించగలమని సూచించారు.

# ఆగస్టు నుంచి ఉద్యమకారుల ఓదార్పు యాత్ర

- తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ రవికుమార్

**హనుమకొండ (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో సర్వం కోల్పోయిన ఉద్యమకారులను ఓదార్చడానికి ఆగస్టు నుంచి ఉద్యమకారుల ఓదార్పు యాత్ర చేపడతామని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర ఛైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమళ్ల రవికుమార్ తెలిపారు. ఆదివారం హనుమకొండ కాకతీయకాలనీలోని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర అడ్‌హక్ కమిటీ సభ్యుడు ఓడవపెల్లి శ్యామకృష్ణ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాటి విలీన కాలం నుంచి నిన్నటి వేర్పాటు వరకు ఆరు దశాబ్దాల పాటు వేలాది మంది ఉద్యమకారులు పోరాడి అమరులయ్యారని, మరికొందరు జైలు పాలై కేసులు ఎదుర్కొన్నారని ఆయన గుర్తుచేశారు. ముఖ్యంగా అమరులు కాని, జైలు పాలుకాని, కేసులు ఎదుర్కొనకపోయినా తమ సర్వస్వాన్ని కోల్పోయి రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు వేలాదిమంది ఉన్నారని, తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించి గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో ఉద్యమకారులకు 240 గజాల స్థలం, 25,000 పెన్షన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ, రెండున్నరేళ్లవుతున్నా ఇచ్చిన వాగ్దానం అమలు చేయలేదని మండిపడ్డారు. కేశవరావు కమిటీ ఏర్పాటు స్వాగతించదగ్గదే కానీ కమిటీ పేరుతో కాలయాపన చేస్తే ఈ ప్రభుత్వానికి 5 సంవత్సరాలు కూడా సరిపోవని హెచ్చరించారు.

# హైదరాబాద్ పాలనలో కొత్త అధ్యాయం

## ప్రజాభిప్రాయానికి క్యూర్ బిల్లు-2026

- జీహెచ్ఎంసీ చట్టానికి ప్రత్యామ్నాయంగా సమగ్ర మెట్రో పాలనకు కొత్త ప్రతిపాదనలు
- ఆస్తి పన్ను సంస్కరణల నుంచి డిజిటల్ సేవల వరకు విస్తృత మార్పులు
- ప్రజల సూచనలు కోరిన ప్రభుత్వం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంత పాలనను ఆధునీకరించే లక్ష్యంతో తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు-2026 (క్యూర్ బిల్)ను ప్రజాభిప్రాయం కోసం విడుదల చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న జీహెచ్ఎంసీ చట్టం-1955 స్థానంలో ఈ బిల్లు తీసుకురానున్నారు. 15 లక్షల జనాభా ఉన్న నగరం నుంచి 1.3 కోట్ల జనాభా గల మహానగరంగా హైదరాబాద్ విస్తరించిన నేపథ్యంలో సమగ్ర, సమర్థవంతమైన పాలన అవసరమని ప్రభుత్వం పేర్కొంది. ఈ బిల్లు ద్వారా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లను సమన్వయ పాలనా వ్యవస్థలోకి తీసుకువస్తూనే స్థానిక స్థాయిలో వికేంద్రీకృత పరిపాలన కొనసాగనుంది. కార్పొరేషన్లు, వార్డు కమిటీలు, కమిషనర్లు, ఆస్తి పన్ను, ఎన్నికల నిర్వహణ వంటి కీలక నిబంధనలు కొనసాగుతాయి. ట్రాన్స్‌జెండర్ సభ్యునికి ప్రాతినిధ్యం కల్పించడం, పాత ఎన్నికల అనర్హత నిబంధనలను తొలగించడం వంటి మార్పులు ప్రతిపాదించారు. ఆస్తి పన్నులో వార్షిక అద్దె విలువ స్థానంలో మూలధన విలువ విధానం, స్వీయ అంచనా, సమగ్ర ప్రాపర్టీ ఐడీ కోడ్, సకాలంలో పన్ను చెల్లింపుదారులకు రాయితీలు అమలు చేయనున్నారు. భవనాలకు డీమ్డ్ అప్రూవల్, అన్ని వ్యాపారాలకు ఒకే ట్రేడ్ లైసెన్స్, జీఐఎస్ ఆధారిత వీధుల అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రోత్సాహం వంటి చర్యలకు బిల్లు అవకాశం కల్పిస్తోంది. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, విపత్తు నిర్వహణ, ట్రాఫిక్, వాతావరణ మార్పు, వారసత్వ పరిరక్షణ, లింగ సమానత్వం వంటి అంశాల కోసం ప్రత్యేక సంస్థలు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్, క్యూర్ స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్, సమగ్ర డిజిటల్ పోర్టల్, ఒకే యుటిలిటీ బిల్లు, వేగవంతమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలను ప్రతిపాదించారు. ముసాయిదా బిల్లుపై ప్రజలు, నిపుణులు తమ అభిప్రాయాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది.

# మహాత్మాగాంధీ మెమోరియల్ వద్ద ఘనంగా అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం



**టెక్సాస్ (జనంసాక్షి) :** డాలస్ ఇర్వింగ్ నగరంలోని మహాత్మాగాంధీ మెమోరియల్‌లో అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ ఆధ్వర్యంలో జరిగినన ఈ వేడుకల్లో ప్రవాస భారతీయులు, వివిధ భారతీయ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇర్వింగ్ మేయర్ యాల్ జపంటా మాట్లాడుతూ.. అమెరికా అభివృద్ధిలో ప్రవాస భారతీయుల పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు. ఇర్వింగ్ నగర ప్రగతికి తోడ్పడుతున్న ప్రవాస భారతీయులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక అతిథిగా హాజరైన టెక్సస్ రాష్ట్ర ప్రతినిధి మ్యాట్ షాహీన్ మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాలుగా టెక్సస్‌లో స్థిరపడిన ప్రవాస భారతీయులు టెక్నాలజీ, విద్యా, వైద్య రంగాలలో తమ ప్రతిభను చూపుతూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తద్వారా అమెరికా జీడీపీ వృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. 50 మందికి పైగా "స్వర స్వాతి సింగింగ్ గ్రూప్" చిన్నారులు అమెరికా జాతీయగీతంతో సహా అనేక అమెరికా దేశభక్తి గీతాలు ఆలపించడం హర్షణీయమని అన్నారు. ఈ దేశ భవిష్యత్ ఈ యువత చేతిలోనే ఉందని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ .. "ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ప్రజాస్వామ్య దేశాలలో ఒకటైన అమెరికా స్వాతంత్ర్యానికి 250 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఒక చారిత్రక ఘట్టం అన్నారు. ఈ రెండున్నర శతాబ్దాల ప్రయాణంలో అమెరికా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. తమ కలలను సాకారం చేసుకునేందుకు ప్రపంచంలోని అనేక దేశాల నుంచి వచ్చిన ప్రజలు వారితో పాటు తీసుకు వచ్చిన తమ భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, ప్రతిభతో ఈ దేశాన్ని మరింత సుసంపన్నం చేశారు. భారతీయ మూలాలున్న అమెరికన్లకు విద్య, ఉపాధి, వ్యాపారం, శాస్త్ర సాంకేతిక రంగాలు, వైద్యం, ప్రజాసేవ ఇలా ప్రతి రంగంలోనూ ఎదగడానికి ఈ దేశం విశాలమైన అవకాశాలను కల్పించింది అందుకు కృతజ్ఞతలు అన్నారు. మన భారతీయ సంస్కృతిని, విలువలను కాపాడుకుంటూ మనం అమెరికా సమాజంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం మనకు హక్కులను మాత్రమే ఇవ్వదు; బాధ్యతలను కూడా గుర్తు చేస్తుంన్నారు. మనకు లభించిన స్వేచ్ఛను గౌరవించండి.. వైవిధ్యాన్ని ఆదరించండి.. నిజాయితీని ఆచరించండి.. మానవత్వాన్ని పెంపొందించండి.. విభేదాల కంటే ఐక్యతను, స్వార్థం కంటే సేవాభావాన్ని, ద్వేషం కంటే ప్రేమను ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు. మహాత్మాగాంధీ మెమోరియల్ బోర్డ్ సభ్యులు రావు కల్వల, తయాబ్ కుండావాలా, మహేంద్ర రావు, రాజేంద్ర వంకా వాలా, రాంకీ చేబ్రోలు, దీపక్ కార్లా, అనంత మల్లవరపు, ముర్తుజా భాయ్, సోనిట్ సింగ్, కలై కృష్ణమూర్తితో సహా అనేక సంఘాల ప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అమెరికా 250 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ప్రత్యేక గీతాలతో పిల్లకు తర్ఫీదు ఇచ్చి, 50 మందికి పైగా చిన్నపిల్లలతో దేశభక్తి గీతాలను పాడించిన స్వర స్వాతి సింగింగ్ గ్రూప్ అధినేత స్వాతి కుప్పిలికి, సహకరించిన పిల్లల తల్లిదండ్రులకు, కార్యకర్తలకు, ముఖ్యఅతిథిగా హాజరైన ఇర్వింగ్ మేయర్ యాల్ జపంటా, ప్రత్యేక అతిథి టెక్సస్ రాష్ట్ర ప్రతినిధి మ్యాట్ షాహీన్ కు రావు కల్వల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## రోడ్డు ప్రమాదంలో శంభీపూర్ రాజుకు గాయాలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందంతో కలిసి వరంగల్ జిల్లాలోని కన్నెపల్లి పంప్ హౌస్‌ను పరిశీలించేందుకు వెళ్తుండగా, యాదాద్రి భువనగిరి జిల్లా వీరా హోటల్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నాయకుల కాన్వాయ్‌లోని రెండు కార్లు ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన ఛాతి భాగంతో పాటు శరీరంలోని ఇతర భాగాలకు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రమాదం జరిగిన వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు అత్యవసర విభాగంలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. శంభీపూర్ రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద వెంటనే ఆసుపత్రికి చేరుకుని శంభీపూర్ రాజును పరామర్శించారు.

# జహీరాబాద్ శిశువు మృతి ఘటనపై సర్కార్ సీరియస్

- ఉన్నతస్థాయి విచారణకు ఆదేశం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో కమిటీ రంగంలోకి..
- నిర్లక్ష్యం తేలితే బాధ్యులపై కఠిన చర్యలు హెచ్చరిక

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 05 (జనంసాక్షి) :** జహీరాబాద్ ప్రభుత్వ హాస్పిటల్‌లో నవజాత శిశువు మృతి ఘటనను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్రంగా పరిగణించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తును మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉన్నతస్థాయి విచారణ కమిటీని ప్రిన్సిపల్ సెక్రటరీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సంగారెడ్డి డీసీహెచ్ఎస్ డాక్టర్ కవిత, గాంధీ గైనకాలజీ యూనిట్ హెచ్‌వోడీ, డాక్టర్ శోభ, మహేశ్వరం మెడికల్ కాలేజీ గైనకాలజీ ప్రొఫెసర్, డాక్టత్ అనిత, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ నరేందర్ సభ్యులుగా ఉన్నారు. డాక్టర్ కవిత జహీరాబాద్ హాస్పిటల్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. కమిటీలోని మిగతా సభ్యులు హైదరాబాద్ నుంచి జహీరాబాద్‌కు వెళ న్నారు. బాధిత మహిళ హాస్పిటల్‌లో చేరినప్పటి నుంచి ఆమెక అందించిన వైద్య సేవలు, నవజాత శిశువుకు అందించిన చికిత్స, హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, విధుల్లో ఉన్న డాక్టర్లు, సిబ్బంది బాధ్యతలు తదితర అన్ని అంశాలపై కమిటీ సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించనుంది. కమిటీ నివేదిక అందిన వెంటనే, ఒకవేళ ఏదైనా నిర్లక్ష్యం జరిగి ఉంటే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రోగుల భద్రత, వైద్య సేవల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించదని మంత్రి స్పష్టం చేశారు.

# అండర్ 11 మినీ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - 2026 ప్రారంభం





**హైదరాబాద్ (జనంసాక్షి) :** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 11 - మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - 2026" పోటీలు నాచారం లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించబడనున్న ఈ రాష్ట్రస్థాయి క్రీడా వేడుకకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, బ్యాడ్మింటన్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ 200 మంది నుండి 8 మందిని ఎంపిక చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బీఏఎంఎండీ అధ్యక్షులు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఉపాధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా బ్యాడ్మింటన్ వంటి క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులను అన్ని విధాలా అండగా వుంటుంది అని ఆయన అన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నేను కూడా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో దీూవీవీణ కృషి చేస్తోందని ఉప్పల శ్రీనివాస్ గుప్త తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మంచి ప్రతిభ బయటకు వస్తోందని, అలాంటి క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించేందుకు అసోసియేషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌కు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఈవెంట్స్ ఇంఛార్జి బాబు, వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి కుమార్ మంచిర్యాల బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి మధు, మేడ్చల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ కార్యదర్శి రమేశ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోశాధికారి హర్ష, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీతల్ క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370